అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
బుధవారం 20-3-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 32
Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam
12 పేజీలు వెల : 6.50

లెక్కలెక్కే..



- కార్పొరేట్ల-మతపరమైన సంబంధాలు ఉన్నా.. వివరాలు వెల్లడించాల్సిందే : సుప్రీం
- స్వాగతించిన సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ : కార్పొరేట్ల - మతపరమైన సంబంధాలు ఉన్నప్పటికీ.. బాండ్లపై ఉండే యూనిక్ నెంబర్లతో సహా అన్ని వివరాలను అందించాలని సుప్రీంకోర్టు సోమవారం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)ని ఆదేశించింది. ఆల్ఫా న్యూమరిక్ నెంబర్లు, ఎలక్టోరల్ బాండ్ల సీరియల్ నెంబర్లను బహిర్గతం చేయడాన్ని వ్యతిరేకిస్తూ మూడు ప్రధాన పరిశ్రమల ఛాంబర్లు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ), అసోచామ్, భారత వాణిజ్య సమాఖ్య (సీఐఐ)లు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ 11లో

ఎన్నికల ప్రచారానికి ఇవీ షరతులు




- తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు, రాజకీయపార్టీలు అనుసరించాల్సిన విధివిధానాలపై ఎన్నికల సంఘం స్పష్టత ఇచ్చింది. షరతులనూ ప్రకటించింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు బైక్ ర్యాలీలు, రోడ్ షోలు నిబంధనలకు లోబడే ఉండాలని పేర్కొంది. పై ర్యాలీల్లో ఎన్ని వాహనాలు పాల్గొంటాయో ముందస్తుగా 10లో

కోర్టుకు హాజరుకండి



- యోగా బాబాకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : కోర్టు ధిక్కరణ కేసులో న్యాయస్థానం ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని యోగా గురు రాందేవ్ బాబాను, ఆయన యాజమాన్యంలోని పతంజలి ఆయుర్వేద్ సంస్థ ఎండీ ఆచార్య బాలకృష్ణను సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. ఆరోగ్య రక్షణకు సంబంధించి పత్రికలలో ప్రజలను తప్పుదోవ 11లో

గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్


వర్గీస్ (ఫైల్)


- నలుగురు మావోయిస్టులు మృతి
- ఆయుధాలు, ఇతర వస్తువులు స్వాధీనం
- మరణించిన నలుగురిపై రూ.36 లక్షల రివార్డు

ముంబయి/చర్ల : మహారాష్ట్రలోని గడ్చిరోలిలో పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఎన్‌కౌంటర్ తర్వాత అధికారులు ఏకే-47 రైఫిల్, ఒక కార్బైన్, స్థానికంగా తయారు చేసిన రెండు పిస్టల్స్, నక్సల్ సాహిత్యం, ఇతర 11లో

అంతా నా ఇష్టం..!

ప్రభుత్వ వనరులతో ప్రధాని డిజిటల్ ప్రచారం...

- వాట్సాప్ సందేశాలు పంపుతున్న మోడీ
- పదేండ్ల పాలన ఎలా ఉందో చెప్పాలని సూచన
- విదేశీయులకూ మెస్సేజీలు
- చేష్టలుడిగిన ప్రభుత్వ యంత్రాంగాలు
- పాలక పక్షానికి దాసోహం



ఎన్నికల సీజన్‌లో ప్రధాని నరేంద్ర మోడీ అంతా తానై వ్యవహరిస్తుంటారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్... ఇలా మాధ్యమం ఏదైనా ఆయన వదిలిపెట్టరు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో 400కు పైగా స్థానాలు గెలుచుకోవడమే ఆయన లక్ష్యం. అందుకోసం ప్రసార మాధ్యమాలన్నింటినీ ఆయన విరివిగా వాడుకుంటారు. అందివచ్చిన ఏ అవకాశాన్నీ వదులుకోరు. అవసరమైతే అధికార దుర్వినియోగానికీ వెనుకాడరు. తాజాగా ప్రధాని నుండి ఓటర్లకు వాట్సాప్ సందేశం ఒకటి వచ్చింది. అది ఓ లేఖ రూపంలో ఉంది. దానికి సమాధానం ఇవ్వాలని కూడా ఆయన కోరారు. "వికసిత్ భారత్ సంపర్క్" నుంచి వచ్చిన ఈ లేఖ ఓ గొప్ప ప్రచార వ్యూహం తప్ప మరోటి కాదు. ఎన్నికల ప్రచారం కోసం ప్రధాని ప్రభుత్వ వనరులను యధేచ్ఛగా ఉపయోగించుకుంటున్నారని చెప్పడానికి ఇదే ప్రత్యక్ష సాక్ష్యం.

న్యూఢిల్లీ : 'వికసిత్ భారత్ సంపర్క్' నుంచి ప్రజలకు వాట్సప్ సందేశాలు వస్తున్నాయి. పది సంవత్సరాల మోడీ పాలనపై అందులో ప్రజాభిప్రాయాన్ని కోరారు. 'గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం నుంచి ఈ లేఖను పంపుతున్నాము. గత పది సంవత్సరాల కాలంలో భారత ప్రభుత్వం అమలు చేసిన వివిధ పథకాల ద్వారా 140 కోట్ల మందికి పైగా ప్రజలు ప్రయోజనం పొందారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ప్రయోజనం పొందుతారు. వికసిత్ భారత్ ఆకాంక్షల సాధనకు మీ సూచనలు ఎంతో ముఖ్యం. కాబట్టి దయచేసి మీ సలహాలు, సూచనలు అందించండి' అని ఆ లేఖలో సూచించారు. వికసిత్ భారత్, పబ్లిక్ అండ్ గవర్నమెంట్ సర్వీస్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, భారత ప్రభుత్వం, ఎలక్ట్రానిక్స్ నికేతన్, 6, సీజీఓ కాంప్లెక్స్, లోధీ రోడ్డు, న్యూఢిల్లీ చిరునామాతో ఈ సందేశాలు పంపుతున్నారు. సిటిజన్ వేదిక 'మైగవ్' ద్వారా ఈ ప్రచారం సాగుతోంది. డిజిటల్ ఇండియా కార్పొరేషన్‌లో మైగవ్ ఓ భాగం. ఇది ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ కింద పనిచేసే సెక్షన్ 8 కంపెనీ.

ఇదే మొదటిసారి కాదు...

వాట్సాప్ అకౌంట్ ఉన్న ప్రతి భారతీయుడికీ ఈ ప్రచార సందేశాన్ని పంపారు. మైగవ్‌లోని ప్రభుత్వ వనరులను ఉపయోగించుకొని సందేశాల ద్వారా ప్రచారం నిర్వహించడం ఇది మొదటిసారి కాదు. ఇటీవల 'మేరా పెహలా ఓట్-దేశ్ కే లియే' పేరిట చేపట్టిన 3లో

అది కోడ్ ఉల్లంఘనే

- మోడీ వాట్సాప్ సందేశాలపై చండీగఢ్ ఎన్నికల సిబ్బంది స్పష్టీకరణ : ఈ అంశంపై ఈసీఐకి సిఫారసు 3లో


సోనియాతో మాట్లాడుతున్న ఖర్గే

లోక్‌సభ ఎన్నికలకు పాంచ్ న్యాయ్

కాంగ్రెస్ మ్యానిఫెస్టో రెడీ

- ఆమోదించిన సీడబ్ల్యూసీ... త్వరలో విడుదల
- మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతిదీ అమలు
- దేశం మార్పును కోరుకుంటోంది : మల్లికార్జున్ ఖర్గే

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టోకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ఆమోదం తెలిపింది. మంగళవారం నాడిక్కడి ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో మూడు గంటల పాటు జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో మ్యానిఫెస్టోలోని ముఖ్య అంశాలను పీ.చిదంబరం చదివి వినిపించారు. చిదంబరం నేతృత్వంలో మ్యానిఫెస్టో కమిటీ తయారు చేసిన ముసాయిదాను ఆమోదం కోసం సీడబ్ల్యూసీకి అందించింది. ఆయా అంశాలపై చర్చనంతరం మొత్తం 25 గ్యారంటీల అమలుకు సీడబ్ల్యూసీ ఆమోదం తెలిపింది. 'పాంచ్ న్యాయ్' పేరుతో ఐదు అంశాలతో 25 గ్యారంటీల మ్యానిఫెస్టోను ఖరారు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన జరిగిన 11లో

తెలంగాణ నూతన గవర్నర్‌గా రాధాకృష్ణన్

నేడు బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర నూతన గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. తమిళిసై సౌందర రాజన్ రాజీనామాతో ఝార్కండ్ గవర్నర్‌గా ఉన్న రాధాకృష్ణన్‌కు అదనంగా తెలంగాణ బాధ్యతలు అప్పగించారు. పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా కూడా ఆయనకే అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో రాధాకృష్ణన్ మంగళవారం రాత్రి 9.10 గంటలకు రాంచీ నుంచి బయల్దేరి.. 10.55 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. నూతన గవర్నర్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పలువురు అధికారులు విమానాశ్రయంలో స్వాగతం పలికారు. బుధవారం ఉదయం 11.15 గంటలకు రాధాకృష్ణన్ హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారు.



వ్యవసాయ ఎజెండాయే మా లక్ష్యం

రైతులు, వ్యవసాయ సమస్యలపై నేషన్ ఫర్ ఫార్మర్స్ నివేదిక విడుదల

- స్వామినాథన్‌కు భారతరత్న ఇచ్చి ఆయన నివేదికను చెత్తబుట్టలో వేస్తారా? : పీ. సాయినాథ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని వ్యవసాయ సమస్యలపై కిసాన్-మజ్దూర్ కమిషన్ రూపొందించిన 'వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించిన ఎజెండా-2024'ని నేషన్ ఫర్ ఫార్మర్స్ ప్రతినిధులు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు విడుదల చేశారు. మంగళవారం నాడిక్కడ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పీసీఐ)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేషన్ ఫర్ ఫార్మర్స్ ఏర్పాటు చేసిన కిసాన్-మజ్దూర్ కమిషన్ దేశంలో భూపరిశీలన ఇంకా పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రజలు, అన్ని రంగాల నిపుణులతో కూడిన నివేదికను కమిషన్ తయారు చేసింది. భూమి, నీరు తదితర హక్కులు, కౌలుదారుల జాబితాను తయారు చేసి వారికి కేంద్ర పథకాల్లో ప్రాతినిధ్యం కల్పించడం, మహిళా రైతులను గుర్తించి వారికి భూమిపై హక్కు కల్పించడం, అటవీ చట్టాల నిబంధనలను ఉపసంహరించుకోవడం, గిరిజన రైతులకు రక్షణ తదితరాలు ప్రధాన సూచనలు అందులో పేర్కొన్నట్టు తెలిపింది. 'రైతులను అప్పుల బాధ నుంచి తప్పించేందుకు బ్యాంకు రుణాలకు భరోసా కల్పించాలి. డిజిటల్ అడ్డంకులు లేని సార్వత్రిక ఆహార ధాన్యాల పంపిణీ, విద్య, వైద్యం ప్రభుత్వ రంగంగా మార్చాలి. ఉపాధి హామీ చట్టంలో 200 రోజుల ఉపాధి హామీని అమలు చేయాలి" అని కోరింది.


మాట్లాడుతున్న పాలగుమ్మి సాయినాథ్

ఈ సందర్భంగా ప్రముఖ జర్నలిస్టు పీ.సాయినాథ్ మాట్లాడుతూ రైతుల మద్దతు ధరను నిర్ధారిస్తూ వచ్చిన నివేదికను కేంద్ర ప్రభుత్వం చెత్తబుట్టలో వేసి, ఆ నివేదిక రూపకల్పన చేసిన ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ఇచ్చిందని విమర్శించారు. పంజాబ్-హర్యానా సరిహద్దుల్లో రైతులపై డ్రోన్ యుద్ధం జరిగిందని పేర్కొన్నారు. "మోడీ ప్రభుత్వం ఎవరితో పోరాడుతోంది? రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని మోడీ హామీ ఇచ్చారు.

కానీ రాబడులు పడిపోయాయి. సుమారు లక్ష మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు" అని సాయినాథ్ విమర్శించారు. విలేకరుల సమావేశంలో ఏఐకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూకృష్ణన్, ఉపాధ్యక్షుడు హన్నన్ మొల్లా, కోశాధికారి పీ. కృష్ణ ప్రసాద్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్, అఖిల భారత కిసాన్ ఖేత్ మజ్దూర్ సంఘటన్ జాతీయ అధ్యక్షుడు సత్యవాన్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్రం చేతిలో ఈడీ కీలుబొమ్మ

- ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఈడీ అరెస్ట్, రిమాండ్ ఉత్తర్వులపై కవిత సవాల్
- 537 పేజీలతో సుప్రీంలో ఫ్రెష్ పిటిషన్ దాఖలు
- నేడు సీజేఐ బెంచ్ ముందు మెన్షన్ చేసే అవకాశం
- కవిత కేసు విచారించే న్యాయమూర్తి బదిలీ



వివరాలు 10లో



మూడు వారాల్లో స్పందించండి

కేంద్రానికి 'సుప్రీం' నోటీస్

- సీఏఏ అమలుపై స్టే పిటిషన్లపై విచారణ ఏప్రిల్ 9కి విచారణ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో


2019 పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) అమలులోకి తెచ్చిన 2024 నాటి పౌరసత్వ (సవరణ) నిబంధనలపై స్టే కోరుతూ దాఖలైన పిటిషన్లపై అత్యున్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వ 10లో

తునికాకు పాట్లు



బీడీ ఆకు సేకరణలో అటవీశాఖ నిర్లక్ష్యం

- కాంట్రాక్టర్లు ముందుకు రాలేదనే సాకు
- రేటు విషయంలో సమన్వయ లోపం
- ఇతర రాష్ట్రాల్లో ఇప్పటికే మొదలైన ప్రూనింగ్
- కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ధోరణీ కారణమే..!
- ఏజెన్సీ వాసులకు ఉపాధి లేక ఆర్థిక భారం



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరి.. రాష్ట్ర అటవీశాఖ నిర్లక్ష్యం వల్ల ఏజెన్సీ వాసులు ఉపాధికి దూరమవుతున్నారు. తునికాకు ద్వారా లభించే ఉపాధి, ఆదాయాలు కోల్పోతున్నారు. ప్రభుత్వాలు సైతం పన్నులు, ఎగుమతుల రూపంలో వచ్చే రెవెన్యూను పొందలేకపోతున్నాయి. అటవీ ప్రయివేటీకరణ నిబంధనలకు తలొగ్గిన కేంద్రం పెద్దపులులు సంచరిస్తున్నాయనే పేరుతో తునికాకు సేకరణను నిలిపివేయాలనే కుట్రపూరిత వైఖరితో వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి. కార్మికుల ఉపాధి కొట్టే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం ముమ్మరం చేస్తుంటే.. రాష్ట్ర అటవీశాఖ నిర్లక్ష్యం దానికి ఊతమిచ్చే అంశంగా మారుతోందని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆరోపిస్తోంది.

అటవీశాఖ నిర్లక్ష్యం.. ఆదివాసీల పాట్లు

అటవీశాఖ నిర్లక్ష్యం ఫలితంగా ఆదివాసీలు ఆదాయ, ఉపాధిని కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారు. డిసెంబర్‌లో నిర్వహించాల్సిన టెండర్లు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నేటికీ కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 97 యూనిట్ల టెండర్లు మాత్రమే పూర్తయ్యాయి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, చివరకు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోనూ టెండర్లు డిసెంబర్ నాటికే పూర్తయ్యాయి. ఒకప్పుడు ఉమ్మడి భద్రాచలం డివిజన్‌లో అంతర్భాగంగా ఉండి ఇప్పుడు ఏపీలో కలిసి చింతూరు, వీఆర్‌పురం, ఎటపాక యూనిట్లలోనూ టెండర్లు పూర్తయ్యి.. ప్రూనింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. కానీ రాష్ట్రంలో ఫిబ్రవరి నుంచి టెండర్లు మొదలయ్యాయి. రేటు విషయంలో కాంట్రాక్టర్లు, అటవీశాఖకు మధ్య సమన్వయం లోపించడమే ఈ ఆలస్యానికి ప్రధాన కారణంగా ఆదివాసీ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికీ మూడు దఫాలుగా పిలిచినా టెండర్లకు కాంట్రాక్టర్లు ముందుకు రావట్లేదనే అటవీశాఖ వాదనను ఆదివాసీ సంఘాలు తప్పు పడుతున్నాయి. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే రేటు తగ్గించాలి.. గుత్తేదారులు ముందుకు 2లో

ఆమె హక్కుల గొంతుక

ఓ పోరాట యోధ.. ప్రజా పక్షపాతి.. గొప్ప మానవతావాది

- మల్లు స్వరాజ్యం వర్ధంతి సభలో వక్తలు
- మెడికల్ క్యాంపు ప్రారంభించిన శాంతా సిన్హా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'మల్లు స్వరాజ్యం ఉద్యమ కారిణే కాదు..గొప్ప మానవతా వాది. మహిళా హక్కుల కోసం జీవితాంతం పోరాడారు. ఆమె చాలా ధైర్యవంతురాలు' అని జాతీయ బాలల హక్కుల కమీషన్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ శాంత సిన్హా అన్నారు. ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతి సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని వీరనారి ఐలమ్మ భవన్‌లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును శాంతసిన్హా ప్రారంభించారు. అనంతరం స్వరాజ్యం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐద్వా అధ్యక్షురాలు ఆర్ అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన సభలో శాంతసిన్హా మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం నిరంతరం ప్రజల, ముఖ్యంగా మహిళల బాధలగురించి ఆలోచించారని తెలిపారు. పూర్తి జీవితం ప్రజల పక్షాన నిలబడి పోరాడిన ధీరవనిత ఆమె అని చెప్పారు. అలాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారన్నారు. ఇప్పటికీ ఆమె గురించి జనం కథలు కథలుగా చెప్పుకోవటం విశేషమన్నారు. సమాజ హితం కోసం ఆమె జీవితాన్ని త్యాగం చేశారని చెప్పారు. చదువుతోనే జ్ఞానం వస్తుందనీ, 11లో


మల్లు స్వరాజ్యానికి నివాళి అర్పిస్తున్న ఐద్వా నేతలు



చెత్తాచెదారం తొలగింపు

- నవతెలంగాణ కథనానికి స్పందన
- అధికారులతో జీహెచ్ఎంసీ కమిషనర్ సమీక్ష

నవతెలంగాణ-సిటీబ్యూరో

'పేరు గొప్ప.. ఊరు దిబ్బ..' శీర్షికతో నవతెలంగాణలో మంగళవారం వచ్చిన కథనానికి జీహెచ్ఎంసీ అధికారులు స్పందించారు. ఈ మేరకు నగరంలోని పలు ప్రాంతాల్లో చెత్తచెదారాన్ని తొలగించారు. సోమవారం నవతెలంగాణ దినపత్రికలో 'మహానగరంలో అపరిశుభ్రత నెలకొంది. అధికారుల నిర్లక్ష్యంతో పలు ప్రాంతాలు వీధులు, రోడ్లు చెత్తకుప్పలుగా మారుతున్నాయి.. ఫ్లైఓవర్ల కింది భాగం(పిల్లర్ల వద్ద) చెత్తాచెదారం పేరుకుపోయి కంపుకొడుతోంది' అంటూ ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు తెలుగు తల్లి ఫ్లైఓవర్ సమీపంలోని చెత్తతోపాటు పలు ప్రాంతాల్లో చెత్తను తొలిగించారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జోనల్ కమిషనర్లు, హెల్త్ అండ్ శానిటేషన్ విభాగం అధికారులతో పారిశుధ్య నిర్వహణపై జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ సమావేశం నిర్వహించారు. నగరంలో సీ అండ్ డీ వేస్టేజ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఏఎంహెచ్ఓలను కమిషనర్ ఆదేశించారు. ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం, స్ట్రీట్ స్వీపింగ్ మిషన్స్ పర్యవేక్షణ, జీవీపీల తొలగింపు, సీ అండ్ డీ వేస్టేజ్ తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. పలు ప్రాంతాలలో నిర్మాణాలు చేపడుతున్న వారయ నిర్మాణ సామాగ్రిని రోడ్డుపైనే వేస్తున్నారని, అలాంటి వారికి జరిమానా విధించాలన్నారు. అలాగే రోడ్లపై చెత్త వేయకుండా బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు.


రైతులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన

నవతెలంగాణ - ముస్తాబాద్

అకాల వర్షంతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్ మండలంలోని పోతుగల్, గన్నెవారిపల్లె, సేవాలాల్ తండా గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. వ్యవసాయ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలన్నారు. ముస్తాబాద్‌లో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి భారీ చెట్టు విరిగి విద్యుత్ స్తంభంపై పడటంతో మృతిచెందిన ఎల్లసాని ఎల్లయ్య కుంటుమాన్ని పరామర్శించారు. వినోద్‌కుమార్ వెంట ఎంపీపీ శరత్‌రావు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు గోపాలరావు, విద్యుత్ సహకార సంఘం డైరెక్టర్ అంజి రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, నాయకులు సర్వర్ పాషా ఉన్నారు.

ఈదురుగాలులు, వడగండ్లు

రెండ్రోజులుగా పలు జిల్లాల్లో ఈదురుగాలులు, వడగండ్లతో కూడిన వర్షం కురుస్తోంది. గాలులకు చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. పైర్లు నేలకొరిగాయి. కొద్ది రోజుల్లో చేతికందాల్సిన వరి ధాన్యం, మొక్కజొన్న తదితర పంటలు నేలపాలైన రైతులు లబోదిబోమంటున్నారు. హైదరాబాద్‌లోనూ పలుచోట్ల చిరుజల్లులు కురిశాయి. కామారెడ్డి, సంగారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లో భారీ వర్షం కురిసింది.





నవతెలంగాణ- విలేకరులు

ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. సిరికొండ మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో భారీ వర్షానికి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రోడ్లపై చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. లక్కంపూర్ గ్రామంలో పలు ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. ఇండ్లల్లోకి వర్షపు నీరు చేరింది. ఆదిలాబాద్ మండలంలోని అంకోలి గ్రామంలో వడగండ్ల వానతో జొన్న పైరు నేలకొరిగింది. ఏపుగా పెరిగి చేతికందే దశలో ఉన్న జొన్న పంట నేలకొరిగి తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఎక్కంటి దత్తు, పూదరి శేఖర్, లచ్చన్న, అంగ పోశెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. తంతోలి, అంకోలి, కచ్‌కంటి, బూర్నూర్ గ్రామాల్లోనూ వడగండ్ల వాన కురిసింది. ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోనూ వడగండ్ల వర్షం కురిసింది. దీంతో చెట్లు నేలకొరిగాయి.

అకాల వర్షాల వల్ల ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా

అకాల వర్షంతో పంటలకు నష్టం

- ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో వర్షాలు

పంట నష్టమేర్పడుతుంది. సంగారెడ్డి జిల్లాలోని న్యాల్‌కల్, ఝరాసంగం, కంగ్టి, నారాయణఖేడ్, రాయికోడ్, అందోల్, మునిపల్లి, నిజాంపేట, నార్సింగ్ మండలాల్లో వరి, మొక్కజొన్న, జొన్న, మామిడి వంటి పంటలకు నష్టమేర్పడింది. ఈదురు గాలుల వల్ల పైర్లు నేలవాలాయి. మామిడి కాయలు, పూత రాలిపోయింది. చేతికొచ్చే దశలో నీటి ఎద్దడితోపాటు అకాల వర్షాల వల్ల నష్టమేర్పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



విద్యుత్ స్తంభం కూలి వ్యక్తి మృతి

నవతెలంగాణ - ముస్తాబాద్

భారీ వడగండ్ల వర్షానికి రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో సోమవారం రాత్రి భారీ చెట్టు విరిగి విద్యుత్ స్తంభంపై పడటంతో ఎల్లసాని ఎల్లయ్య(55) మృతిచెందాడు. చెట్లు నేల కూలి రహదారికి అడ్డంగా పడటంతో ఎస్ఐ శేఖర్ రెడ్డి మంగళవారం జేసీబీలు, కూలీలతో తొలగించి ట్రాఫిక్ పునరుద్దరించారు. విద్యుత్ స్తంభాలు విరగడంతో మరమ్మతులు చేపట్టి, కూలిన చెట్లను తొలగించేందుకు ఇన్‌చార్జి ఈవో శ్రీనివాస్, విద్యుత్ అధికారులు సాయంత్రం వరకు శ్రమించారు. అకాల వర్షానికి నష్టపోయిన రైతులను చనిపోయిన ఎల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

తునికి పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

రాబట్టే కదా..! సగం యూనిట్ల టెండర్లు పూర్తి చేయగలిగింది అనే ప్రశ్న లేవనెత్తుతున్నారు.

ఆదివాసీకి హక్కు.. తునికాకు

అటవీహక్కు చట్టం-2006 ప్రకారం ఆదివాసీ గిరిజనులకు తునికాకు సేకరణ చిన్న తరహా అటవీ ఉత్పత్తుల కిందకు వస్తుంది. దీనిద్వారా అటు ఆదివాసీలకు, ఇటు ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. విదేశీ మారక ద్రవ్యం కూడా ప్రభుత్వానికి అందుతుంది. అటవీ హక్కు చట్ట ప్రకారం తునికాకు సేకరించడం ఆదివాసీల హక్కు. పులుల సంరక్షణ ప్రభుత్వ బాధ్యత. కానీ ఈ సాకుతో ఆకు సేకరణ నిలిపివేయడం ఏమాత్రం సరికాదని ఆదివాసీ సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఈ పేరుతో ఆసిఫాబాద్ డివిజన్‌లో కవ్వాల్ టైగర్ జోన్, మైనింగ్ పేరుతో ప్రతియేటా తునికాకు యూనిట్లు తగ్గిస్తూ వస్తున్నారు. గతేడాది కేవలం రెండు యూనిట్లకే టెండర్లు పిలిచారు. కాగజ్‌నగర్ డివిజన్‌లోనూ 13కు 9 యూనిట్ల టెండర్లే చేశారు. ఈ విధంగా ప్రభుత్వాలు ప్రతియేటా యూనిట్లు, కల్లాలు తగ్గిస్తూ వస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం తునికాకు బోనస్‌ను కూడా పెండింగ్‌లో పెడుతోంది. 2016 తునికాకు బోనస్‌పై తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం పోరాటాలు నిర్వహించిన ఫలితంగా ఎన్నికల ముందు గత బీఆర్ఎస్ ప్రభుత్వం హడావుడిగా కొన్ని చెక్కులు పంపిణీ చేసింది. వేలాది మందికి బోనస్ పెండింగ్‌లో ఉంది.

ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా వేసవి మూడు నెలల్లో ఒక్కో గిరిజన కూలి సుమారు రూ.30వేల నుంచి రూ.50వేల వరకు ఆదాయాన్ని కోల్పోతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఆరు డివిజన్‌ల పరిధిలో గతేడాది కూడా సకాలంలో టెండర్లు చేపట్టకపోవడంతో ఆశించిన లక్ష్యాన్ని చేరలేకపోయింది. 60వేల స్టాండర్డ్ బ్యాగ్‌లకు గాను కేవలం 21,748 బ్యాగ్‌లు మాత్రమే సేకరించారు. ఈ ఏడాది 64,400 స్టాండర్డ్ బ్యాగ్‌లు లక్ష్యంగా నిర్దేశించారు. కానీ ఇప్పటికీ ప్రూనింగ్ ప్రకియ చేపట్టకపోవడంతో ఆకు ముదురుతోందని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.

అటవీశాఖ నిర్లక్ష్యమే కారణం : బండారు రవికుమార్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు

అటవీశాఖ నిర్లక్ష్యం, కేంద్ర ప్రభుత్వ అటవీ ప్రయివేటీకరణ ఫలితంగా తునికాకు సేకరణ మందకొడిగా సాగుతోంది. మూడు దఫాలుగా పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదనే మాట అటవీశాఖ నుంచి వినిపిస్తోంది. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే సగం యూనిట్ల టెండర్లు ఎలా పూర్తయ్యాయి?. అటవీశాఖ నిర్లక్ష్య ఫలితంగా ఒక్కో ఆదివాసీ కార్మికుడు రూ.30వేలకు పైగా ఆదాయాన్ని కోల్పోతున్నారు. పెళ్లిళ్ల, శుభకార్యాలు, పిల్లల చదువుకు వినియోగించే తునికాకు సేకరణ సకాలంలో చేపట్టకపోవడంతో అనేక మంది ఉపాధిని కోల్పోతున్నారు. ఏజెన్సీ వాసులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కార్మిక పాలసీ రూపొందించాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి సీఐటీయూ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజాపాలనలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలనీ, సంక్షేమం కోసం ప్రత్యేకంగా కార్మిక పాలసీ రూపొందించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన కోర్కెలను రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతతో పరిశీలించాలనీ, కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సానుకూలంగా పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు మంగళవారం వారు సీఎం రేవంత్‌రెడ్డికి వారు బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కార్మికరంగంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో ఉత్పత్తిని పెంచి సంపదను సృష్టిస్తున్న కోటి మందికిపైగా కార్మికుల శ్రమను గుర్తించాలనీ, వారికి మెరుగైన ప్రతిఫలం దక్కేలా వాస్తవ దృష్టితో పరిశీలించాలని విన్నవించారు. 'ప్రభుత్వ అధినేతగా ఫిక్కీ, చాంబర్ ఆఫ్ కామర్స్ వంటి యాజమాన్య సంస్థల సమావేశాలకు సీఎం హాజరవుతున్నారు. వారితో చర్చలు జరుపుతున్నారు. వ్యాపార-వాణిజ్య సంస్థలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తామని ప్రకటించారు. దావోస్‌లో పెట్టుబడిదారులకు రాయితీలిస్తాం...ఆటంకాల్లేకుండా రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టొచ్చని హామీనిచ్చారు. కానీ శ్రామికుల జీవన ప్రమాణాలకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుందని ప్రకటించకపోవడం సమంజసంగా లేదు' అని పేర్కొన్నారు. 73 రంగాలకు కొత్త జీవోల వల్ల కార్మికులకు పెరిగిన వేతనం శూన్యమని తెలిపారు. ప్రస్తుతం పొందే వేతనానికి కొత్త డీఏ పాయింట్లు కలిపి వదిలేశారని విమర్శించారు. కార్మికుల ఆకాంక్షలకు అనుగుణంగా నూతన ప్రభుత్వం పనిచేయాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో సంపద సృష్టికర్తలైన కోటి మందికిపైగా కార్మికులు, వారికి నాయకత్వం వహిస్తున్న కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల నాయకులకు సమస్యలపై చర్చించడానికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం మాదిరిగా సమ్మెలు, ఉద్యమాలు, పోరాటాలను అణిచివేయొద్దనీ, కార్మికశాఖను నిస్తేజం చేయొద్దని హితవు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డ సందర్శన, రాష్ట్రంలో ప్రధాని మోడీ పర్యటనల సందర్భంగా సీఐటీయూ నాయకులు, కార్మికులను ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు చేయడాన్ని తప్పుబట్టారు. రాష్ట్రంలో బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమ్ అంటూ కాంగ్రెస్, బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటే అంటూ బీఆర్ఎస్ విమర్శలు చేసుకోవడం తగదని హితవు పలికారు. దేశంలో మోడీ సర్కారు అవినీతి, కార్పొరేట్ విధానాలు అనుసరిస్తూ ప్రజల ఐక్యతకు విఘాతం కలిగిస్తున్నదని తెలిపారు. మౌలిక సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రాముడు, హిందూత్వ భావోద్వేగాలతో రాజకీయం చేస్తున్నదని విమర్శించారు. లౌకిక, రాజ్యాంగ స్ఫూర్తికి బీజేపీ విఘాతం కలిగిస్తున్న ఈ క్లిష్టపరిస్థితుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసికట్టుగా కేంద్రంపై పోరాడాలని పిలుపునిచ్చారు.

దండుమైలారంలో దారుణ ఘటన



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని దండుమైలారంలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. అయితే, హత్యకు గురైందని.. అందుకు ప్రేమ వ్యవహారమే కారణమని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతురాలి సోదరుడి ఫిర్యాదుతో ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. అందుకు సంబంధించి మృతురాలి సోదరుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

దండుమైలారం గ్రామానికి చెందిన మోతే జంగమ్మ- ఐలయ్య దంపతులకు ముగ్గురు పిల్లలు. పెద్ద కూతురు మోతే భార్గవి(19) నగరంలోని అనిబీసెంట్ మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమెకు మేనబావతో వివాహం చేసేందుకు కుటుంబ సభ్యులు నిర్ణయించారు. అయితే, యువతి మాత్రం అదే గ్రామానికి చెందిన మరో యువకుడిని ప్రేమించింది. తల్లి ససేమీరా అంగీకరించలేదు. సోమవారం సాయంత్రం భార్గవి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ప్రేమించాడని అనుమానిస్తున్న యువకుడు రాగా, అదే సమయంలో ఇంటికి వచ్చిన యువతి తల్లి మందలించడంతో వెళ్లిపోయాడు. కుమార్తెను కూడా తిట్టింది. తల్లీకూతురి మధ్య వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న భార్గవి సోదరుడు భయంతో బయటకు వెళ్లిపోయాడు. ఈ క్రమంలో కోపోద్రిక్తురాలైన తల్లి భార్గవిని నెట్టడంతో తల గోడకు తగిలింది. దాంతో అక్కడికక్కడే మృతిచెందింది. అయితే, ఉరేసుకుని చనిపోయినట్టుగా నమ్మించే ప్రయత్నం చేశారు. అనంతరం మృతురాలి సోదరుడు చరణ్ ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహంపై గాయాలను గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కానీ, భార్గవిని ప్రేమించిన యువకుడే హత్య చేసి పారిపోయాడని తల్లి ఆరోపిస్తోంది. ఈ క్రమంలో భార్గవి హత్యకు గల కారణాలతోపాటు ఆ ఘటనలో ఎవరెవరున్నారనే కోణంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టినట్టు ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు. ప్రేమ వ్యవహారంలో కొద్ది రోజులుగా కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నట్టు సమాచారం.

హేయమైన చర్య : సీపీఐ(ఎం)

ప్రేమించిన యువకుడినే పెండ్లి చేసుకుంటానని చెప్పిన యువతిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించడం హేయమైన చర్యని సీపీఐ(ఎం) ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి సీహెచ్ జంగయ్య, నాయకులు ఎ.వెంకటేష్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి ప్రేమ హత్యలు కొనసాగడం ఆందోళన కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. హత్యకు గల కారణాలను వెలికి తీసి దోషులను శిక్షించాలని పోలీసులను కోరారు.

ఎప్పటికీ అంతుచిక్కని రహస్యమే !

బీజేపీ జేబులోకే...

కోడ్ తెలిసినప్పటికీ 2018 మార్చి, 2019 ఏప్రిల్ మధ్య కొనుగోలు చేసిన బాండ్ల సమాచారం మాత్రం అంతుచిక్కని రహస్యంగానే మిగిలిపోతుంది. 2019 ఏప్రిల్ 12వ తేదీకి ముందు జరిగిన లావాదేవీల సమాచారం బయటపెట్టాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. కానీ ఆ సమయంలో కొనుగోలు చేసిన బాండ్ల విలువ అక్షరాలా నాలుగు వేల కోట్ల రూపాయలు. లోక్‌సభ ఎన్నికలకు ముందు చేతులు మారిన ఆ సొమ్ములో అధిక భాగం బీజేపీ జేబులోకే చేరిందన్నది నిర్వివాదాంశం.

● ఆ నాలుగు వేల కోట్ల రూపాయలు ఏమయ్యాయి? ● కొన్నది ఎవరు? ఏ పార్టీకి చేరాయి?

వివరాలపై ఆసక్తి చూపని సుప్రీంకోర్టు వెల్లడించని ఎస్‌బీఐ, ఈసీ



న్యూఢిల్లీ : ఆరు సంవత్సరాలుగా గుప్పిట మూసిన రహస్యాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాల పుణ్యమా అని ఎన్నికల బాండ్లకు సంబంధించిన సమాచారం దఫదఫాలుగా వెలుగులోకి వస్తోంది. అయితే ఈ సమాచారం పాక్షికమే. గందరగోళాన్ని కూడా సృష్టిస్తోంది. ఎందుకంటే 2019 ఏప్రిల్ 12వ తేదీకి ముందు నాలుగు వేల కోట్ల రూపాయల విలువ కలిగిన బాండ్ల లావాదేవీలు జరిగాయి. ఆ వివరాలు ఎప్పటికీ తెలిసే అవకాశం లేదు. సుప్రీంకోర్టు కూడా ఆ సమాచారాన్ని కోరడం లేదు. ఈ నెల 14, 17 తేదీలలో ఎన్నికల కమిషన్ కొంత సమాచారాన్ని అందించింది. ఈ నెల 21న మరిన్ని వివరాలు రాబోతున్నాయి. అయితే ఈ వివరాలన్నీ 2019 ఏప్రిల్ 12వ తేదీ నుండి ఈ ఏడాది జనవరి వరకూ జరిగిన లావాదేవీలకు సంబంధించినవే.

రెండు జాబితాలలో ఏముంది?

ఈ నెల 14న ఎన్నికల కమిషన్ రెండు జాబితాలను తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. 2019 ఏప్రిల్ 12వ తేదీ నుండి ఈ ఏడాది జనవరి వరకూ బాండ్లను కొనుగోలు చేసిన వారి వివరాలు తొలి జాబితాలో ఉన్నాయి. బాండును కొన్న తేదీ, దాని విలువ కూడా అందులో ఉంది. అత్యధికంగా బాండ్లను కొనుగోలు చేసింది ఓ లాటరీ కంపెనీ. మౌలిక సదుపాయాల కంపెనీలు, ఫార్మా కంపెనీలు కూడా ప్రధాన దాతలే. రిలయన్స్‌తో సంబంధమున్న సంస్థలు కూడా బాండ్లు కొనుగోలు చేశాయి. ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల దాడుల తర్వాత 21 కంపెనీలు బాండ్లను కొనుగోలు చేసినట్లు ఈ జాబితా ద్వారా అర్థమవుతోంది. ఇక రెండో జాబితాలో... రాజకీయ పార్టీలు ఏ తేదీన, ఎంత విలువ కలిగిన బాండ్లను నగదుగా మార్చుకున్నదీ తెలియజేశారు. వివిధ రాజకీయ పార్టీలకు రూ.16,492 కోట్ల మేర విరాళాలు అందగా వాటిలో ఒక్క బీజేపీ ఖాతాకే రూ.8,250 కోట్లు చేరాయి. అయితే ఈ జాబితాలలో బాండ్లపై ఉండే యూనిక్ కోడ్ నెంబర్లు కన్పించలేదు.

యూనిక్ కోడ్ తెలిస్తే...

ఎస్‌బీఐ నుండి ఇంకా ఎన్నికల కమిషన్‌కు అందాల్సిన సమాచారం చాలానే ఉంది. ముఖ్యంగా బాండ్ల యూనిక్ కోడ్లు తెలియాల్సి ఉంది. సుప్రీంకోర్టు తాజా ఆదేశాల మేరకు ఈ వివరాలన్నీ ఈ నెల 21న బయటపడే అవకాశం ఉంది. బాండ్ కోడ్ తెలిస్తే దానిని ఎవరు కొనుగోలు చేశారు? ఎవరికి అందజేశారు? ఏ పార్టీ దానిని నగదుగా మార్చుకుంది? వంటి ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయి. దాతలు, పార్టీల మధ్య క్విడ్‌ప్రోకో సంబంధాలు కూడా బయటపడతాయి.

ఆదే విధంగా 2019 ఏప్రిల్ 12వ తేదీకి ముందు కొనుగోలు చేసిన బాండ్ల వివరాలు కూడా లేవు.


దాతల వివరాలు ఇచ్చిన పార్టీలు ఇవే

ఎన్నికల కమిషన్ ఈ నెల 17న అందజేసిన సమాచారంలో మాత్రం 2019 ఏప్రిల్ 12వ తేదీకి ముందు కొనుగోలు చేసిన బాండ్లకు సంబం ధించి కొన్ని వివరాలు కన్పించాయి. 2019- 2023 మధ్య వివిధ రాజకీయ పార్టీలు తనకు అందించిన నివేదికలను ఈసీ అప్‌లోడ్ చేసింది. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే పలు పార్టీలు తాము ఏ తేదీన, ఎంత విలువ కలిగిన బాండ్లను నగదుగా మార్చుకున్నదీ ఈసీకి తెలియ జేశాయి.

డీఎంకే, అన్నా డీఎంకే, జనతాదళ్ (ఎస్) మాత్రమే దాతల పేర్లను వెల్లడించాయి. డీఎంకేకు లాటరీ కంపెనీ ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అత్యధికంగా విరాళం అందించింది. 2018లో జరిగిన కర్నాటక శాసనసభ ఎన్నికలకు ముందు జనతాదళ్ (ఎస్)కు ఇన్ఫోసిస్ కంపెనీ విరాళం ఇచ్చింది. అమ్‌ఆద్మీ, కాంగ్రెస్ పార్టీలు మాత్రం 2019లో తమకు విరాళాలు ఇచ్చిన దాతల పేర్లు మాత్రమే బయటపెట్టాయి.

ఒకే రోజు...ఒకే సంస్థ !

- జేపీకి రూ.200 కోట్ల విరాళం ఇచ్చిన 'క్విక్ సప్లయ్ చెయిన్'
- దానికి రిలయన్స్ గ్రూపుతో సంబంధాలు



న్యూఢిల్లీ : ఐదు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరగడానికి కొద్ది నెలల ముందు 2022 జనవరిలో ఒకే రోజు, ఒకే కంపెనీ బీజేపీకి రూ.200 కోట్ల విరాళం అందించింది. ఈ నెల 17న ఎన్నికల కమిషన్ తన వెబ్‌సైటులో అప్‌లోడ్ చేసిన వివరాల ఆధారంగా ఈ విషయం బయటపడింది. తనకు విరాళం ఇచ్చిన దాతల పేర్లను ఎన్నికల కమిషన్‌కు బీజేపీ వెల్లడించలేదు. కానీ బాండ్లు కొనుగోలు చేసిన తేదీని, వాటిని ఏ నగరంలో కొనుగోలు చేశారు అనే సమాచారాన్ని తెలిపింది. 2022 జనవరి ఐదవ తేదీన ఒక్కోటి కోటి రూపాయల విలువైన రెండు వందల బాండ్లను ముంబయిలో కొనుగోలు చేసి, బీజేపీకి విరాళంగా అందించారు.

'ది క్వింట్' అనే న్యూస్ పోర్టల్ ఆ విరాళానికి సంబంధించిన పత్రాలను అధ్యయనం చేసింది. ముంబయికి చెందిన క్విక్ సప్లయ్ చెయిన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ మాత్రమే 2022 జనవరి 5వ తేదీన రూ.200 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేసిందని తేల్చింది. ఈ కంపెనీకి రిలయన్స్‌తో సంబంధాలు ఉన్నాయి.

ఆ తేదీన మరే ఇతర కంపెనీ అంత విలువైన బాండ్లను కొనుగోలు చేయలేదని గత వారం ఎస్‌బీఐ విడుదల చేసిన జాబితాను బట్టి కూడా తెలుస్తోంది. ఆ తేదీన ముంబయికే చెందిన రెండు కంపెనీలు రూ.7 కోట్లు, రూ.25 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేశాయి.

క్విక్ సప్లయ్ చెయిన్ ప్రైవేట్ లిమిటెడ్ జనవరి 10న రూ.10 కోట్ల విలువైన బాండ్లను కొన్నది. రాష్ట్రాలలో శాసనసభ ఎన్నికలు జరగడానికి ముందు ఈ కంపెనీ మూడు సార్లు బాండ్లను కొనుగోలు చేయడం గమనార్హం. 2022 నవంబర్ 11న ఈ కంపెనీ రూ.125 కోట్ల బాండ్లను కొనుగోలు చేసింది. ఈ పద్దు బీజేపీ రికార్డులలోనూ కన్పించింది. 2023 నవంబర్ 17న ఈ సంస్థ మరో రూ.50 కోట్ల బాండ్లను కొన్నది. క్విక్ సప్లయ్ చెయిన్ కంపెనీ గిడ్డంగులు, స్టోరేజీ యూనిట్లను నిర్మిస్తుంది. దీనిలో డైరెక్టర్‌గా ఉన్న తపస్ మిత్రా పలు రిలయన్స్ గ్రూపు సంస్థల్లో కూడా డైరెక్టర్‌గా పనిచేశారు.

బహుజనుల అసలైన పార్టీ బీఆర్ఎస్

మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బహుజనుల అసలైన పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి వారు మాట్లాడారు. తమది బడుగు, బలహీన వర్గాల పార్టీ అయినందువల్లే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా బీఆర్ఎస్‌లో చేరారని గుర్తు చేశారు. తమ పార్టీలో ఉండే వారిని బెదిరిస్తూ లొంగదీసుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఉద్యమ సమయంలో ద్రోహం చేసిన వారే ప్రస్తుతం పార్టీని వీడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్‌ను టార్గెట్ చేయడంలో భాగంగానే ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ సర్కార్ కరువుతో ఎండిపోతున్న పంటల గురించి పట్టించుకోవడం మానేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఏప్రిల్ 3 నుంచి టెన్త్ స్పాట్ వాల్యుయేషన్

• 19 కేంద్రాల్లో 11 వరకు నిర్వహణ • షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన జవాబుపత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్) ప్రక్రియ వచ్చేనెల మూడో తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు మంగళవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈనెల 30 వరకు ప్రధాన పరీక్షలు, వచ్చేనెల ఒకటి, రెండు తేదీల్లో ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1, పేపర్-2తోపాటు ఒకేషనల్ పరీక్షలు జరుగుతాయని ఈ సందర్భంగా సంచాలకులు పేర్కొన్నారు. వచ్చేనెల మూడు నుంచి 11వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు టెన్త్ మూల్యాంకనం ప్రక్రియ జరుగుతుందని వివరించారు. 18 జిల్లాల్లో 19 మూల్యాంకన కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. హైదరాబాద్‌లో రెండు స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలున్నాయని పేర్కొన్నారు. మే మొదటి వారంలో పదో తరగతి ఫలితాలను విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు.

ముగ్గురు సీఎస్, ఇద్దరు డీవో, ఐదుగురు ఇన్విజిలేటర్ల తొలగింపు

పదో తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా మంగళవారం రెండోరోజు సెకండ్ లాంగ్వేజ్ పరీక్షను నిర్వహించామని ఎ కృష్ణారావు తెలిపారు. ఈ పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 4,94,426 మంది దరఖాస్తు చేస్తే, 4,92,967 (99.70 శాతం) మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు. 1,459 (0.30 శాతం) మంది గైర్హాజరయ్యారని వివరించారు. ప్రయివేటు విద్యార్థుల్లో 400 మంది దరఖాస్తు చేసుకుంటే, 214 (53.50 శాతం) పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. 186 (46.5 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. రెండోరోజు ఐదుగురు విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులను నమోదు చేశారని వివరించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఐదుగురు ఇన్విజిలేటర్లు, ముగ్గురు చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), ఇద్దరు డిపార్ట్‌మెంటల్ అధికారుల (డీవో)ను విధుల నుంచి తొలగించామని తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ముగ్గురు ఇన్విజిలేటర్లు, ఒక సీఎస్, ఒక డీవో, నాగర్ కర్నూల్ జిల్లాలో ఒక ఇన్విజిలేటర్, కరీంనగర్ జిల్లాలో ఒక సీఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఒక్కొక్కరు చొప్పున ఇన్విజిలేటర్, సీఎస్, డీవోను విధుల నుంచి తొలగించామని వివరించారు.

అంతా నాఇష్టం..!

ప్రచార వేదికలుగా వాట్సాప్, ఫేస్‌బుక్



(మొదటి పేజీ తరువాయి)

ప్రచారాన్ని కూడా మైగవ్ వేదికే వ్యాప్తి చేసింది. బీజేపీ ఎన్నికల ప్రచారం కోసం ప్రధాని మోడీ తన పరిధిని దాటి ఎన్నికల కమిషన్ బాధ్యతలను కూడా తానే స్వీకరించి ఈ ప్రచారాన్ని నిర్వహించారు. దేశంలోని పౌరులు, ఓటర్లకే కాదు.... విదేశాలలో నివసిస్తున్న భారతీయులకు కూడా ఈ సందేశాలు చేరుతున్నాయి. దేశంలో ఓటర్లు కాని విదేశీయులకు కూడా వీటిని పంపుతున్నారు. వీరిలో పలువురు దీనిపై తమ అనుభవాలను పంచుకున్నారు కూడా.

ఇదేనా సమాచార గోప్యత ?

ఈ సందేశాలు చూసి యునైటెడ్ ఆరబ్ ఎమిరేట్స్‌లోని వారు ఆశ్చర్యాన్ని, దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తున్నారు. ఓ విదేశీ ప్రభుత్వం తమ సమాచారాన్ని ఉపయోగించుకోవడంపై వారు ఖంగు తింటున్నారు. ఈ సందేశాలను చూసిన విదేశీయులు మన దేశంలో గోప్యతకు సంబంధించిన ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అయితే దీనిని ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనగా చాలా మంది భావించడం లేదు. ఎన్నికల కమిషన్‌ను కానీ, కేంద్ర ప్రభుత్వాన్ని కానీ ప్రశ్నించేందుకు ఎవరూ సిద్ధంగా లేరు. తమ వ్యక్తిగత సమాచారాన్ని పొందేందుకు ఏ డేటాబేస్‌ను ఉపయోగించుకుంటు న్నారన్నదే వారిని కలవరపెడుతున్న ప్రశ్న.

కంచే చేను మేస్తే...

బీజేపీకి వివిధ వనరుల ద్వారా ఓటర్లకు సంబంధించిన సమాచారం తెలిసిపోతోంది. ప్రభుత్వ యంత్రాంగమంతా ఈ పనిలో నిమగ్నమైపోయింది. సమాచార బ్రోకర్లు, పార్టీ కార్యకర్తలు ఇందుకు సహకరిస్తున్నారు. సమాచారం తరచూ చేతులు మారుతోంది. పార్టీ సమాచారం ప్రభుత్వానికి, ప్రభుత్వ సమాచారం బ్రోకర్లకు చేరుతోంది.

వివిధ మార్గాల ద్వారా సేకరించిన సమాచారంతో రాజకీయ ప్రచారం సాగించేందుకు ఇప్పుడు హైబ్రిడ్ యంత్రాంగాన్ని ఉపయోగిస్తున్నారు. గత సంవత్సరం ప్రభుత్వం తీసుకొచ్చిన డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ చట్టం ప్రకారం సమాచార పరిరక్షణ కోసం ఓ బోర్డును ఏర్పాటు చేయాల్సి ఉంది. ఎన్నికలకు ముందు గోప్యతకు సంబంధించిన ఉల్లంఘనలపై ఈ బోర్డు నిబంధనలు రూపొందించాలి. ఈ బోర్డు ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖకు జవాబుదారీగా ఉంటుంది. అయితే కంచే చేను మేసిన చందంగా ఈ మంత్రిత్వ శాఖే ప్రతి వ్యక్తికీ వాట్సప్ సందేశాలు పంపుతూ నిబంధనలను ఉల్లంఘిస్తుంటే ఎవరు మాత్రం ఏం చేయగలరు? ఒక్క మాటలో చెప్పాలంటే బీజేపీ, ప్రభుత్వ యంత్రాంగం కలిసిపోయాయి. పార్టీ పనులు, ప్రభుత్వ విధులకు తేడా లేకుండా పోయింది.

మౌనముద్రలో ఈసీ

మోడీ డిజిటల్ ఇండియా మిషన్‌లో మొబైల్ ఫోన్లకు వ్యూహాత్మక ప్రాధాన్యత ఉంది. సంక్షేమ సొమ్మును నేరుగా లబ్దిదారుని ఖాతాలో వేసేందుకు ఆయన తీసుకొచ్చిన జన్‌ధన్ ఆధార్ మొబైల్ (జేఏఎం) విధానం విజయవంతమైంది.

ఆర్థిక, భద్రతా కారణాల పేరిట చేపట్టిన కేవైసీ విధానం రాజకీయ పార్టీల ప్రచారానికి బాగా ఉపయోగపడు తోంది. వాట్సప్ సందేశాలను గమనించిన కాంగ్రెస్ పార్టీ ఈ వ్యవహారాన్ని మేటా వేదిక దృష్టికి తీసికెళ్లింది. సమాధానం రాకపోవడంతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ప్రధాని నుండి వచ్చిన వాట్సప్ సందేశాలపై వ్యాఖ్యానించేందుకు ఈసీ కార్యాలయం నిరాకరించింది.

విద్వేష ప్రసంగాలు, తప్పుడు వార్తలు సహా ఎన్నికల సంబంధమైన అంశాలను ప్రచారం చేయడంలో వాట్సప్, ఫేస్‌బుక్ క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయి. తన డిమాండ్లకు తలవంచేలా ఈ సంస్థలపై ఒత్తిడి తెచ్చేందుకు బీజేపీ ఐటీ నియంత్రణల అస్త్రాన్ని ప్రయోగిస్తోంది. బీజేపీ ఐటీ విభాగం ప్రచారానికి వాట్సప్ బాగా ఉపయోగపడుతోంది. బీజేపీకే అనేముంది? అన్ని పార్టీలకూ వాట్సాప్ ఇష్టమైన వేదికే. ఇక ఎన్నికల ప్రచారం కోసం ప్రభుత్వ నిధులను వాడుకోవడం కూడా పరిపాటిగా మారింది. కొందరు పనిగట్టుకొని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలను ప్రభావితం చేస్తున్నారు. ఇలాంటి వారితో మోడీ ప్రభుత్వం, బీజేపీ సన్నిహితంగా మెలగుతున్నాయి. వారిని ఆకట్టుకునేందుకు నేషనల్ క్రియేటర్ అవార్డులను ఎర వేస్తున్నాయి.

నియంత్రణలు, నిబంధనలకు పాతర

సామాజిక మాధ్యమాలలో వెల్లువెత్తుతున్న ప్రచారాన్ని అడ్డుకోవడానికి ఎలాంటి నియంత్రణలు, నిబంధనలు లేకపోవడం ఆందోళన కలిగించే విషయం. దీనిపై చర్యలు తీసుకోగలిగిన ఒకే ఒక సంస్థ కూడా అచేతనంగా ఉండిపోతోంది. నియంత్రణల కోసం డిమాండ్ చేయడానికి ప్రతిపక్షాలు కూడా ఆసక్తి చూపడం లేదు. రాజకీయ పార్టీలు తమకు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించవచ్చునన్న సంకేతాన్ని ఎన్నికల కమిషన్ పంపుతున్నట్లు కన్పిస్తోంది. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత నుంచి అది దూరంగా జరిగిపోతోంది.

అది కోడ్ ఉల్లంఘనే

- మోడీ వాట్సాప్ సందేశాలపై చండీగఢ్ ఎన్నికల సిబ్బంది స్పష్టీకరణ
- ఈ అంశంపై ఈసీఐకి సిఫారసు

చండీగఢ్ : కేంద్రంలో, ఇతర రాష్ట్రాల్లో అధికారంలోకి రావటమే పరమావధిగా బీజేపీ పని చేస్తున్నది. అధికార బలంతో పాటు ఇందుకు అంది వచ్చిన ప్రతి ఒక్క విషయాన్నీ ఉపయోగించుకుంటున్నది. అయితే, ప్రధాని మోడీ పేరుతో కేంద్రంలోని బీజేపీ సర్కారు ప్రజలకు పంపుతున్న బల్క్ మెసేజ్‌లు వివాదాస్పదమవుతున్నాయి. ఇటీవల ఈ విషయం చండీగఢ్ ఎన్నికల సిబ్బంది దృష్టికి వచ్చింది. సార్వత్రిక ఎన్నికలు ప్రకటించిన తర్వాతకూడా కేంద్రంలో అధికారంలో బీజేపీ సర్కారు ఇలా చేయటం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) ఉల్లంఘనకు కారణమని చండీగఢ్ ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. ఈ విషయం దేశవ్యాప్త అధికార పరిధిని కలిగి ఉన్నందున చండీగఢ్ అడ్మినిస్ట్రేషన్ "అవసరమైన చర్య" కోసం దీనిని భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ)కి సిఫారసు చేసింది.

లక్షలాది మందికి 'వికసిత్ భారత్ సంపర్క్' నుంచి సందేశాలు

ఈ సందేశం 'వికసిత్ భారత్ సంపర్క్' నుంచి వాట్సాప్‌లో లక్షలాది మంది భారతీయులకు ప్రధాని మోడీ పేరుతో లేఖగా పేర్కొంటూ వచ్చే బల్క్ మెసేజ్‌ల సర్క్యులేషన్‌కు సంబంధించినది. గత పదేండ్లలో తన ప్రభుత్వం సాధించిన విజయాలను ఎక్కువగా హైలైట్ చేస్తూ, ప్రజల జీవితాల్లో పరివర్తన తమ ప్రభుత్వం సాధించిన అతిపెద్ద విజయమని ఆ లేఖలో ఉన్నది. అనంతరం వికసిత్ భారత్ గురించి అభిప్రాయాలు, సూచనలు ప్రజలను అడగటం కూడా అందులో ఉన్నది.

'సి-విజిల్' ద్వారా చండీగఢ్‌వాసి ఫిర్యాదు

ఈసీఐ మార్చి 17న ఎన్నికల ప్రకటన చేసింది. ఏడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్టు వివరించింది. ఎన్నికల ప్రకటన వెలువడిన ఒక రోజు తర్వాత చండీగఢ్‌కు చెందిన ఒక వ్యక్తి 'మోడీ లేఖ'ను అందుకున్నారు. సాధారణ ఎన్నికల సమయంలో అధికారిక ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ ఈసీఐ సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయం ఎన్నికల సిబ్బంది దృష్టికి వచ్చింది.

ఈసీఐ నిర్ణయం తీసుకుంటుంది : చండీగఢ్ రిటర్నింగ్ ఆఫీసర్

ఈ విషయమై చండీగఢ్ రిటర్నింగ్ ఆఫీసర్-కమ్-డిప్యూటీ కమిషనర్ వినయ్ ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ.. దీనిని చండీగఢ్ జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీకి సిఫారసు చేశామని చెప్పారు. "ఈ విషయాన్ని పరిశీలించిన తర్వాత, ఎంసీసీని ఉల్లంఘించినట్టు కమిటీ ప్రాథమికంగా గుర్తించింది" అని ప్రతాప్‌సింగ్ స్పష్టం చేశారు. "ఈ విషయం భారత ప్రభుత్వం, మెటాకు సంబంధించినది. కాబట్టి ఇది కేవలం చండీగఢ్ అధికార పరిధికి మాత్రమే పరిమితం కాదు. అవసరమైన చర్య తీసుకోవడానికి ఈసీఐకి సిఫారసు చేయబడింది. దీనిపై ఈసీఐ పరిశీలించి నిర్ణయం తీసుకుంటుంది" అని ఆయన చెప్పారు. కాగా, ఇలాంటి సందేశాలపై కాంగ్రెస్ స్పందించింది. వీటిని నిషేధించాలని కాంగ్రెస్ నాయకులు శశి థరూర్, మనీష్ తివారీతో సహా ప్రతిపక్ష పార్టీ నాయకులు ఈసీఐని కోరారు. మా మొబైల్ నంబర్లకు సందేశాలు ఎలా వస్తున్నాయి? మా నంబర్లు వారి వద్ద ఎలా ఉన్నాయి? అని ప్రశ్నించారు.

మే 8 నుంచి ఎప్‌సెట్!

- 11 వరకు నిర్వహణ
- పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో షెడ్యూల్‌లో సవరణ
- ఉన్నత విద్యామండలి కసరత్తు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) రాతపరీక్షల షెడ్యూల్‌ను మార్చాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. మే 13న రాష్ట్రంలో పార్లమెంటు ఎన్నికల పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ప్రకటించిన విషయం తెలిసిందే. మే 9 నుంచి 12 వరకు ఎప్‌సెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని ఉన్నత విద్యామండలి తొలుత ప్రకటించింది. అయితే ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎప్‌సెట్ పరీక్షల తేదీల్లో మార్పులు చేయాలని భావిస్తున్నది. మే 8 నుంచి 11వ తేదీ వరకు ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహించాలని సూచనప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఆ సెట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి పరీక్షల తేదీలను ఖరారు చేసే అవకాశమున్నది. మే ఎనిమిది, తొమ్మిది తేదీల్లో ఇంజినీరింగ్ రాతపరీక్షలు, 10, 11 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం రాతపరీక్షలను నిర్వహించనుంది. ఈ మేరకు షెడ్యూల్‌ను రూపొందించినట్టు సమాచారం. ఈ దిశగా ఉన్నత విద్యామండలి అధికారులు కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది.

ఎప్‌సెట్‌కు 1.68 లక్షల దరఖాస్తులు

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్)కు 1,68,798 దరఖాస్తులొచ్చాయి. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయకుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగానికి 1,18,387 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 50,265 మంది, ఆ రెండు విభాగాలకూ 146 మంది కలిపి మొత్తం 1,68,798 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు తుది గడువు వచ్చేనెల ఆరో తేదీ వరకు ఉన్న విషయం తెలిసిందే. ఇతర వివరాల కోసం https://eapcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

ఏప్రిల్ మూడో వారంలో

ఇంటర్ ఫలితాలు!

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ముగిశాయి. గతనెల 28న ఇంటర్ పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈనెల 14 వరకు ప్రధాన పరీక్షలు జరిగాయి. చివరి రోజు మంగళవారం ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-2, జాగ్రఫీ పేపర్-2 పరీక్షలను నిర్వహించామని ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 299 మంది దరఖాస్తు చేయగా, 295 (98.7 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. నలుగురు (1.3 శాతం) మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-2, జాగ్రఫీ పేపర్-2 పరీక్షలకు సెట్ బీ ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేశామని వివరించారు. ఈ పరీక్ష ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జరిగిందని తెలిపారు. ఈ పరీక్షలకు సహకరించిన విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ, పోలీసు, తపాలా, ఆర్టీసీ, వైద్యారోగ్యం, విద్యుత్, బీఎస్ఎన్ఎల్, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చేనెల మూడో వారంలో ఇంటర్ ఫలితాలు విడుదలయ్యే అవకాశముంది. ఈ దిశగా ఇంటర్ బోర్డు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈనెల నాలుగో తేదీ నుంచి ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 16 కేంద్రాల్లో ఈనెల 25 వరకు ఆ ప్రక్రియ కొనసాగుతుంది.

పండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులివ్వాలి

- కోదండరామ్‌కు ఎస్ఎల్‌టీఏటీఎస్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పునకు లోబడి రాష్ట్రంలోని భాషాపండితులకు స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ)గా పదోన్నతులను కల్పించాలని ఎస్ఎల్‌టీఏటీఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు త్రిసభ్య కమిటీ సభ్యులు కోదండరామ్‌ను మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చక్రవర్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కర్రెం గౌరీశంకర్‌రావు నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రెండు, మూడు జీవోలను సమర్థిస్తూ భాషాపండితులకే స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులను కల్పించాలంటూ హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వులిచ్చిందని తెలిపారు. ఈ తీర్పును తక్షణమే అమలు చేయాలని కోరారు. హైకోర్టు ఉత్తర్వుల సమాచారం తమకు అందిందనీ, ప్రభుత్వ పెద్దలతోపాటు సంబధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామంటూ కోదండరామ్ హామీనిచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్‌టీఏటీఎస్ నాయకులు షేక్‌హాజీ నూరానీ, జగదీశ్వర్, ఎండీ హమీద్, చంద్రమోహన్, వెంకటేశ్వర్లు, కుమారస్వామి, శ్రీహరి, భాస్కర్, రాజ్‌గోపాల్‌సింగ్, సంతోష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

వంద రోజులు..!



తెలంగాణ ఏర్పడిన పదేండ్ల తర్వాత తొలిసారిగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెల 15న తన వందరోజుల పాలన విజయవంతంగా పూర్తి చేసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధిష్టానం నుండి కూడా మంచి ప్రశంసలందుకున్నారు. ప్రజలు సైతం ఈ వందరోజుల పాలన పట్ల కొంతమేర తృప్తిగానే ఉన్నారు. ప్రభుత్వాన్ని పడగొడతామని, పడిపోతుందన్న గందర గోళం మధ్య సాఫీగానే వందరోజులు దాటింది. కేసీఆర్ అహంకారాన్ని భరించలేక కాంగ్రెస్‌కు అధికారమిచ్చి నందుకు ప్రజలకు కొంత మేరకు ఊరట లభించిందనే చెప్పాలి. ఇక ఆరు గ్యారెంటీలు సంపూర్ణంగా అమలు జరిగితే ప్రభుత్వం ఓ మేరకు విజయం సాధిస్తుంది.

> 'ఈ వంద రోజులు ఒక ముఖ్యమంత్రిగా అద్భుతంగా పని చేశాను, ఇప్పుడు పిసిసి అధ్యక్షుడిగా నా రాజకీయం ఏంటో చూపిస్తాను' అంటూ సవాల్ విసిరి గేట్లు తెరిచానంటూ ప్రకటించారు. అంటే ఇతర పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో కలుపుకొని ప్రతిపక్షాన్ని ఖాళీ చేసే పని మొదలుపెట్టినట్టే కదా! అప్పట్లో కేసీఆర్ ఇదే చేశాడు. ఇప్పుడు రేవంత్ కూడా అదే బాట పట్టారు. విధానాలను విభేదించి ఒకరిద్దరు తన పార్టీలోకి రావడాన్ని ఎవ్వరూ తప్పుపట్టరు. కానీ ఆశలు చూపించి బేరసారాలాడి ప్రతిపక్షమే లేకుండా చేయాలని చూడడం ప్రజాస్వామ్య పునరుద్ధరణ అనిపించుకోదు.

ముఖ్యంగా కేసీఆర్ హయాంలో ప్రగతిభవన్ గేట్లు మూసేసి, ముండ్ల కంచెలేసి ప్రజలకు పాలన అందనంత దూరమైంది. రేవంత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలోనే ప్రగతి భవన్ కంచెలు తొలగించి ప్రజావాణికి వేదికనేర్పాటు చేశారు. ఇన్నేండ్లకు తమగోడు వినే నాయకుడొచ్చాడని ప్రజలు సంబరపడ్డారు. అన్నట్టుగానే ప్రజాపాలనతో ఆర్జీలు స్వీకరించి ప్రజల్లో నమ్మకం కల్పించారు. అప్పులు, ఆర్థిక పరిమితులున్నా వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను తప్పక అమలు చేస్తానన్న మాటను దాదాపుగా నిలబెట్టుకునే ప్రయత్నం చేశారు. మిగిలిన వాగ్దానాలన్నింటినీ త్వరలోనే అమలు చేస్తారనే ప్రజలు నమ్మకంగా ఎదుచూస్తున్నారు.

అయితే ఇంకా అమలు చేయాల్సినవి ఉన్నాయని ప్రతిపక్షాలు చెబుతున్న మాటల్లో కూడా వాస్తవం ఉంది. ప్రధాన ప్రతిపక్షమైతే వందరోజుల పాలనకు వంద ప్రశ్నలు కూడా సంధించారు. ప్రతిపక్షాల ధోరణి ఎలా ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుందనే నమ్మకం మాత్రం ప్రజల్లో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం విఫలమైందని ప్రధాన ప్రతిపక్షం గొంతు చించుకొని ఎంత అరిచినా అవి రాజకీయ విభేదాలు, అక్కసుతో అన్నట్టే అనిపిస్తుంది.

ఇక్కడ బీఆర్ఎస్ నేర్చుకోవల్సింది ఏంటంటే తనని ఎవరూ ఓడించలేరనే అహంకారం పెరిగితే తనకు తానే పతనమవుతుందని గుర్తెరిగి నడుచుకోవాలి. అదే సమయంలో ప్రజలు కాంగ్రెస్‌కు ప్రేమతో ఓట్లు వేయలేదు. కేవలం బీఆర్ఎస్‌పై ఉన్న వ్యతిరేకతతోనే గద్దెనెక్కించారు. ఇప్పుడు ఆ వ్యతిరేకతను తమకు అను కూలంగా మలుచుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కాబట్టి మిగిలిన హామీలను కూడా కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. నిజమైన ప్రజా సమస్యలైన నీళ్ల, నిధులు, నియామకాలపై దృష్టిపెట్టాలి. వాస్తవానికి ప్రజలు కోరుకుంది కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాదు. తెలంగాణ ప్రజలు ప్రజాస్వామ్యం కోరుకున్నారు. 'సంకెళ్లను తెంచి, స్వేచ్ఛను పంచి జనం ఆకాంక్షలను నిజం చేస్తూ ఈ నెలరోజుల ప్రస్తానం తృప్తినిచ్చింది' అంటూ తన నెల రోజుల పాలన సందర్భంగా రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ స్వేచ్ఛా, ప్రజాస్వామ్యాన్నే ప్రజలు కోరుకుంటున్నారనేది ప్రభుత్వం గుర్తించాలి. ఎందుకంటే ప్రగతిభవన్ గేట్లు తెరిచిన నాలుగోరోజే మహబూబాబాద్‌లో పేదలు వేసుకున్న గుడిసెలు పీకేసారు. తర్వాత హన్మకొండ, జగిత్యాల, కోరుట్లలో ఇదే అమానుష నిర్బంధం కొనసాగిం చారు. నిన్నగాక మొన్న జనగాం జిల్లాలోనూ ఇదే పరిస్థితి. జగిత్యాల, కోరుట్లలో అయితే పేదలకు అండగా నిలబడ్డ నాయకులపై 307(హత్యానేరం) కేసులు మోపారు.

నెలరోజుల పాటు వాళ్ళను జైల్లో పెట్టారు. ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి పర్యటనలు చేసే ప్రాంతాల్లో ప్రతిపక్షాలను ముఖ్యంగా కమ్యూనిస్టు నాయకులను, ఉద్యమకారులను ముందస్తుగా అరెస్టులు చేస్తున్నారు. మేడిగడ్డ, ఆదిలాబాద్ సంగారెడ్డిలో దీన్ని కండ్లారా చూశాం. ఇలా ప్రజలవైపు నిలబడే నాయకులను అరెస్టులు చేస్తే ప్రజలు హర్షించరనేది ప్రభుత్వం తెలుసుకోవాలి. ప్రజాస్వామ్య పునరుద్ధరణ అమలు చేస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి ఈ విషయంలో మాత్రం ప్రజలకిచ్చిన మాట తప్పుతున్నట్టుగా కనిపిస్తుంది.

మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే 'ఈ వంద రోజులు ఒక ముఖ్యమంత్రిగా అద్భుతంగా పని చేశాను, ఇప్పుడు పిసిసి అధ్యక్షుడిగా నా రాజకీయం ఏంటో చూపిస్తాను' అంటూ సవాల్ విసిరి గేట్లు తెరిచానంటూ ప్రకటించారు. అంటే ఇతర పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో కలుపుకొని ప్రతిపక్షాన్ని ఖాళీ చేసే పని మొదలు పెట్టినట్టే కదా! అప్పట్లో కేసీఆర్ ఇదే చేశాడు. ఇప్పుడు రేవంత్ కూడా అదే బాట పట్టారు.

విధానాలను విభేదించి ఒకరిద్దరు తన పార్టీలోకి రావడాన్ని ఎవ్వరూ తప్పు పట్టరు. కానీ ఆశలు చూపించి బేరసారాలాడి ప్రతి పక్షమే లేకుండా చేయాలని చూడడం ప్రజాస్వామ్య పునరుద్ధరణ అనిపించుకోదు. తెలంగాణ ప్రజలు కోరుకున్న మార్పు ఇది కాదు. ప్రజలు కోరుకుంటున్న నిజమైన మార్పును చూపించాల్సిన బాధ్యత కాంగ్రెస్‌కు ఉందని వంద రోజుల పాలన సందర్భంగా సమీక్షించు కుంటే బాగుంటుంది. వంద రోజులనేది వాస్తవంగా తక్కువ సమయమే. కానీ ప్రభుత్వ అడుగులు ఎటువైపు అనేది ప్రజలు గమనిస్తున్నారన్న విషయం మరవకూడదు.

రాజ్యాంగ మౌలిక లక్షణాలపై దాడి




మాడభూషి శ్రీధర్

మనం కేవలం రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వాన్ని నడపాలి. రాజ్యాంగాన్ని మార్చుకోవచ్చు. కానీ మౌలిక లక్షణాలను సవరించడానికి వీలులేదు. కేశవానంద భారతి కేసులో 13 మంది న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పుతో 50 ఏళ్లగా ఈ రాజ్యాంగ బేసిక్ స్ట్రక్చర్‌ను (మౌలిక లక్షణాలు) కాపాడుకుంటూ వస్తున్నాము. బేసిక్ స్ట్రక్చర్ అంటే అపార్టు మెంట్‌లో కీలకమైన స్తంభాలు మార్చడానికి వీల్లేదు. అలా మార్చాల్సి వస్తే భవనం కూలి పోతుంది. అంటే స్తంభాన్ని మార్చకుండా తలుపులు, కిటికీలు, గోడలు మార్చుకోవడానికి వీలుంది. ఇదే బేసిక్ స్ట్రక్చర్! మాకు అధికారం ఉందని ప్రతీ పార్టీ రాజ్యాంగాన్ని మార్చుకుందామనుకుంటే అది సరైన పరిపాలన కాదు. రాజ్యాంగం మౌలిక లక్షణాలను దెబ్బతీసేలా కొత్త చట్టాలను తీసుకు రావడానికి వీల్లేదు. ఈ నేపథ్యంలో పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) గురించి ఆలోచించాలి. పౌరసత్వాన్ని సవరిస్తూ 2019లో పలు మార్పులు తీసుకొచ్చారు. అప్పటి నుంచి ఐదేళ్ల వరకు కూడా ఈ చట్టాన్ని అమలు చేయలేదు. చేయలేక పోయారు.ఈ సవరణ దేశానికి మంచిదని నమ్మడం లేదు. ఇన్నాళ్ల అంటే ఐదేళ్లుగా సిఎఎను అమలు చేయకుండా కేవలం ఎన్నికలకు ముందు ఈ రూల్స్ తెచ్చారు. అయితే చట్టం ఏం చెప్పినప్పటికీ ఆ నియమాల అమలు మాత్రం న్యాయంగా ఉంటుందా..?ఉండదా..? అనే అనుమానాలు పెరిగి పోయాయి. అందువల్లే నిరసనలు, విమర్శలు, పిల్స్ వేయడం, దిష్టిబొమ్మలు తగలబెట్టడం వంటి ఆందోళనలు! మాకు 400 ఎంపీల సీట్ల కన్నా ఎక్కువగా వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని భయపెడుతున్నారు.

అధికారాలను దెబ్బతీయలేరు..

50 ఏళ్ల నాటి కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు చేసిన ఆదేశం ఇప్పటికీ ప్రామాణికంగానే ఉంది. కనుక భవిష్యత్తులోనూ కులాలు, మతాలు ఆధారంగా పరిపాలన చేయడానికి వీల్లేదు. ముఖ్యంగా పౌరసత్వ అర్హతలను మార్చే అధికారం ప్రభుత్వానికి లేదు. రాజ్యాంగ పీఠికలో లౌకిక అనే పదాన్ని తొలగించేస్తామని అంటున్నారు. పదం ఏ విధంగా ఉన్నా.. లేకపోయినా లౌకిక లక్షణాన్ని తీసివేసే అధికారం మాత్రం ఎవరికీ లేదు. కనుక సిఎఎ గురించి తీవ్ర సమస్యలు వస్తున్నాయి. సిఎఎ చట్టాన్ని మార్చి 11న అమలులోకి తీసుకొచ్చారు. వెంటనే ఎన్నో చోట్ల అల్లర్లు చోటు చేసుకున్నాయి. అనేక చోట్ల సాయుధ బలగాలను, ఢిల్లీలో పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ కూడా చేయాల్సి వచ్చింది. ఎన్నికల ముందు ఇంత కీలకమైన మార్పు చేయడం న్యాయమా..?, అవసరమా..?. రాజకీయ ప్రయోజనాల కోసమేనా? 1950లో జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత పౌరసత్వ మౌలిక లక్షణాలను రాజ్యాంగంలోని ఆర్టికల్స్‌లో పేర్కొ న్నారు. వీటి ఆధారంగా 1955లో చట్టాన్ని తీసుకొచ్చారు. దీని ప్రకారం.. పొరుగు దేశాల నుంచి వలస వచ్చిన వారికి భారత పౌరసత్వం ఇవ్వడానికి వీల్లేదు. మొట్ట మొదటి పౌరసత్వ చట్టం (1955) ప్రకారం.. భారతీయ పౌరసత్వాన్ని అక్రమంగా వచ్చిన వారికి ఇవ్వరు. "ఒక వేళ పత్రాలు ఉంటే రావచ్చు. వీసా గడువు దాటిపోతే రావడానికి వీల్లేదు. అయితే వీసా గడువు ఉంటే ధృవీకరణాలు దొరికితే ముస్లీంయేతర శరణార్థులను దేశంలో నివసించడానికి అవకాశం ఇస్తూ మార్పులు చేశారు.

> ఒక వేళ కేంద్ర ప్రభుత్వం ఏ పౌరుడికి అయినా పౌరసత్వాన్ని నిరాకరిస్తే.. ఇవ్వబోమని నిర్ణయిస్తే.. ఈ ప్రజలు ఎక్కడికి వెళ్లాలి. ఏ దేశానికి వెళ్లాలి..?. ఒకవేళ వీడు విదేశీయుడు అని నిర్ణయిస్తే.. ఆ మాజీ పౌరులు ఎక్కడికి పోవాలి..?. అరెస్ట్ చేస్తారు. జైల్లో పెడతారు.. వారు జైల్లో ఎన్నాళ్లు ఉంటారు..? ఎవరికైనా పౌరసత్వాన్ని భారత ప్రభుత్వం నిరాకరిస్తే.. భారత రాజ్యాంగంలో ఉన్న ఏ హక్కులు దక్కవు. అప్పుడు వాళ్ల గతి ఏమిటీ..?. అసోం తరహాలో లక్షల మంది జైలుపాలు కావాల్సిందేనా..? కనుక కొన్ని కొత్త జైల్లు నిర్మిస్తారు. ఇదా దేశ అభివృద్ధి కార్యక్రమం..?



మత ఆధారం ధర్మమా..?

పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గనిస్తాన్‌లో హింసకు గురై భారత్‌కు శరణార్థులుగా వలస వచ్చిన ముస్లీ మేతరులకు పౌరసత్వం మంజూరు చేయడానికి ఈ కొత్త సవరణ చట్టం ద్వారా అవకాశం లభిస్తుంది. అంటే ఈ మూడు దేశాల నుంచి భారత్‌కు వస్తే సరైన పత్రాలు లేకపోయినా.. పౌరసత్వం ఇవ్వవచ్చని సిఎఎ చట్టం చెబుతోంది. అంటే 2014 డిసెంబర్ 31కి ముందు భారత్‌కు వచ్చి ఉన్న వారికి పౌరసత్వాన్ని కోరుకునేందుకు అవకాశం ఉంది. వారు అర్హులు అవుతున్నారు. మరొక వివరణ ఇది.. సిఎఎ కింద హిందువులు, క్రిష్టియన్లు, బౌద్ధులు, పార్శీలకు పౌరసత్వం లభిస్తుంది. అంటే ప్రత్యేకంగా ముస్లింలకు మాత్రమే అవకాశం లేదని స్పష్టం చేస్తోంది. 2014 తర్వాత ప్రవేశించడానికి వీల్లేదని మరింత స్పష్టం చేస్తోంది. ముస్లింలను మాత్రమే ఎందుకు పక్కన పెట్టారు..? కేవలం ముస్లిం మతం ఆధారంగా భారత్‌కు రాకూడదని చెప్పడం న్యాయమ..? ధర్మమా..? రాజ్యాంగ సమ్మతమా..?1950 నాటి రాజ్యాంగం, 1955 నాటి పౌరసత్వ చట్టం ఉన్న నియమాలకు వ్యతిరేకంగా 2019లో పౌరసత్వ చట్టాన్ని సవరించారు. ఈ సవరణ రాజ్యాంగ మౌలిక లక్షణానికి (బేసిక్ స్ట్రక్చర్), లౌకిక లక్షణాలకు, మతాతీతమైన లక్షణానికి వ్యతిరేకమని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ రూల్స్ అమలు చేసేటప్పుడు పూర్తి అధి కారాలు ప్రభుత్వ గుప్పిట్లోకి వెళ్తాయి. పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అర్హతలను నిర్ణయించే అధికారాన్ని పోస్టల్ అధికారులకు అప్పగించారు. వారికి సాయుధ బలగాలు అండగా ఉంటాయి.

> సిఎఎ కింద హిందువులు, క్రిష్టియన్లు, బౌద్ధులు, పార్శీలకు పౌరసత్వం లభిస్తుంది. అంటే ప్రత్యేకంగా ముస్లింలకు మాత్రమే అవకాశం లేదని స్పష్టం చేస్తోంది. 2014 తర్వాత ప్రవేశించడానికి వీల్లేదని మరింత స్పష్టం చేస్తోంది. ముస్లింలను మాత్రమే ఎందుకు పక్కన పెట్టారు..? కేవలం ముస్లిం మతం ఆధారంగా భారత్‌కు రాకూడదని చెప్పడం న్యాయమా..? ధర్మమా..? రాజ్యాంగ సమ్మతమా..?1950 నాటి రాజ్యాంగం, 1955 నాటి పౌరసత్వ చట్టం ఉన్న నియమాలకు వ్యతిరేకంగా 2019లో పౌరసత్వ చట్టాన్ని సవరించారు. ఈ సవరణ రాజ్యాంగ మౌలిక లక్షణానికి (బేసిక్ స్ట్రక్చర్), లౌకిక లక్షణాలకు, మతాతీతమైన లక్షణానికి వ్యతిరేకమని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

అధికార దుర్వినియోగ భయాలు..

నిజానికి పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) ప్రభావం ఈశాన్య రాష్ట్రాలపై తీవ్రంగా ఉంటుంది. అసోం, మేఘా లయా, త్రిపుర రాష్ట్రాల ప్రజలు ఆందోళన పడుతున్నారు. ఎందుకంటే అక్కడికి వలస వచ్చిన వారు తమ సంస్కృతిని, సంప్రదాయాన్ని కోల్పోతామని భయపడు తున్నారు. మనకు రాజ్యాంగంలో ఆరో షెడ్యూల్ అని ఒకటి ఉంది. భారత దేశం లో దాదాపు 40 శాతం గిరిజన ప్రాంతాలు ఆరో షెడ్యూల్‌లోకి వస్తాయి. కనుక కేంద్ర ప్రభుత్వం అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మిజోరం, మేఘాలయ లోని అన్ని ప్రాంతాలు, అసోం, త్రిపురలోని మరికొన్ని ప్రాంతాలను సిఎఎలో మినహాయిస్తారు. అది గొప్ప విషయం. కానీ.. దీన్ని ఏ విధంగా అమలుచేస్తారు..?. సిఎఎ అమలులో చేతికి వచ్చే అధికారం దుర్వినియోగం చేసే ప్రమాదం లేకపోలేదా..? ఇది ప్రజల భయం.

మీరు భారతీయులేనా...?


ఈ దేశంలో ఉండే వారు భారతీయ పౌరులా..? కాదా..? అనేది ఏ విధంగా నిర్ణయిస్తారు.?. మీరు, మీ తండ్రులు, తాతలు మీరు భారత పౌరులని ఏ విధంగా రుజువు చేయాలి." అనే ప్రశ్నలకు రూల్స్‌లో సరైన జవా బులు దొరక డం లేదు. ఇది ప్రధాన సమస్య. దీని వల్ల ఈ దేశంలో ఉన్న వారికి, వేరే దేశం నుంచి వచ్చిన వారికి భారత్‌లో పౌరసత్వం పొందాలంటే కావాల్సిన అర్హతలు, ధృవీకరణలు ఎక్కడ దొరుకుతాయి? ఉన్నట్టుండి మా తాతా భారత పౌరసత్వం కలిగిన వాడు అని రుజువు చేసుకోవడానికి అర్హతలు ఎక్కడ దొరుకుతాయి? ధ్రువీకరణాలు ఎక్కడ లభిస్తాయి? ఒకవేళ దొరకకపోతే ఇక్కడ పుట్టిన వాడు, తరతరాలుగా ఉన్నవాడు, ఓటింగ్ ఉన్న వాళ్లు కూడా, ఆధార్ ఉన్నా.. పౌరుడు కాదనే సమస్య అనుమానం వస్తే ఏం చేయాలి..?.

నిరాకరిస్తే ఎలా?

ఒక వేళ కేంద్ర ప్రభుత్వం ఏ పౌరుడికి అయినా పౌరసత్వాన్ని నిరాకరిస్తే.. ఇవ్వబోమని నిర్ణయిస్తే.. ఈ ప్రజలు ఎక్కడికి వెళ్లాలి. ఏ దేశానికి వెళ్లాలి..?. ఒకవేళ వీడు విదేశీయుడు అని నిర్ణయిస్తే.. ఆ మాజీ పౌరులు ఎక్కడికి పోవాలి..?. అరెస్ట్ చేస్తారు. జైల్లో పెడతారు.. వారు జైల్లో ఎన్నాళ్లు ఉంటారు..? ఎవరికైనా పౌరసత్వాన్ని భారత ప్రభుత్వం నిరాకరిస్తే.. భారత రాజ్యాంగంలో ఉన్న ఏ హక్కులు దక్కవు. అప్పుడు వాళ్ల గతి ఏమిటీ..?. అసోం తరహాలో లక్షల మంది జైలుపాలు కావాల్సిందేనా..? కనుక కొన్ని కొత్త జైల్లు నిర్మిస్తారు. ఇదా దేశ అభివృద్ధి కార్యక్రమం..?

> అతని మొండితనం, ధైర్యం, తెగువను చూసి సైన్యాధికారులే ఆశ్చర్యపోయారు. వారు రానూనాయక్‌ను చంపడానికి నిరాకరించారు. అప్పుడు అక్కడే కాచుకుని కూర్చున్న రామవరం దేశ్‌ముఖ్ కటారు నర్సింగరావు రానూనాయక్‌ను బండి చక్రానికి కట్టించి శరీరం ముక్కలై పోయేవరకు ఈడ్పించి చంపాడు. 1950 మార్చి 20వ తేదీన కామ్రేడ్ జాటోత్ రానూనాయక్ వీరమరణం పొందారు. తుది ఘడియలో సైతం ఆయన పెదవులపై "కమ్యూనిస్టు పార్టీ వర్ధిల్లాలి- శత్రువు అంతం చూడాలి" అన్న నినాదాలే నాట్యమాడాయి.

వీరతెలంగాణ ధీరత్వం కామ్రేడ్ రానూనాయక్



తెలంగాణ మట్టిలో వికసించిన పీడిత ప్రజల చరిత్ర ఇది. కత్తులు, తుపాకుల కవాతుల మధ్య కుత్తుకలు తెగిపడ్డ విప్లవవీరుల శిరస్సులు నినదించిన రక్తాక్షరాల చరిత్ర. నిజాం నిరంకుశత్వానికి, దొరల ఆగడాలకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం, దున్నేవానికే భూమి కావాలని తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఉధృతంగా సాగింది. 1944 నుంచి 1951 వరకు హైదరాబాద్ సంస్థానంలో సాగిన ఈ పోరాటం భారతదేశ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లిఖించబడింది. తెలంగాణలో అనేక ప్రాంతాల్లో పోరాటాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. జనగాం ప్రాంతంలోని ధర్మాపురం, ముండ్రాయి చుట్టుపక్కల తండాల్లోని లంబాడీ గిరిజనులు చేసిన పోరాటం, వారు చూపిన తెగువ, ధైర్యసాహసాలు, చేసిన త్యాగాలు భావితరాలకు దిక్సూచి.



రమావత్ శ్రీరాంనాయక్,
9440532410

జనగాం తాలూకాలో విసునూరు రామచంద్రారెడ్డి, వుసుకూరు రాఘవరావు, కటారి నరసింహారావు, బాబూ దొర అనే భూస్వాములు ఆ ప్రాంత ప్రజలను పీడించేవారు. దుర్మార్గులైన దొరలు నిరంకుశ నిజాం ప్రభుత్వ రజాకార్ల అండతో ప్రజల భూములను ఆక్రమించడం, నిర్దాక్షిణ్యంగా పన్నులు వసూలు చేయడం, ఎదురు తిరిగిన వారిని చంపడం, చిత్రహింసలు పెట్టడం, మహిళలపై అత్యాచారాలు, దాడులు, దౌర్జన్యాలు, నిత్యకృత్యంగా సాగేవి. దేవరుప్పల మండలం ధర్మాపురం లంబాడీ గిరిజనులకు చెందిన 80 ఎకరాల మెట్ట, 25 ఎకరాల మాగాణి భూములను ఆక్రమించేందుకు విసునూరు రాఘవరావు అనే దొర గుండాలను పంపాడు. ఇది తెలుసుకున్న తండా పెద్దలైన లంబాడీ జాటోత్ హాము, జాటోత్ రామోజీ కుటుంబాల కొడుకులు వడిసెలు, గుదపలతో వారితో తలపడ్డారు. లంబాడీల పోరాట పటిమ ముందు నిలబడలేక పారిపోయారు. తండాలో లంబాడీలు సాగుచేసుకుంటున్న 30 ఎకరాల మాగాణి, 40 ఎకరాల బంజరు భూమిని కటారి నరసింహారావు వారి భూములను తన పేర రాయించుకున్నాడు. కోపోద్రిక్తులైన గిరిజనులు చుట్టుపక్కల గ్రామాలు, తండాల ప్రజలను ఏకంచేసి దొరలతో తలపడటానికి సిద్ధమయ్యారు. జాటోత్ హాము కొడుకులైన రానూనాయక్ ఆరుగురు అన్నదమ్ములు. జోద్యా నాయక్, సోమ్లా నాయక్, సంకు నాయక్, దర్యానాయక్, కిషన్ నాయక్‌లు నేతృత్వం వహించారు. (వీరిలో దర్యానాయక్ ఒక్కరే ప్రస్తుతం బతికి ఉన్నారు) 11వ ఆంధ్ర మహాసభ జనగామలో జరిగిన సందర్భంగా మొట్టమొదట సభ్యత్వం తీసుకున్నది ఈ కుటుంబమే. వీరికి అండగా కమ్యూనిస్టు పార్టీ (సంఘం) దళం కూడా రావడంతో వడిసెలు, గుదపలు చేతపట్టి పొలం వైపు కదిలారు. ధర్మాపురంలో ఎదురు దెబ్బతిన్న దొరలు నిజాం పోలీసులను, గూండాలను దింపారు. యుద్ధాన్ని తలపించే విధంగా తలపడ్డారు. పోలీసులు, గూండాల వద్ద వున్న తుపాకులు, ఆయుధాల ముందు లంబాడీలు నిలవలేకపోయారు. 20 మంది లంబాడీలను బంధీలుగా పట్టుకుని చేతులకు బేడీలు వేసి కొట్టుకుంటూ, చిత్రహింసలు పెడుతూ ఆ ప్రాంత గ్రామాలన్నింటిలో ఊరేగించారు. దొరలపై తిరగబడితే ఇటువంటి శిక్షలే ఉంటాయని హెచ్చరించారు. రానూనాయక్, దర్యా నాయక్, సోమ్లానాయక్‌లతో పాటు కమ్యూనిస్టుల దళం ఆచూకీ చెప్పాలని చిత్రహింసలు పెట్టారు. ప్రాణాలైనా ఇస్తాం గానీ వాళ్ల ఆచూకీ చెప్పమని ఖరాకండిగా చెప్పారు. చేసేదిలేక పోలీసులకు అప్పగించగా జనగామ జైలుకు తరలించారు.

కడివెండి గ్రామంలో 1946 జూలై 4న విస్నూరు రామచంద్రారెడ్డి దొర గూండాల కాల్పుల్లో దొడ్డి కొమురయ్య మరణించడానే వార్త జనగామ ప్రాంతంలో దావానంలా వ్యాపించింది. విషయం తెలియగానే రానూ నాయక్, దర్యానాయక్, సోమ్లానాయక్ లు పరుగు పరుగునా కడివెండి చేరుకున్నారు. జూలై 6న వందలాది మంది నిజాం పోలీసులతో కడివెండికి వస్తున్న డీఎస్పిని గ్రామంలో అడుగు పెట్టకుండా రానూనాయక్ ముగ్గురన్నదమ్ములు నిప్పు రవ్వలాగా చెలరేగి వారితో తలపడ్డారు. దొరల ఆగడా లను అడుగడుగునా ఎదిరిస్తున్న ధర్మాపురం తండాను సర్వనాశనం చేయాలని, జాటోత్ రానూనాయక్ వారి అన్నదమ్ములను ఎలాగైనా చంపాలని విసునూరు దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి కొడుకు విసునూరు బాబూదొరకు బాధ్యతను అప్పగించారు. ధర్మాపురాన్ని దొర గూండాలు చుట్టుముట్టారు. రానూనాయక్ వారి అన్నదమ్ములను మాకు అప్పగించాలని కొంతమంది లంబాడీలను చిత్రహింసలకు గురిచేశారు. తండాలో మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న రానూనాయక్, సోమ్లా, దర్యానాయక్‌లు వారితో తలపడ్డారు. ప్రాణభయంతో ఎడ్లబండి గడ్డిలో దాక్కొని పారిపోతున్న బాబూ దొరను బయటకు లాగి గుదుపలతో దెబ్బమీదదెబ్బ వేస్తూ చితకబాదారు. దర్యానాయక్ చేతిలో ఉన్న తుపాకీతో బాబూదొర గుండెలపై కాల్చడంతో అక్కడికక్కడే ప్రాణాలొదిలారు. కోపోద్రిక్తులైన దొర గూండాలు వెంబడించి కొంతమంది లంబాడీలను, దళనాయకులను పట్టుకున్నారు. ఇందులో సోమ్లానాయక్, చంద్రూనాయక్, బలరాం నాయక్, సోములు నాయక్, రేద్యానాయక్ ఐదుగురు చిక్కారు. వీరిని బంధించి కట్టెలు తెప్పించి వారి చితిని వారితోనే పేర్పించి, ఎవరి చితిని వారే అంటించుకునేలా చేశారు. చితిపై కాలుతూ కూడా "ఎర్రజెండా వర్ధిల్లాలి" అంటూ ప్రాణాలొదిలారు.

భారత సైన్యాలు తెలంగాణలో ప్రవేశించిన తర్వాత గ్రామాలు వదిలి పారిపోయిన దేశముఖ్‌లు, జమీందార్లు, దొరలు, రజాకార్లు భారత సైన్యాలు తెలంగాణాలో ప్రవేశించిన తరువాత తిరిగొచ్చారు. సైన్యం అండతో గ్రామాలపై పడి వందల మంది దళనాయకులను కాల్చి చంపారు. 1949 ఫిబ్రవరి 26న రానూనాయక్ తమ్ముడు సంకునాయక్‌ను పట్టుకున్నారు. చిత్రహింసలు చేసి మరణదండన విధించారు. సంకును అరెస్టు చేసిన పదిరోజులకు 18 ఏండ్ల వయస్సు గల చివరి తమ్ముడు కిషన్ నాయక్‌ను పట్టుకుని జైల్లో పెట్టారు. రానూ నాయక్ ఆచూకీ కోసం సైన్యం అండతో దొరలు, వారి గూండాలు వెతుకుతున్నారు. రానూనాయక్ అత్యంత ధైర్యశాలి. ధృడదీక్ష గలవాడు. పోరాటాల్లో నిప్పుకణికలాగా కదిలేవాడు. ప్రజలంటే అమితమైన ప్రేమ, ప్రజలను, ప్రత్యేకించి తమ లంబాడీలను అణచివేస్తున్న దుర్మార్గులంటే పట్టనంత ద్వేషం. రానూనాయక్ అనతికాలంలోనే ప్రజలు కమ్యూనిస్టు పార్టీ నాయకుల మన్ననలు పొందారు. కామ్రేడ్ రానూనాయక్‌ను సజీవంగా పట్టుకునేందుకు ఎంత ప్రయత్నించినా ఏడాదిపాటు సైన్యానికి, శత్రువులకు దొరకలేదు. చివరకు ఒక ద్రోహి ఇచ్చిన సమాచారం వల్ల ముండ్రాయి గ్రామంలో సైన్యం, దొరల చేతికి చిక్కారు. అతడిని పెట్టని హింసలేదు. ఎన్ని బాధలు పెట్టినా పార్టీ రహస్యం ఒక్కటికూడా బయటపెట్టలేదు. అతని మొండితనం, ధైర్యం, తెగువను చూసి సైన్యాధికారులే ఆశ్చర్యపోయారు. వారు రానూనాయక్‌ను చంపడానికి నిరాకరించారు. అప్పుడు అక్కడే కాచుకుని కూర్చున్న రామవరం దేశ్‌ముఖ్ కటారి నర్సింహారావు రానూనాయక్‌ను బండి చక్రానికి కట్టించి శరీరం ముక్కలై పోయేవరకు ఈడ్పించి చంపాడు. 1950 మార్చి 20వ తేదీన కామ్రేడ్ జాటోత్ రానూనాయక్ వీరమరణం పొందారు. తుది ఘడియలో సైతం ఆయన పెదవులపై "కమ్యూనిస్టు పార్టీ వర్ధిల్లాలి- శత్రువు అంతం చూడాలి" అన్ని నినాదాలే నాట్యమాడాయి. తెలంగాణ వీరత్వానికి నిలువెత్తు రూపమైన కామ్రేడ్ జాటోత్ రానూనాయక్‌కు విప్లవ జోహార్లు.

(నేడు రానూనాయక్ 74వ వర్ధంతి)

గ్యారెంటీ..

'అమ్మా! నాన్న ఏడుస్తున్నాడే!' అంటూ వంట చేస్తున్న తల్లి! దగ్గరకు వచ్చి చెప్పాడు నానిగాడు.

లక్ష్మి కంగారు పడి హాల్లోకి వచ్చి చూసింది. భర్త టీ.వీ చూస్తూ నవ్వుతున్నాడు.

'అబద్ధం ఎందుకు చెప్పావురా!' అంటూ నానిగాడి పాంపాం ల (అదే పిర్రల) మీద ఒక్కటిచ్చింది తల్లి.

'నేను చూసినపుడు ఏడ్చినాడమ్మా!' అన్నాడు నానిగాడు రుద్దుకుంటూనే చెప్పాడు.

లక్ష్మి వంటింట్లోకి వెళ్లి తన పనిలో మునిగిపోయింది. కాసేపటికి నానిగాడు మళ్లీ వచ్చాడు. ఈసారి తల్లి చేయి పట్టుకుని హాల్లోకి లాక్కుని వచ్చాడు. తండ్రిని చూపించి, ఎందు కైనా మంచిదని తల్లి చేతికి అందకుండా దూరం జరిగాడు.

భర్త యాదగిరిని తేరిపార చూసింది. ఆయన కండ్లలో నీళ్ల. ఆ వెంటనే సంతోషంగా కండ్లు తుడుచుకున్నాడు. భార్యను, కొడుకునూ గమనించే పరిస్థితిలో లేడు. మధ్యమధ్యలో ఏదో గొణుగుతున్నాడు కూడా.

భర్త గొణుగుడును జాగ్రత్తగా విన్నది లక్ష్మి 'ఆయన ఉన్నాడు.ఆయన గ్యారెంటీ ఉంది!' అంటున్నాడు యాదగిరి.

భర్త ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడే లక్ష్మికి అర్థం కాలేదు. అటూ ఇటూ చూసింది. టీవీలో యాడ్స్‌కు భర్త అలా స్పందిస్తున్నాడు!

'సీరియల్స్ చూసి ఆడవాళ్లు ఏడుస్తారు గాని, ఆడ్స్ చూసి మగవాళ్లు ఏడుస్తారని మిమ్మల్ని చూస్తేనే తెలుస్తుంది' అన్నది లక్ష్మి.

దాంతో ఈ లోకంలోకి వచ్చాడు యాదగిరి.

'చూడు లక్ష్మి! టీ.వీలో వచ్చే ఆ ప్రకటన నా మోడీ ఎంత గొప్పవాడో తెలుపుతుంది! ఉక్రెయిన్, రష్యా యుద్ధం జరుగుతుంటే మన భారతీయులను ఇండియాకి రప్పించటానికి ఇక్కడి నుంచి విమానం పంపడటమే కాదు! అక్కడ యుద్ధాన్ని కాసేపు ఆపి మన దేశ పిల్లల్ని విమానం ఎక్కించి క్షేమంగా ఇంటికి చేర్చాడు. ఇంత గొప్ప నాయకుడి చేతిలో నేను నువ్వూ నానిగాడు ఇంకా మన దేశం ఎంత భద్రంగా ఉంది తలుచుకుంటేనే గర్వంగా ఉంది!' అన్నాడు. కండ్లలోని ఆనంద భాష్పాలు తుడుచుకుంటూ!!

'తన ప్రజల ప్రాణాలకు గ్యారెంటీగా ఉన్నవాడు, పుల్వా మాలో మన సైనికులను తరలించటానికి హెలికాప్టర్లు కావాలని గవర్నర్ ఆడిగితే ఎందుకు సమకూర్చలేదు!' అడిగింది లక్ష్మి.

"ఇంతకూ నీవు భారతీయురాలివేనా! లేక పాకిస్తాన్ నుండి వచ్చావా? నీకు పౌరసత్వం ఉందా?' అంటూ అనుమానంగా చూశాడు యాదగిరి.


'ఆ. మీ అమ్మా నాన్న మా వైపు ఏడు తరాలు చూసి, కులం,మతం, గోత్రం అన్ని చెక్ చేసి మరీ నన్ను మీ ఇంటికి తెచ్చుకున్నారు! వారికి లేని అనుమానం మీకెందుకు వచ్చింది?' అడిగింది లక్ష్మి

'అనుమానం రాదా మరి మా మోడీని విమర్శించేంత దానివా నీవు ! చూడు! ఆ ప్రకటన చూడు! రైతులు పండించిన పంటకు కనీసమద్దతు ధరలు ఏర్పాటు చేసి, రైతులకు గ్యారెంటీగా నిల్చాడు.గతంలో ఎవ్వరైనా ఇట్లా చేశారా!' అన్నాడు యాదగిరి.

'అబ్బే! రైతులను మోడీ చూసుకున్నట్లు ఎవ్వరూ చూసుకోలేదు. మాకు నష్టం తెచ్చే నూతన వ్యవసాయ చట్టాలు మాకొద్దు' అని ఏడాది పాటు రైతులు అనేక రకాల పోరాటాలు చేశారు. ఆ పోరాటాలు అణిచివేయటానికి, రైతులను దిగ్బంధనం చేసి, రోడ్లమీద మేకులు కొట్టి, బారికేడ్లు ఏర్పాటు చేసి శత్రు సైనికుల వలే చూశారు. ఇప్పుడు కనీస మద్దతు ఇవ్వమని రైతులు ఢిల్లీకి ప్రదర్శన చేస్తే, అదే సీన్ రిపీట్ చేశారు.రూపాయి పెట్టుబడికి రూపాయిన్నర ఇప్పిస్తామని ఎన్నికల ముందు గ్యారెంటీ ఇచ్చారు. దాన్ని ఇంత గొప్పగా అమలు చేస్తున్నారు!' అన్నది లక్ష్మి.

'మోడీకి వ్యతిరేకంగా పోరాడుతున్న రైతులకు మద్దతు ఇస్తున్న తెరవెనకి దేశద్రోహులల్లా నీవు కూడా ఉన్నావన్న మాట!'అన్నాడు. యాదగిరి

'అమ్మ తెరవెనక లేదు! నాన్నా. రైతులకు మద్దతుగా ఫేస్బుక్ పోస్టు పెట్టింది! రీల్స్ కూడా చేసింది! బోలెడన్ని లైకులు,



కామెంట్లు కూడా వచ్చాయి. నీవు చూడలేదా నాన్నా!' అన్నాడు నానిగాడు తల్లి పక్కన ఛాతీ విరుచుకుని నిలబడి.

'ఎంతకు తెగించిచార్రా! మోడీ గొప్పతనం మీకు అర్థం కావటం లేదు! అయుష్మాన్ భారత్ అనే స్కీము పెట్టి, కోట్లాది నిరుపేదల ఆరోగ్యానికి గ్యారంటీ ఇచ్చాడు నా మోడీ. మీకు తెలియకపోతే టీ.వీలో వచ్చే ప్రకటన చూసైనా తెలుసుకోండి!' అన్నాడు యాదగిరి.

చిన్నగా నవ్వింది లక్ష్మి.

'మోడీ గ్యారెంటీ ఇచ్చిన ఆయుష్మాన్ భారత్ ఎంత గొప్పగా అమలు జరిగిందీ, కాగ్ రిపోర్టు చూస్తే తెలుస్తుంది!' అన్నది లక్ష్మి.

'కాగ్ రిపోర్టు ఏ పత్రికలో రాలేదు కదా!' అమాయకంగా అన్నాడు యాదగిరి. మీ గోడీ మీడియాలో రాదు లెండి! 8888888888 నంబరు నుండి లక్షా ముప్పై వేల మంది, 9000000000 నుండి ఇరవై వేల మంది ఆయుష్మాన్ భారత్ కింద రిజిస్టర్ చేయించుకున్నారు. అందులో కొన్ని వేల మందికి ఐదు లక్షల చొప్పున డబ్బులు కూడా వేశారు. ట్విస్ట్ ఏమిటంటే కొన్నివేల మంది ఎప్పుడో చనిపోయారు! ఇదంతా నేను చెబుతుంది కాదు! కాగ్ చెప్పిందే! ఒకే నంబరు నుండి అన్ని నంబర్లు ఎట్లా రిజిస్టర్ చేశారో! అసలా ఫోన్ నంబర్లు ఉన్నాయో, లేదో, ఉంటే ఆ ఫోను నంబర్లు ఎవరివో! ఇట్లా ఉంటాయన్న మాట గ్యారంటీలు!' అన్నది లక్ష్మి.

'నో డౌట్, ఆ కాగ్ మన భారతీయుడు కాదు! కచ్చితంగా మన పౌరసత్వం కూడా లేదు! అందుకే మోడీకి వ్యతిరేకంగా రిపోర్టు రాశాడు!' అన్నాడు యాదగిరి.

నానిగాడు కిసుక్కున నవ్వాడు 'మన పౌరుడు కాకపోతే అంత పెద్దజాబ్ ఎలా ఇస్తారు నాన్నా !' అన్నాడు.

'వేలెడంత కూడా లేవు! నీవు కూడా పౌరసత్వం గురించి మాట్లాడతావా? మోడీ గ్యారెంటీ ఇచ్చాడంటే చేసి తీరుతాడు. అయోధ్యలో రామ మందిరం కట్టిస్తానని గ్యారెంటీ ఇచ్చాడు. ప్రపంచమే అబ్బుర పడేలా రామమందిరం నిర్మించాడు! అదీ మోడీ అంటే!' అని యాదగిరి, మాజీ మంత్రి మల్లారెడ్డిలా తొడగొట్టాడు.

'మోడీ ఎవరండీ, భారతదేశ ప్రధానమంత్రి! అంతేకాని ఆలయ ధర్మకర్త కాదు! రాజ్యాంగం ప్రకారం ప్రధాని అయ్యాడు. కాని మంత్రాలు, వేదాలు చదువుకుని ప్రధాని కాలేదు. ప్రజలందరినీ సమానంగా చూస్తానని, దేవుడిపై ప్రమాణం చేసి ప్రధాన మంత్రి అయ్యారు! మణిపూర్ మహిళల మాన ప్రాణాలకు దిక్కు లేకుండా పోయింది. ప్రమాణం చేయటమంటే గ్యారెంటీ ఇవ్వటమే కదా! మరి మణిపూర్ ప్రజలను రక్షించ టానికీ ఏ ప్రయత్నం చేయలేదు! కనీసం అక్కడికి వెళ్ళి వారిని పరామర్శించలేదు. మరి తను ఇచ్చిన గ్యారెంటీ అమలు చేసి నట్లా? చేయనట్లా? దేవుడికి గుడి కట్టించిన వాడు, దేవుడి పేరు మీద ఇచ్చిన గ్యారెంటీని ఉల్లంఘించవచ్చునా?' అడిగింది లక్ష్మి.

'మన దేవుడైన రాముడికి అయోధ్యలో గుడి కట్టించొద్దా!' కోపంగా అడిగాడు యాదగిరి.

'రాముడికి గుడి కట్టించొద్దని అనటం లేదు! గుడి కట్టుకోమని సుప్రీం కోర్టు కూడా చెప్పింది! కాని అదొక్క గ్యారెంటీ మాత్రమే అమలు చేస్తున్నారు! మిగిలినవి ఎందుకు అమలు చేయటం లేదని అడుగుతున్నాము!'అన్నది లక్ష్మి.

'చాలా గ్యారెంటీలు అమలు చేశాడు మా మోడీ !' అన్నాడు యాదగిరి బింకంగా.

"మీరు టీవిలో చూపించని గ్యారెంటీలు ఇంకా చాలా ఉన్నాయి. పెట్రోలు ధర రూ.35 కి తగ్గిస్తామని, నల్లధనం తీసుకొచ్చి మనందరి బ్యాంకు అకౌంట్లలో రూ.15 లక్షల చొప్పున వేస్తామని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, జీఎస్‌టీ పరిధిలోకి పెట్రోలు, డీజిల్ తీసుకొస్తామని, చైనా నుండి దిగుమతులు ఆపేస్తామని, రూపాయిని, డాలర్‌తో సమానంగా పెంచుతామని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామని గ్యారెంటీ ఇచ్చారు. కదా! ఇందులో ఒక్క గ్యారెంటీయైనా అమలు చేశారా ధర్మప్రభువులైన మన మోడీ గారు.' అడిగింది లక్ష్మి.

యదగిరి అటూ ఇటూ చూస్తున్నాడు.

'ఏమిటీ అటూ ఇటూ చూస్తున్నారు! ధర్మ ప్రభువులు అమలు చేసిన గ్యారేంటీల ఆనవాళ్లు ఇక్కడేమీ లేవు!' అన్నది లక్ష్మి.

'ఫోన్ కోసం చూస్తున్నాను. నీ మీద ఈడీకి ఫోన్ చేయాలి!' అన్నాడు.

'చాల్లెండి సంబడం! నేను, మీరూ ఐదేండ్లు కష్టపడి సంపాదించిందాంతా కలిపినా ఈడీ ఆఫీసర్ల ఫ్లైటు ఛార్జీలకు కూడా సరిపోవు! పైగా వారంతా కల్వకుంట్ల కవిత గడబడ్‌లో ఉన్నారు! ఐనా మీకు కావల్సింది ఫోన్ కాదు! వెన్న! ఆవేశంలో మీరు గట్టిగా తొడకొట్టుకున్నారు. పాపం తొడ బాగా వాచిపో యింది!' అంటూండగానే నానిగాడు చిన్నగిన్నెలో వెన్న తెచ్చిచ్చాడు.

- ఉషా కిరణ్

పౌష్టికాహారం తోనే మహిళలకు ఆరోగ్యం



నవతెలంగాణ - కరీంనగర్ : పౌష్టికాహారం తోనే మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటారని, సిడిఎస్ కరీంనగర్ అర్బన్ సిడిపిఓ నారాయణ అన్నారు. ఐసిడిఎస్ కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సవరణ స్ట్రీట్ క్లస్టర్‌లో గల బుట్టి రాజా రామ్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోషణ పక్వాడలో భాగంగా ఆరోగ్య మహిళ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గర్భిణీలు, పిల్ల తల్లులు హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, తల్లులు ప్రతిరోజు ఆరోగ్యకరమైన భోజనం తీసుకోవాలని పోషక ఆహార పదార్థాలను ప్రతిరోజు భోజనం లో ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజమణి అంగన్వాడి టీచర్లు సుస్మిత, మంగ, శ్రీలత, సంధ్య, రోజా, వనజ, పద్మావతి, లక్ష్మి ఆస్పత్రి సూపరిండెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

దొంగను తేల్చారు..



రూ.52లక్షలు దోచుకున్న కొండగట్టు ఆలయ ఉద్యోగి సస్పెండ్

- ఇంజనీరింగ్ విభాగంలోనూ రూ.48లక్షల నిధుల దుర్వినియోగమైనట్టుగా గుర్తింపు
- అందినకాడికి దండుకుంటూ ఏండ్లుగా పాతుకుపోయిన సిబ్బంది
- ఏటా ఆలయ ఉత్సవాలు, ఇతర పర్వదినాల్లో ఏర్పాట్లలోనూ అడ్డూఅదుపులేని చేతివాటం
- 'అంజన్న'కే శఠగోపం పెడుతూ ఏయేటికాయేడు నిధులుకాజేస్తున్న వైనం
- ఎట్టకేలకు అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ తనిఖీ.. రికార్డులు స్వాధీనం
- 2018 నుంచి రికార్డుల పరిశీలన.. వారంలోగా పూర్తిస్థాయి విచారణ
- మరికొంత మంది తేలనున్న ఆలయంలోని 'ఇంటిదొంగలు'

ఎట్టకేలకు కొండగట్టు ఇంటి దొంగను తేల్చారు. లక్షా.. రెండు లక్షలు కాదు..ఏకంగా ఆలయ పరిసరాల్లో వ్యాపారస్తులను వసూలుచేసిన రూ.52లక్షలు ప్రభుత్వానికి జమ చేయకుండా కాజేసిన ప్రబుద్ధుని బాగోతాన్ని తేల్చారు. హైదరాబాద్ కమిషనరేట్ నుంచి వచ్చిన అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రికార్డులు తనిఖీ చేసి ఆలయ నిధులు కాజేసిన వైనాన్ని గుర్తించారు. ఇంజనీరింగ్ విభాగంలోనూ రూ.48లక్షలు దుర్వినియోగం అయినట్టుగానూ గుర్తించి మొత్తం నివేదికను హైదరాబాద్ కమిషనరేట్‌కార్యాలయానికి అప్పగించారు. ఏండ్లుగా ఆలయంలోనే పాతుకుపోయిన సిబ్బంది ఏయేటికాయేడు 'అంజన్న'కే శఠగోపం పెడుతూ అక్రమాల పర్వాన్ని సాగిస్తూ రూ.కోట్లు కాజేస్తూ వచ్చారు. ఆలయ ఈవో కండ్లు గప్పి మరీ ప్రదర్శించిన చేతివాటం ఎట్టకేలకు బయపడటం గమనార్హం. 2018 నుంచి రికార్డులు స్వాధీనం చేసుకున్న హైదరాబాద్ కమిషనరేట్ అధికారులు.. వారంపాటు క్షేత్రస్థాయి విచారణ చేస్తామని చెబుతుండగా.. ఇంకా మరికొంత మంది ఇంటిదొంగలు బయటపడనున్నారు.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / మల్యాల

కొండగట్టు అంజన్న ఆలయం.. ప్రముఖ దైవక్షేత్రంగా విరాజిల్లుతూ ఉమ్మడి జిల్లాలోనే రెండో అతిపెద్ద గుడిగా ఎదిగింది. ఏడాది పొడవునా అంజన్న దర్శనానికి వచ్చే యాత్రికుల సంఖ్య ఏయేటికాయేడు పెరుగుతూ వచ్చింది. అందులోనూ అంజన్న మాలధారణ, విరమణ సమయాల్లో ఆలయం కిక్కిరిసి పోతుంది.ప్రముఖ పర్వదినాల్లో అంజన్నదర్శనానికి వచ్చే జనం లక్షల్లో ఉంటోంది. ఇంతపెద్దఎత్తున వచ్చే భక్తులతో ఆలయ ఆదాయమూ అదేస్థాయిలో పెరిగింది. ఇక ఆలయంలో కొబ్బరికాయలు, కిరాణ వ్యాపారులు, హోటళ్లు, సులభ్‌కాంప్లెక్స్, పూలు, పండ్లు, తలనీలాలు ఇలా చెప్పుకుంటూ పోతే ఏ వ్యాపారమైనా ఏడాదిలో ఒక్కో వ్యాపారానికి రూ.లక్షల్లో వచ్చే టెండర్లు రూ.కోట్లు కుమ్మరిస్తున్నాయి.

ప్రధానంగా ప్రతి సంవత్సరమూ చైత్ర పౌర్ణమి రోజు హనుమాన్ చిన్న జయంతి, వైశాఖ బహుళదశమినాడు వచ్చే హనుమాన్ పెద్ద జయంతి సందర్భాల్లో ఆంజనేయస్వామి దీక్ష తీసుకున్న లక్షలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని ముడుపులు కట్టివెళ్తుంటారు. ఇక పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా మూడ్రోజులపాటు హోమాలు నిర్వహిస్తారు. ఉగాదినాడు పంచాంగ శ్రవణం, చైత్ర శుద్ధనవమి నాడు సీతారాముల కల్యాణం, శ్రావణమాసంలో సప్తాహ ఉత్సవాలు, ఏటా ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నెల రోజులపాటు తిరుప్పావై, గోదారంగనాయకుల కల్యాణం, వైకుంఠ ఏకాదశి నాడు ఉత్తరద్వారం ప్రవేశం, దీపావళికి సహస్ర దీపాలంకరణ, ఏటా పవిత్రోత్సవాలు, సుదర్శన మహాయాగం ఇలా.. అనేక రూపాల్లో ఆలయంలో పూజాకార్యక్రమాలు, ఉత్సవాలు పెద్దఎత్తునే సాగుతుంటాయి. ఇలా ప్రతి సందర్భంలోనూ ఆలయంలో నిర్వహణ, ఏర్పాట్లు, ఇతర సౌకర్యాల కల్పన కోసం వెచ్చించే నిధులూ ఒక్కో దానికి రూ.లక్షల్లో వెచ్చిస్తుంటారు. ఇలా వెచ్చించే ప్రతి నిధుల్లోనూ ఆలయంలోని కొందరు సిబ్బంది ప్రతిసారీ చేతివాటం ప్రదర్శిస్తూ రావడం అక్కడ పరిపాటిగామారింది.

నిధులు కాజేసిన విషయం పొక్కినా...

భక్తులు సమర్పించే కానుకలు, డబ్బులను కాజేసేవారు కొందరైతే.. అడ్డగోలు బిల్లులతో ఆలయ నిధులను స్వాహా చేసేవారు మరికొందరు.. కొండగట్టు ఆలయంలో నిత్యం కనిపిస్తూనే ఉంటుంది. అందులోనూ ఏండ్లుగా పాతుకుపోయిన సిబ్బంది దోపిడికి అడ్డూఅదుపులేదనే చెప్పవచ్చు. సంపన్నవర్గాలు, ప్రముఖులు ఆలయానికి ఇచ్చే భారీ విరాళాలు, కానుకల్లోనూ చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలు వచ్చినా విచారణ జరగలేదంటే అతిశయోక్తికాదు. ఇలా బాహాటంగా రూ.లక్షలు దోచినా.. ఆవిషయం బయటకు పొక్కినా విచారణలో జాప్యం, చర్యలు తీసుకోవడంలో శూన్యం అన్నట్టుగా సాగుతూ వచ్చింది. ఇందుకు ఇటీవల ఆలయ ఉద్యోగి సీనియర్ సహాయకుడు శ్రీనివాసచారి ఏకంగా వ్యాపారుల నుంచి వసూలు చేసిన టెండర్ సొమ్మును ప్రభుత్వ ఖాతాలో జమ చేయకుండా మింగిన వైనం అక్కడి దోపిడికి అద్దం పడుతోంది. ఇటీవల సదరు ఉద్యోగి కొబ్బరికాయలు విక్రయించే వ్యాపారి నుంచి రూ.31.80 లక్షలు, కిరాణ వ్యాపారి నుంచి రూ.60 వేలు, హోటల్ నిర్వాహకుడి నుంచి రూ.50 వేలు, సులభ్‌కాంప్లెక్స్ నిర్వహణదారు నుంచి రూ.2 లక్షలు, పూలుపండ్లు విక్రయించే వ్యాపారి నుంచి రూ.3 లక్షలు వసూలు చేసి ఆలయ బ్యాంకు ఖాతాలో జమచేయకుండా సొంతానికి వాడుకున్నట్లు తేలితే కేవలం నోటీసు ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం జరిగింది. దీనిపై మీడియాలో కథనాలు రావడంతో దేవాదాయ శాఖ కమిషనరేట్ నుంచి తనిఖీలకు వస్తేగానీ నిజానిజాలు తేలని పరిస్థితి నెలకొంది. గతేడాది ఫిబ్రవరిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన సందర్భంగా చేసిన ఏర్పాట్లు, సామాగ్రి కొనుగోలు కోసం రూ.కోటి ఖర్చు చేశారు. అయితే అంతపెద్ద మొత్తంలో కొనుగోలు చేసిన సామాగ్రిలో చాలా వరకూ మయమయ్యాయి.

రూ.52లక్షల అవినీతి.. సీనియర్ అసిస్టెంట్ సస్పెండ్



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

కొండగట్టు ఆలయంలో 2022 నుంచి 2024 మధ్యకాలంలో రూ.52లక్షల అవినీతి చోటుచేసుకుందనిదేవాదాయశాఖ అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి, ఆలయ ఈవో వెంకటేశ్ తేల్చారు. మంగళవారం వారిరువురూ ఆలయ రికార్డులను తనిఖీ చేశారు. ఈమేరకు ఆలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసచారిని సస్పెండ్ చేశారు. 2018-19 సంవత్సరంలోనూ నిర్వహించిన ఆడిట్‌లో పెద్దఎత్తున అక్రమాలు బయటపడ్డాయని గుర్తించారు. ఈ మేరకు 2018 నుంచి ఇప్పటివరకు ఆలయంలో జరిగిన పనులు, నిధుల ఖర్చు తదితర రికార్డులను స్వాధీనం చేసుకున్నారు.కేవలం రెండేండ్ల కాలంలోనే రూ.52లక్షల దుర్వినియోగమైన నివేదికను హైదరాబాద్ కమిషనరేట్‌కు అప్పగించనున్నట్టు తెలిపారు. దీనితోపాటు ఇంజినీరింగ్ విభాగంలో రూ.48లక్షల నిధుల దుర్వినియోగాన్ని గుర్తించినట్టు చెప్పారు. వారంలోగా పూర్తి విచారణ చేసి బాధ్యులైన ప్రతి ఒక్కరిపైనా చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఈవో వెంకటేష్, ఏఈఓ అంజయ్య పాల్గొన్నారు.

బొమ్మకల్ అక్రమ లేఅవుట్లపై డీఎల్‌పీఓ విచారణ



నవతెలంగాణ - భగత్‌నగర్

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బొమ్మకల్ గ్రామ పరిధిలో అక్రమ లేఅవుట్లపై నవతెలంగాణ వరుస కథనాలకు స్పందనగా, బొమ్మకల్ గ్రామ పంచాయతీ విచారణ కోసం డీఎల్పీవో రాంబాబు మంగళవారం క్షేత్ర పరిశీలన చేశారు. పరిశీలనలో జరుగుతున్న అక్రమ వ్యవహారాలను అడ్డుకుని, మోకా మీద మెటీరియల్ తీసుకువచ్చిన డీసీఎం వ్యాన్లను సీజ్ చేయాలని సంబంధిత రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సైకి ఫోన్ చేసి ఆదేశించగా కానిస్టేబుల్‌లు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డీఎల్పీవో రాంబాబు మాట్లాడుతూ సమగ్ర విచారణ జరిపి రిపోర్ట్ తయారుచేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్టీఐ కార్యకర్త దొమ్మతి బాబు మాట్లాడుతూ బొమ్మకల్ గ్రామంలో అక్రమ నిర్మాణాలు, అక్రమ లేఅవుట్లపై కలెక్టర్ పమేలా సత్పతికి అనేకసార్లు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. డీఎల్పీవో మోకా పరిశీలనకు వచ్చి దాదాపు 14సర్వే నెంబర్లలోని కొన్ని అక్రమ నిర్మాణాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ పరిణామంతో బొమ్మకల్లో అక్రమ నిర్మాణాలకు పాల్పడిన వారిలో ఆందోళన నెలకొంది.

కేవీకే పనితీరు భేష్
జిల్లా కలెక్టర్ పమేళా సత్పతి



వర్మి కంపోస్ట్ గురించి అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రము పనితీరు చాలా బాగుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం కె వి కె ఆవరణము మొత్తము అదనపు కలెక్టర్ ప్రఫూల్ దేశాయ్‌తో కలిసి పరిశీలించారు. వారికి సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రతి విషయం గురించి వివరించారు. చేపల పెంపకము, కోళ్ల పెంపకము, వర్మి కంపోస్ట్, ఎర్త్ వామ్ ఎరువు, వరి పొలం, మామిడి తోట, మొదలైన అన్నింటిని ఎంతో ఆసక్తిగా జిల్లా కలెక్టర్ తిలకించి, వాటి గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు.

పదోతరగతి పరీక్ష రెండో రోజు ప్రశాంతం



నవతెలంగాణ - వీర్నపల్లి

వీర్నపల్లి మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా రెండవ రోజు ముగిసింది. పరీక్ష కేంద్రంలో 229మంది విద్యార్థులకు 228మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు హాజరయ్యారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి పరీక్ష హాలులోకి అనుమతించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్ అమలులో ఉందని ఎస్ఐ రమేష్ తెలిపారు.

బీఎస్పీని వీడేది లేదు
వీర్నపల్లి మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్



నవతెలంగాణ - వీర్నపల్లి

బహుజన సమాజ్ పార్టీని వీడేది లేదనీ బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ అన్నారు. వీర్నపల్లి మండలం విలేకరుల సమావేశంలో బీఎస్పి మండల అధ్యక్షులు ప్రశాంత్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ రాజీనామా నేపథ్యంలో మండలంలోని బీఎస్పీ కార్యకర్తలు, నాయకులు అయోమయానికి గురి కావలసిన అవసరం లేదన్నారు. బహుజన ఉద్యమ ద్రోహి ప్రవీణ్ కుమార్ బహుజన ఉద్యమాన్ని దొర దగ్గర తాకట్టు పెట్టారన్నారు. దొరల జెండాలు మోసే దుస్థితి కరుడుగట్టిన బహుజన కార్యకర్తలకు లేదన్నారు. పార్టీని స్వార్థానికి వాడుకొని వదిలేసిన వారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా బహుజన సమాజ్ పార్టీని వీడి ఇతర పార్టీల్లో చేరేది లేదన్నారు. మహనీయులు పూలే, అంబేడ్కర్ చూపిన మార్గంలో నడుస్తామన్నారు.కావున బహుజన సమాజ్ పార్టీ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, కార్యకర్తలు రానున్న పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కోరారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి శేఖర్



శేఖర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేసీఆర్

నవతెలంగాణ - చొప్పదండి

బహుజన సమాజ్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొంకటి శేఖర్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలం ఎర్రవెల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ ప్రవీణ్ కుమార్ తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండి ఆయన బాటలో కొనసాగుతానని, ఇన్ని రోజులు బీఎస్పీ పార్టీ నాయకులు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ పునర్‌నిర్మాణం కోసం పాటుపడతానని తెలిపారు.

బాధితులకు చొప్పదండి ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

నవతెలంగాణ - చొప్పదండి

మండలంలోని గుమ్లాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు కోలాపురి మల్లేశం తల్లి మృతిచెందగా మంగళవారం ఆమె కుటుంబ సభ్యులను స్థానిక నాయకులతో కలిసి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించి 5000రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసి బియ్యాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుర్రం భూమారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాసరెడ్డి, నాయకులు మునిగాల సుధాకర్ గౌడ్, ముద్దసాని రంగన్న, మునిగాల రాజేందర్, కోలాపురి శ్రీకాంత్, మండల లక్ష్మయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి
- మహిళ బాగుంటేనే సమాజం బాగుంటుంది : కలెక్టర్





నవతెలంగాణ - జమ్మికుంట

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, మహిళ బాగుంటేనే కుటుంబం, సమాజం బాగుంటుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పత్తి అన్నారు. మంగళవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో పోషణ అభియాన్‌లో భాగంగా పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫూల్ దేశాయి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. గర్భిణులకు సామూహిక శ్రీమంతం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పిల్లలకు అన్నప్రాసన చేశారు. డి డబ్ల్యు ఓ సరస్వతి అధ్యక్షతన సమావేశం నిర్వహించగా ఈ సమావేశానికి ముఖ్యఅతిథి గా జిల్లా కలెక్టర్ విచ్చేసి మాట్లాడారు. తల్లి దండ్రుల ఆహారపు అలవాట్లే పిల్లలకు వస్తాయని అందుకే మంచి అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. క్యాల్షియం టాబ్లెట్ పిల్లలు పుట్టిన తర్వాత మానివేయ కూడదని ,పిల్లలు పుట్టిన ఆరు నెలల వరకు క్యాల్షియం టాబ్లెట్ వాడితేనే రక్తహీనత అనేది లేకుండా ఉంటుందన్నారు. రైస్ లో కార్బోహైడ్రేట్స్, గ్లూకోజ్ ఉంటుందని కాబట్టి రైస్ తో పాటు కర్రీ కూడా ఎక్కువగా తీసుకోవాలని, ప్రోటీన్స్, న్యూట్రిషన్ గల ఫుడ్ , రాగులు, సజ్జలు, గోధుమలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఫిట్నెస్ కొరకు ఎక్సర్సైజ్ చేయాలని గర్భిణీ స్త్రీలకు సూచించారు. గర్భిణీ స్త్రీలు ఎప్పుడూ ఆకలితో అలమటించకూడదని దానితో గ్యాస్ట్రిక్ సమస్య ఏర్పడుతుందన్నారు. దీపం క్రింద చీకటి లాగా స్త్రీ అందరి కడుపు నింపి, చివరకు లేకుంటే పస్తులుంటుందన్నారు. ప్రెగ్నెన్సీలో 10 నుంచి 12 కిలోలు పెరగాలన్నారు. బలహీనంగా ఉండి తల తిరిగితే ఎట్టి పరిస్థితుల్లో కూల్ డ్రింక్స్ తాగకూడదని కొబ్బరి నీళ్లు రాగి జావా లాంటివి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఆర్డీవో రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్, ఇంచార్జ్ తహసీల్దార్ నీలం శ్రీనివాస్, ఎంపీ ఓ సతీష్ రావు, సీడీపీవో తిరుమల, కెవికె సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ప్రశాంతి, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ చందు సూపర్వైజర్లు అనురాస్ పద్మ, శిరీష, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

బారీగా మద్యం పట్టివేత

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన బండర్ రాజు జమ్మికుంటలో తన కిరాణం షాప్ లో బెల్ట్ షాప్ నడుపుతూ పట్టుబడగా, అతని వద్ద 10 వేల రూపాయల మద్యం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఒరగంటి రవి తెలిపారు. పట్టణంలోని ఆదర్శ కాలనికి చెందినమెరుగు రమేష్ జమ్మికుంటలో తన కిరాణా షాప్ లో బెల్ట్ షాప్ నిర్వహిస్తుండగా ,అతని వద్ద మూడు వేల రూపాయల విలువ గల మద్యం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ ఒరగంటి రవి తెలిపారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి..

- ఎకరాకు పది వేల పరిహారం ఇవ్వాలి
- విద్యుత్ స్తంభం విరిగిపడి మృతి చెందిన ఎల్లయ్య కుటుంబానికి రూ.10లక్షల సాయం అందించాలి
- కరీంనగర్ మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్ కుమార్
- రైతుభీమా సాయాన్ని విడుదల చేయాలని కలెక్టర్‌కు సూచన



నవతెలంగాణ - సిరిసిల్ల : వడగళ్ల వర్షం కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.20వేల పంట నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్ కుమార్ అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు పోతుగల్, సేవాలాల్ తండా, గన్నేవానిపల్లి, తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ గ్రామాల్లో వడగళ్ల వర్షం కారణంగా దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించిన అనంతరం సిరిసిల్ల పట్టణంలోని తెలంగాణ భవన్‌లో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. అంతకుముందు ముస్తాబాద్ మండల కేంద్రంలో వడగళ్ల వర్షం కారణంగా చెట్టు, విద్యుత్ స్తంభం విరిగి పడిన సంఘటనలో మృతి చెందిన ఎల్సాని ఎల్లయ్య కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల సాయం అందించడంతో పాటు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మృతుడికి రైతు భీమా చేయడం జరిగిందని, రూ.5లక్షల రైతుభీమా సొమ్మును వెంటనే రైతు కుటుంబానికి వచ్చే విధంగా చూడాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ జిల్లా కలెక్టర్ కు ఫోన్ చేసి చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి వేలాది రూపాయలు ఖర్చు పెట్టి పంటలు సాగు చేశారని.. వడగళ్ల వానతో రెక్కల కష్టం నేలపాలవ్వడంతో రైతులు కన్నీరు పెడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు తక్షణమే రూ.10వేల చొప్పున పంట నష్ట పరిహారం అందించాలని కోరారు. వడగళ్ల వర్షం కారణంగా దెబ్బతిన్న పంటలను తక్షణమే సర్వే చేయించి పంట నష్టం అంచనా వేయించి రైతులకు నష్ట పరిహారం అందే విదంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి కోరారు. పంట పొలాలకు కాల్వల్లో మోటార్లు వేసుకుని నీళ్ల పారించుకున్న గన్నేవానిపల్లి రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలను కోరారు. రైతురాజ్యం పోయింది.. ఇదెక్కడి అన్యాయమంటూ రైతులు గోసపడుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు ఈ అంశంపై వెంటనే స్పందించి రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ యాసంగి సీజన్‌లో జనవరి చివరి మాసంలో సాగు చేసిన వరి పంటలు పొట్ట దశలో ఉన్నాయని.. ప్రభుత్వం విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేస్తే పంటలు ఎండకుండా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మెన్ కొండూరి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, తెలంగాణ టెక్స్ టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, పీఏసీఎస్ చైర్మన్ దేవయ్య, బండ నర్సయ్య, చక్రపాణి, బొల్లి రామ్మోహన్, తిరుపతి, మల్లారెడ్డి, జక్కుల నాగరాజు యాదవ్, శ్రీనాథ్ గౌడ్, మల్లెంకి శ్రీనివాస్, పెంటయ్య, సత్య నాయక్, సంపత్ పాల్గొన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం



నవతెలంగాణ - సిరిసిల్ల

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం అని ఐద్వా నాయకులు అన్నారు. పట్టణంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో మంగళవారం తెలంగాణా రైతాంగసాయుధ పోరాట వీరనారి మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి జవ్వాజి విమల మాట్లాడుతూ నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రజాకార్ల దొరల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి మల్లు స్వరాజ్యం ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. బిజెపి ప్రభుత్వం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చరిత్రను వక్రీకరిస్తూ రజాకార్ సినిమా పేరుతో హిందూ ముస్లిం పోరాటంగా మార్చి నేటి యువతను తప్పుదోవ పట్టించే విధంగా ఎన్నికల లబ్ధి కొరకు చేస్తున్న ప్రయత్నాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాటంతో అసలు బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని, అది హిందూ ముస్లిం పోరాటం కాదు.

అణిచివేతకు భూస్వాములకు నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భూమి కొరకు భుక్తి కొరకు వెట్టి చాకిరివిముక్తి కొరకు జరిగిందన్నారు. కమ్యూనిస్టులు సాగించిన పోరాటంలో 4000మంది కమ్యూనిస్టు కార్యకర్తలు అమరుల య్యారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు సూరం పద్మ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
6
జగిత్యాల
బుధవారం | మార్చి 20, 2024 | www.navatelangana.com

విద్యార్థినులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

నిజామాబాద్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ధర్మేంద్ర పటేల్

నవతెలంగాణ-మల్లాపూర్

వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు విద్యార్థినులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని లయన్స్ క్లబ్ 320డి నిజామాబాద్ అధ్యక్షుడు ధర్మేంద్ర పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని వీవీరావు పేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 150 మంది విద్యార్థినులకు ఇంటిమేషన్ వాస్ బాటిల్ సానిటరీ పార్ట్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులు బలమైన ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు.



వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఆరోగ్య సూత్రాలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లియోస్ హైదరాబాద్ 320 ఏ చైర్మన్ దిలీప్ కులకర్ణి, పాఠశాల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, దత్తాత్రేయ, ఉపాధ్యాయులు, శ్రీకృష్ణ, కుమారస్వామి, గంగాధర్, ప్రేమయ్య, వాణి, లక్ష్మినారాయణ తదితరులున్నారు.



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గౌడ సంఘం నాయకులు

ఎమ్మెల్యేకు గౌడ కులస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాలరూరల్ మండలం కండ్లపల్లి, హనుమాజీపేట గ్రామాల గౌడ సంఘం సభ్యులు జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కలిసి ఈనెల 27న గ్రామంలో రేణుక ఎల్లమ్మ పట్నాలు, బోనాల పండుగకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్య క్రమంలో నాయకులు శేఖర్, గౌడ సంఘం నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు



ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పెండెం మహేందర్, కార్యదర్శి శ్రీనివాస్, నాయి బ్రాహ్మణ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మాణాల కిషన్, సీనియర్ నాయకులు రాచర్ల విజయ్, బాలరాజు, నారాయణ, గంగారాం, శంకర్ కుల సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ మండలం చలిగల్ గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం సభ్యులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

జగిత్యాల పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం నూతనంగా అధ్యక్షుడిగా పెండం మహేందర్, సంఘ సభ్యులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికయిన మహేందర్, సంఘ సభ్యులను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సన్మానించారు.

లోకమాతను దర్శించుకున్న అడ్లూరి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణం పురాణిపేటలోని లోకమాత పోచమ్మ తల్లి (గాజుల) ఆలయంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీరేణుక ఎల్లమ్మ సిద్ధోగా మహోత్సవం



పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

నవతెలంగాణ-కథలాపూర్

మండలంలోని భూషణ్‌రావుపేట గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మతల్లి సిద్ధోగా మహోత్సవంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గౌడ సంఘం సభ్యులు ప్రభుత్వ విప్ గారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని కాంగ్రెస్ నాయకులు, గౌడ సంఘం పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం

నవతెలంగాణ-జగిత్యాల



జగిత్యాల పట్టణంలోని శివ గాయత్రి అనాథ వృద్ధాశ్రమంలో టీబీసీ జేఏసీ జగిత్యాల నియోజకవర్గ అధ్యక్షుడు, జర్నలిస్టు సురేందర్-లత దంపతుల వివాహ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథ వృద్ధులకు, పిల్లలకు అన్నదానం, వస్త్ర దానాలు హరి అశోక్ కుమార్ చేతుల మీదుగా సురేందర్ దంపతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీబీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, కళాశ్రీ అధినేత గుండేటి రాజు, ప్రముఖ దంతవైద్య నిపుణులు డాక్టర్ హరివిక్రమ్, ఆశ్రమ నిర్వాహకుడు సూరజ్ శివశంకర్, పూజారి రుద్రంగి గోపాలకృష్ణ, పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ శ్రీ శ్రీ భక్త మార్కండేయ ఆలయ వార్షికోత్సవం

నవతెలంగాణ-మల్లాపూర్

మండలంలోని పాతదామరాజ్‌పల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ భక్త మార్కండేయ నాల్గవ ఆలయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతుల కళ్యాణాన్ని నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

16 టేకు దుంగలు పట్టివేత



పట్టుకున్న కలప ట్రాక్టర్

నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి మండలంలోని కల్వకోట రెవెన్యూ శివారులో కాకుల గుట్ట సీపే సర్వేనెంబర్ 696లో 16 టేకు దుంగలను అక్రమంగా తరలిస్తుండగా అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఐచర్ ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలపను పట్టుకుని కొడిమ్యాల అటవీ క్షేత్ర అధికారి కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేసినట్లు బీట్ ఆఫీసర్ మధుసూదన్ తెలిపారు. కలప విలువ సుమారు రూ.48 వేల ఉంటుందని అంచన వేశారు. ఈ కార్యక్రమంలో కొడిమ్యాల రేంజ్ అధికారిని లత, డిప్యూటీ రేంజర్ ముసిరుద్దీన్ సిద్దిక్, బీట్ ఆఫీసర్ మధుసూదన్, ప్రదీప్, బంగ్లా వాచర్లు నల్లగొండం, రాజాం పాల్గొన్నారు.

కోడ్ కూతతో యంత్రాంగం సన్నద్ధం

- జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి సమావేశం



నవతెలంగాణ-జగిత్యాల

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ శనివారం విడుదలైంది. దీంతో పాటు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చింది. నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోకి వచ్చే జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణ కోసం యంత్రాంగం నిమగ్నమైంది. జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా మంగళవారం వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి సహకారం అందించాలని కోరారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో కొత్తగా అధికారిక ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, కొత్తపథకాల అమలు నిలిచిపోయింది. ఎన్నికల విధుల్లో నోడల్ అధికారుల పాత్ర అత్యంత కీలకం. దీనిని దృష్టిలో ఉంచుకొని వివిధ శాఖల్లో పనిచేస్తున్న 18 మంది నోడల్ అధికారులను నియమించారు.

కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలువడుతుంది. ఆ వెంటనే నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభమవుతోంది. అంటే షెడ్యూల్ వెలువడటానికి నెల రోజుల సమయం ఉన్నప్పటి నుంచి ఎన్నికల పనుల్లో అధికారులు నిమగ్నమై పోయారు. ఇప్పటికే ఈవీఎంల మొదటి విడత తనిఖీ పూర్తి చేశారు. ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందిని నియమించేందుకు జిల్లా ప్రణాళిక విభాగం ఆ ప్రక్రియను ప్రారంభించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో నియమించిన పీవో, ఏపీవోలను, సిబ్బందిని తిరిగి ఎన్నికల విధుల్లోకి తీసుకుంటున్నారని తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియామవళిని అమలు చేయడానికి 18 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. 6 వీడియో వీవింగ్ బృందాలు ఏర్పాటు చేశారు. 18 స్టాటస్టిక్ సర్వేలెన్స్ బృందాలను నియమించారు. షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో పంచాయతీ, పురపాలక సిబ్బంది గోడల మీద రాతలు చెరిపివేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ముమ్మరంగా తనిఖీలు..

లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జిల్లా సరిహద్దులో పోలీసుల చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నారు. నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లా సరిహద్దుల వెంట పోలీసులు తనిఖీలు నిర్వహించేందుకు ఎంపిక చేసిన చోట చెక్‌పోస్టులు ఏర్పాట్లు చేశారు.

నిలిచిన ప్రజావాణి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రారంభించిన ప్రజావాణి కార్యక్రమం వివిధ రకాల పరిపాలన కార్యక్రమాల నేపథ్యంలో నిలిచిపోయింది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో మార్చి, ఏప్రిల్, మే నెలలో పూర్తిగా నిర్వహించడానికి అవకాశం లేకుండా పోయిందని, జూన్ 4న ఎన్నికల ఫలితాల ప్రకటించేంత వరకు ప్రజావాణి కార్యక్రమం నిలిచిపోయినట్లేనని పలువురి నుంచి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా

నవతెలంగాణ-జగిత్యాల

జిల్లాలో లోక్ సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, రాజకీయ పార్టీ ప్రతినిధులు సహక రించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. లోకసభ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ ప్రకటించిన దరిమిలా రాజకీయ పార్టీలు వారి ప్రచారం నిర్వ హణలో భాగంగా ప్రచార వాహన, మైకు, ఇతరత్రా అనుమతిలకు సింగిల్ విండో పద్ధతీలో సువిధ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా కరపత్రాలు, ఫ్లెక్సీలు, ఇతర ప్రచార సామాగ్రిల అనుమతులకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీకి దరఖాస్తు చేసుకో వాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 7,09,311 మంది ఓటర్లు ఉన్నారని ఇందులో 3,40,627 మంది పురుషులు, 3,68,650 మంది స్త్రీలు, 34 మంది థర్డ్ జెండర్‌లు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. దివ్యాంగులు 31,954 మంది ఉన్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 785 పోలింగ్ కేంద్రాలు ఉన్నా యని, ఇందులో పట్టణ ప్రాంతాలలో 201, గ్రామీణ ప్రాంతాల్లో 584 కేంద్రాలు ఉన్నాయని వివరించారు. కలెక్టరేట్‌లో జిల్లా కంట్రోల్ రూం నిరంతరంగా పని చేస్తుందని, అత్యవసర, ఇతర సేవలకు 1800 425 7620 కంట్రోల్ రూం నెంబర్‌కు, 1959 హెల్ప్ లైన్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. మాడల్ కోడ్ అమలుకు 18 ఫ్లయింగ్ స్వాడ్, 18 స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీమ్‌లు, 18 మాడల్ కోడ్ అధికారులు, 6 వీడియో వీవింగ్ టీమ్‌లు, 91 సెక్టరల్ అధికారులను నియమించామన్నారు. 7 అంతర్ జిల్లా చెక్ పోస్టు లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికలను సజావుగా నిర్వహించెందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. జగిత్యాల జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు వారి ప్రచారం కోసం అవసరమైన అనుమతులు పొందాలని, జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఓటరు ఎలాంటి ప్రలోభాలకు గురి చేయకూడదన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అంతకుముందు మాస్టర్ ట్రైనర్ పడాల తిరుపతి పవర్ పాయింట్ ద్వారా ఎన్నికల ప్రవర్తన నియమావళి, అనుమతులు, వంటి అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దివాకర, రాంబాబు, ఆర్డీఓలు మధుసూదన్, ఆనంద్ కుమార్, డిప్యూటీ సీఈవో రఘువరన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్

స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి

నవతెలంగాణ-జగిత్యాల

ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని రైతు సంఘం సహాయ కార్యదర్శి లెల్లాల బాలకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు వర్ణ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం ప్రజాసంఘాల కార్యాల యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వారు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో రైతులకు రుణమాఫీ చేస్తానని చెప్పిందని, కౌలు రైతులకు, రైతుబంధు ఇస్తానని చెప్పారని, కానీ అమలుకు నోచుకోలేదన్నారు. అదే విధంగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కూడా రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి, రైతుల యొక్క పోరాటలతో వెనక్కి తగ్గిందన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లాలో మామిడి పంటను ఎక్కువగా పండిస్తారు కానీ ఇప్పుడు మల్టీ నేషన్ కంపెనీ కల్తీ మందులు స్ప్రే చేయడం వల్ల పూర్తిగా పూత రాలి పోయిందన్నారు. నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గర్వందుల రమేష్, జీ తిరుపతి నాయక్ , సిరికొండ చంద్రయ్య, లిం గంపల్లి కొండయ్య మైపాల్ నాయక్ పాల్గొన్నారు.

నెమలిని చంపిన నిందితుల అరెస్టు

నవతెలంగాణ-పెగడపల్లి

జాతీయ పక్షి నెమలిని వెంటాడి తుపాకీతో కాల్చి చంపిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ తెలిపారు. మంగళవారం పెగడపల్లి పోలీస్ స్టేషన్‌లో విలేకర్లతో డీఎస్పీ రఘుచందర్ మాట్లాడుతూ.. పెగడపల్లి మండల పరిధిలోని దోమలకుంటలో సోమవారం రాత్రి వేటాడి నెమలిని చంపి కారులో తీసుకెళ్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు వాహనాలు తనిఖీ చేసి ఇద్దరిని పట్టుకున్నట్లు తెలిపారు. గంగాధర మండలంలోని లక్ష్మీదేవిపల్లికి చెందిన నలువాల సత్యనారాయణ, మల్యాల మండల కేంద్రాన్ని చెందిన జువ్వాడి నారాయణ తుపాకితో నెమలిని చంపి కారులో తీసుకెళ్తున్నట్టు గుర్తించారు. వారిని అరెస్టు చేసి నెమలితో పాటు పాయింట్ 22 ఇంచు రైఫిల్, గొడ్డలి కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. 2017లో భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్‌లో జింకలను వేటాడి చంపిన ప్రధాన నిందితులు వీరేనని, గతంలో వీరిపై కేసు నమోదయిందని. లైసెన్సు లేకుండా ఉన్న తుపాకిని వాడడంతో పాటు వన్య ప్రాణులను చంపడం చట్టరిత్యా నేరమని పేర్కొన్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ నీలం రవి, ఎస్సై రామకృష్ణ, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

తెలంగాణ భూభాగాన్ని ఆంధ్రకు ధారాదత్తం చేసిన ప్రధాని మోడీ

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు

నవతెలంగాణ-కోరుట్ల

తెలంగాణ రాష్ట్రంలోని ఏడు మండలాలను మోడీ అధికారంలోకి రాగానే ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేశారని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మంగళవారం కోరుట్ల పట్టణంలోని జువ్వాడి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇస్తే.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఆంధ్రలో కలిపి తెలంగాణకు అన్యాయం చేశారని ఆరోపించారు. విభజన సమయంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి గిరిజన యూనివర్సిటీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఐటీఐఆర్ లాంటి ఎన్నో విభజన హామీలు పొందుపరిచిందని, మోడీ ఏ ఒక్కటినీ అమలు చేయాలని మండిపడ్డారు. పలు మార్లు పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్ర విభజనను ప్రధాని మోడీ వ్యతిరేకించారని గుర్తు చేశారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక సీట్లను కాంగ్రెస్ స్వాధీనం చేసుకుంటుందని దీమా వ్యక్తం చేశారు. నిజామాబాద్ లోక్‌సభ పరిధిలోని కోరుట్ల అసెంబ్లీ సెగ్మెంట్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజారిటీ వస్తుందని, నాయకులు, కార్యకర్తలు సమిష్టి కృషితో పని చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణారావు

పౌల్ట్రీ ఫారంలో గోడ కూలి బాలుడి మృతి

నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న పౌల్ట్రీ ఫామ్‌లో పని చేస్తున్న డ్రైవర్ అమరగోని రాజు నిర్లక్ష్యం మూలంగా 4 సంవత్సరాల బాలుడు మృతి చెందాడు. ఈఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మేడిపల్లి మండల కేంద్రంలోని శివారులో నూతనంగా నిర్మిస్తున్న పౌల్ట్రీ ఫారంలో మహబూ బాబాద్ జిల్లా వడ్డెర గూడెం గ్రామానికి చెందిన దంపతులు సంగీత శ్రీను వారి నాలుగు సంవత్సరాల వయసు ఉన్న కొడుకు గణేష్‌ను తీసుకొని కూలి పనికి వచ్చారు. ఆ దంపతులు పని చేసుకుంటూ ఉండగా బాలుడు పక్కనే ఉన్న గోడ నీడకు కూర్చున్నాడు. అదే పౌల్ట్రీ ఫారంలో డ్రైవర్ గా పనిచేస్తున్న పెద్దపల్లి జిల్లాకు చెందిన రాజు అజాక్స్ కాంక్రీట్ మిక్సర్ వాహనాన్ని డ్రైవ్ చేస్తున్న క్రమంలో పక్కనే ఉన్న గోడకు ఢీకొంది. దీంతో గోడ కూలి బాలుడి మీద పడడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడి తల్లి సంపంగి సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ అధికారి జి .శ్యామ్ రాజ్ తెలిపారు.

భర్తపై మాజీ భార్య యాసిడ్‌తో దాడి

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

తన భర్తపై మాజీ భార్య యాసిడ్‌తో దాడి చేసిన సంఘటన ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్దండి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్దండి గ్రామానికి చెందిన నీరటి మహేష్‌తో మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామానికి చెందిన మాస రక్షణతో వివాహం జరిగింది. వీరికి ఒక పాప జన్మించింది, అప్పటి నుంచి తరచుగా మనస్పర్థాలు రావడంతో ఇరువురు అంగీకారంతో కోర్టు నుంచి 2023లో విడాకులు తీసుకున్నారు. దీంతో ఇరువురు విడివిడిగా జీవిస్తున్నారు. ఈ క్రమంలో మహేష్ ఈ నెల20న మరో పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడుతుండగా మాస రక్షణ తన మాజీ భర్త మహేష్ ఇంటికి వెళ్ళి అతడు బయటకు రాగానే రక్షణ తన వెంట తెచ్చుకున్న యాసిడ్ బాటిల్‌తో మహేష్ పై దాడి చేయగా వీపుపై. ఎడమ కన్నుపై భాగంలో గాయాలయ్యాయి. మహేష్ ఫిర్యాదు మేరకు మాస రక్షణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

రక్తహీనత కోసం మిల్లెట్లు పోషకాహార పద్ధతులపై అవగాహన



గర్భిణులకు వివరిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

రక్తహీనత కోసం మిల్లెట్లు పోషకాహార పద్ధతులపై డబ్బా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ ప్రతిభ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రక్తహీనత కోసం మిల్లెట్లను పోషకాహారం గిరిజన సాంప్రదాయ ప్రాంతీయ స్థానిక ఆహార పద్ధతులు పోషణపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు కొర్రలు, సామలు, అరికలు, ఊదలు, అండుకొర్రలు రోజూ తినే ఆహారంలో తీసుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. పోష్టికాహారం, చిరుధాన్యాలు, సమతుల్య ఆహారం, ఆహారం వైవిధ్యం, పరిశుభ్రత, ఐరన్ ప్రాముఖ్యత రక్తహీనత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కాముని, రాశి, అంగన్ వాడి ఉపాధ్యాయులు సంజీవ రాణి, సుందరగిరి గంగామణి, ఆయాలు విమల, శ్యామల, ఆశా కార్యకర్తలు జ్యోతి, రజిత, గర్భిణులు, బాలింతలు వివోఏ గౌతమి, మేరీ, తల్లులు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



పాల్గొన్న అధికారులు, రైతులు

నవతెలంగాణ-మల్యాల

మండలంలోని మల్యాల రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వరిలో సాగు మెలకువలపై పొలాస ప్రాంతీయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ మంగళవారం అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ పంటపై డీన్ డాక్టర్ రాజశేఖర్ అవగాహన కల్పించారు. యాసంగిలో కూరగాయల సాగులో చీడపీడల నివారణపై డాక్టర్ కవిత అవగాహన కల్పించారు. రైతులు రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్‌ని వినియోగించు కోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చంద్రదీపక్, వ్యవసాయ విస్తరణ అధికారులు మంజుల, కారుణ్య ప్రశాంత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ



పాల్గొన్న అధికారులు, రైతులు

నవతెలంగాణ-మల్లాపూర్

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతిరోజు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాల పోషన్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ఎత్తు, బరువులను కొలిచారు. అనంతరం పూర్వ ప్రాథమిక విద్య, బాల్య సందర్శన, పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బాలింతలకు, గర్భిణులకు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందజేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రాధా, అంగన్వాడీ టీచర్లు ఇందిర, వసంత, రాదా, భవాని, రాధ, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో నిరుపేద వ్యక్తికీ దహన సంస్కారాలు

నవతెలంగాణ-మల్లాపూర్



మండలంలోని మొగిలిపేట్ గ్రామంలో నివసిస్తున్న బొక్కనపల్లి లక్ష్మి నారాయణ చారి సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. నారాయణని నిరుపేద కుటుంబం అని ఈ విషయాన్ని ట్రస్ట్ వారికీ సమాచారం తెలుపగా దాహన సంస్కారాలకు కావలసిన వాటిని సమకూర్చారు. ట్రస్ట్ అధ్యక్షుడు సుర్గి శ్రీనివాసగౌడ్, మనదీప్ రాంప్రసాద్, మనోజ్, చెట్ల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సరిహద్దు చెక్ పోస్ట్ ప్రారంభం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

జిల్లా సరిహద్దు గల గండి హనుమాన్ గుడి వద్ద అంతర్ జిల్లా చెక్ పోస్టను ప్రారంభించినట్టు ఎస్సై అనిల్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల దృశ్య ఎలక్షన్ కోడ్ రావడంతో చెక్ పోస్టను ప్రారంభించినట్లు పోలీసులు వివరించారు. కాగా మంగళవారం ఎస్సై అనిల్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేశారు.



తనిఖీ చేస్తున్న ఎస్ఐ అనిల్

ఆరోగ్య మహిళా కార్యక్రమం

నవతెలంగాణ - కరీంనగర్

ఐసీడీఎస్ కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సవరన్ స్ట్రీట్ క్లస్టర్‌లో గల బుట్టి రాజారామ్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోషణ పక్వాడలో భాగంగా ఆరోగ్య మహిళ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి గర్భిణులు, పిల్ల తల్లులు, సీడీపీఓ లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తల్లులు ప్రతిరోజు ఆరోగ్యకరమైన భోజనం తీసుకోవాలని, పోషక ఆహార పదార్థాలను ప్రతిరోజు భోజనంలో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజమణి, అంగన్వాడీ టీచర్లు సుస్మిత, మంగ, శ్రీలత, సంధ్య, రోజా, వనజ, పద్మావతి, లక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది, సూపర్‌వైజర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో

ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాయికంటి శ్రీనివాస్



కూలీలతో మాట్లాడుతున్న శ్రీనివాస్

నవతెలంగాణ-మానకొండూర్

జిల్లాలో గత మూడు, నాలుగు నెలలుగా ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కరీంనగర్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాయికంటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని శ్రీనివాస నగర్ గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని సందర్శించారు. రెక్కాడితేనే గాని డొక్కనిండని ఉపాధి కూలీలకు మూడు నెలలుగా కూలి డబ్బులు పెండింగ్ పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలతో వ్యవసాయ కూలీలు ఉపాధి హామీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ లో ఉన్న ఉపాధి కూలీ డబ్బులను వెంటనే విడుదల చేయాలని, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో ఉపాధి హామీ పనులను వెంటనే ప్రారంభించి వారం రోజుల లో కూలి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. పనిచేసే చోట నీడ సౌకర్యం, పనిముట్లు, మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

నవతెలంగాణ - మానకొండూర్

మానకొండూరు మండలంలోని పచ్చునూర్, లక్ష్మీపూర్, పోచంపల్లి గ్రామాలలో ఇటీవల పలువురు మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను మంగళవారం ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నందగిరి రవీంద్రా చారి, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు రామిడి తిరుమల్ రెడ్డి, కనకం అశోక్, రెమిడి శ్రీనివాస్ రెడ్డి, దేవయ్య, రామిడి తిరుపతి, కార్యకర్తలు ఉన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ :

పదో తరగతి పరీక్షలు జిల్లాలో సజావుగా కొనసాగుతున్నాయి. మంగళవారం సిరిసిల్ల గీతా నగర్ జెడ్పీ హైస్కూల్ లోని పదో తరగతి పరీక్షల కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, తంగళ్లపల్లి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ లోని పదో తరగతి పరీక్షల కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ వేరువేరుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రంలోకి వెళ్లి పరీక్షలు కొనసాగుతున్న తీరును వారు పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు పరిశీలించి, అధికారులు పలు సూచనలు చేశారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని స్పష్టం చేశారు. ఇక్కడ డీఈఓ రమేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

'ఐ వోట్' మానవహారం

నవతెలంగాణ - కరీంనగర్

జిల్లా కేంద్రంలోని సెంట్ జాన్స్ ప్రయివేటు పాఠశాల, కరీంనగర్‌లో ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా పాఠశాల పిల్లలతో 'ఐ వోట్' మానవహారం నిర్వహించారు. తమ తల్లిదండ్రులు విధిగా ఓటు హక్కు వినియోగించుకునేలా పిల్లలు వారికి చెప్పాలని తెలిపారు. పిల్లలందరికి సంకల్ప పత్రాలు అందజేసి, వాటిని వారి వారి తల్లిదండ్రులకు చదివి వినిపించి వాటిపై సంతకం చేపించి తిరిగి పాఠశాలలో ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మిస్ట్రేస్ సెంట్ జాన్సస పాఠశాల కరీంనగర్, ఆంజనేయులు, సెక్టోరల్ ఆఫీసర్/జిల్లా కో ఆర్డినేటర్, డీఈఓ ఆఫీస్, స్వీప్ నోడల్ అధికారి ఎస్.రామాచారి పాల్గొన్నారు.



మానవహారం చేస్తున్న విద్యార్థులు

నిబంధనల ప్రకారం పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష

నవతెలంగాణ - కరీంనగర్



మాట్లాడుతున్న కలెక్టర్

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అధికారులంతా నిబంధనల ప్రకారం పని చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళ వారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వివిధ పథకాల కింద ఇప్పటికే ప్రారంభించిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. అత్యవసరమైన విద్యుత్, తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు పాటించకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటికే ప్రారంభించిన అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, సీపీఓ కొమురయ్య, ఇరిగేషన్ ఎస్ఈ శివకుమార్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం జీవిత చరిత్ర పాఠ్యాంశాల్లో చేర్చాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి

నవతెలంగాణ-కరీంనగర్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, మాజీ శాసనసభ్యులు, భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం భూస్వాములను పెత్తందారులను గడగడలాడించిన ధీరవనిత కామ్రేడ్ మల్లు స్వరాజ్యం జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి డిమాండ్ చేశారు. కామ్రేడ్ మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి సందర్భంగా స్థానిక బాలవికాస కేంద్రంలో పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు.

అనంతరం ముకుందలాల్ మిశ్రా భవన్‌లో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా కరీంనగర్ జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి మాట్లాడు తూ..తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి మల్లు స్వరాజ్యం జీవితం నేటి తరానికి ఎంతో ఆదర్శమని వారి జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని డిమాండ్ చేశారు. మల్లు స్వరాజ్యం తన పదకొండో ఏటా నుంచి ప్రజా ఉద్యమాలలో పాల్గొని తుంగతుర్తికి రెండు సార్లు ఎమ్మెల్యేగా అసెంబ్లీలో పేదల పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై గల మెత్తినారాన్నారు. చివరి శ్వాస వరకు ప్రజల కోసం పోరాడిందని అన్నారు. ఆమె ఎర్ర జెండా ఊపిరిగా పోరాటమే ఆయుధంగా 1946, 1948 సంవత్సరంలో సాగిన రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర వహించారని తెలిపారు. నైజాం సర్కారును గడగడలాడించిన ధీర వనిత కామ్రేడ్ మల్లు స్వరాజ్యం అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలతో పాటు కరీంనగర్, వరంగల్, అదిలాబాద్ జిల్లాల్లో దళ కమాండర్‌గా పని చేశారని, ఆమె జీవితమంతా పోరాటమేనని, ఆమె త్యాగం వెలకట్టలేనిదని, ఆమె చరిత్ర విప్లవ ఉద్యమాలకు ఊపిరి పోస్తుందన్నారు. ఆమె చరిత్ర పాఠ్యాంశాల్లో చెప్తే భవిష్యత్ తరాలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆమె ఆశయాలను కొనసాగించేలా కరీంనగర్ జిల్లా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా మహిళల హక్కుల పక్షాన నిలబడి పని చేస్తుందని, వారి ఆశయాలు కొనసాగిస్తామని, సాధిస్తామని ప్రతిన పూనారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఉపాధ్యక్షురాలు ధ్యావ అన్నపూర్ణ, లక్ష్మి, యమునా, శారద, రమా, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న కోనేటి నాగమణి

సమస్యలపై సభ్యుల గళం..

- వేసవికాలంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి...
- సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ...
- మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ - తంగళ్లపల్లి

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా గ్రామాల్లో సమస్యలు ఉన్నాయని సభ్యులు సమస్యలపై గళమెత్తారు. తంగళ్లపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ పడిగల మానస అధ్యక్షతన నిర్వహించారు. సర్పంచ్ల పదవీకాలం ముగిసిన తర్వాత నిర్వహించిన మొదటి మండల సర్వసభ సమావేశంలో ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలపై ప్రతి సమావేశంలో సమస్యలు లేవనెత్తిన ఆ సమస్యలు అట్టే ఉన్నాయని ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారం కావడం లేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో విద్యుత్ సంస్థ తలెత్తిందని వెంటనే విద్యుత్ శాఖ అధికారులు సమస్యలను పరిష్కరించాలని కోరారు. గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీరు మురికి నీరుగా వస్తున్నాయని అవి తాగడానికి వీలు లేకుండా పోతున్నాయని గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు మండిపడ్డారు. మిషన్ భగీరథ అధికారులు వెంటనే ఆ సమస్యను పరిష్కరించి గ్రామాల్లో సజావుగా మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అంతేకాదు ప్రతి సమావేశంలో కొన్ని శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ హాజరు కావడం లేదని ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. కొత్త రేషన్ కార్డులు నమోదు కావడం లేదని కేవలం పాత రేషన్ కార్డుల్లో కొత్త పేర్లను మాత్రమే నమోదు కాపాడుతున్నాయని వాపోయారు. కొత్త రేషన్ కార్డులు దరఖాస్తులను ఆన్లైన్లో కొన్ని సాంకేతిక లోపాల వల్ల నమోదు కావడం లేదని తహసిల్దార్ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. త్వరలోనే ఆ సమస్య పరిష్కారం అవుతుందని ఆ సమస్య కూడా ఉన్నత అధికారుల దష్టికి తీసుకువెళ్లామని వారు తెలిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ... వేసవికాలంలో అన్ని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ సమస్య తలెత్తితే వెంటనే ఆ సమస్యను పరిష్కరించి గ్రామాల్లో విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని సెస్ అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ పైపుల ద్వారా మంచినీరు సరఫరా అయ్యే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టాలన్నారు. తంగళ్ళపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో దశలవారీగా ప్రభుత్వ పథకాలను అందిస్తూ గ్రామాలు అభివద్ధి జరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాలని, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించే విధంగా ప్రతి ఒక్కరు కషి చేయాలని వారు తెలిపారు. గత రెండు రోజులుగా కురిసిన అకాల వర్షం వల్ల పంట నష్టం వందల ఎకరాలు వాటిలిందని, వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాలను అంచనా వేసి రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వానికి నివేదికను అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్, ఎంపీడీవో జోగం రాజు, ఎంపిటిసిలు, స్పెషల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పడిగేల మానస

పేకాట రాయుళ్ల పట్టివేత

14,48,000 రూపాయల నగదు, సెల్ ఫోన్‌లు స్వాధీనం

నవతెలంగాణ-గోదావరిఖని:

రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ సీఐ సంజయ్ అధ్వర్యంలో ఎస్ఐ ఉపేందర్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది, చెన్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అస్నాద్ గ్రామ శివారు మామిడి తోటలో కొందరు వ్యక్తులు రహస్యంగా డబ్బులు పందెం పెట్టుకుని మూడు ముక్కలు (పేకాట) ఆడుతున్నారనే అనే పక్కా సమాచారంతో పేకాట స్థావరంపై దాడి చేసి 10 జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి అరెస్ట్ వివరాలను వెల్లడించారు. సందెల తిరుపతి, అన్నాల తిరుపతి, చోటు, వరంగల్ మొదలగు కొంతమంది కలిసి ఒక టీంగా ఏర్పడి పెద్దపల్లి, మంచిర్యాల, వరంగల్, కరీంనగర్ ఆసిఫాబాద్, ఏరియల నుండి పేకాటా ఆడే కొంతమంది ప్లేయర్లను పిలుచుకొని, కొంత పెట్టుబడి పెట్టి, అటవీ ప్రాంతాలలో రోజుకు ఒక ఏరియాలో పేకాట స్థావరాలు ఏర్పాటుచేసి, వచ్చిన ఆటగాళ్ల నుంచి కొంతమొత్తంలో వసూలు చేస్తూ పేకాట స్థావరం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో నలుగురు లేదా ఐదుగురు కలిసి ఒక కంపెనీగా ఏర్పడి కంపెనీ పెట్టుబడిగా సుమారు 5 లక్షల వరకు పెట్టడం జరుగుతుందని తెలిపారు. వచ్చిన ప్లేయర్ల నుంచి కొంత మేర కమిషన్ కింద వసూలు చేస్తూ, సదుపాయాలు ఏర్పాటు చేస్తారని చెప్పారు. పట్టుపడిన వారిలో పాత మంచిర్యాలకు చెందిన ధరణి బాపు, చెన్నూరు మండలానికి చెందిన అన్నాల తిరుపతి, బడికల లచ్చయ్య, గోదావరిఖనికి చెందిన కంచరపు వెంకటేశ్వ రావు, మంచిర్యాలకు చెందిన భూంబత్తుల శంకర్, వరంగల్‌కు చెందిన గాండ్ల సంతోష్, పెద్దపల్లికి చెందిన పెండాల రాజేందర్, రెబ్బనకు చెందిన జోడి శ్రీనివాస్, గోదావరిఖనికి చెందిన బీమనపల్లి శ్రీనివాస్ను, సిసిసి నస్పూర్‌కు చెందిన దాడి నగేష్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుండి 10 సెల్ ఫోన్లు, 14,48,000 -నగదు, పేక ముక్కలు స్వాధీనపరచుకోవడం జరిగిందని చెప్పారు.



నేటి నుంచి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

- నేటి నుంచి వారం రోజులపాటు ఉత్సవాలు
- 21న స్వామి వారి కల్యాణం



ముస్తాబైన వెంకటేశ్వరస్వామి దేవాలయం

నవతెలంగాణ - గంగాధర :

భక్తులు కోరిన కోర్కెలు తీర్చే వెంకన్నగా ప్రతీతి చెందిన గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి ఆలయ ముఖద్వారాన్ని పోలిఉన్న ఈ ఆలయంలో ప్రతీ యేటా వారం రోజుల పాటు కన్నుల పండువగా వెంకన్న బ్రహ్మోత్సవాలు భక్తుల గోవింద నామస్మరణల మధ్య అత్యంత వైభవంగా జరుగుతాయి. ఆలయ కమిటీ చైర్మన్ కల్వకోట శ్రీనివాసరావు నేతృత్వంలో జరుగనున్న ఈ ఉత్సవాలకు సకల సౌకర్యాలతోపాటు భక్తులకు అవసరమైన వసతుల కల్పనకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య 20వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభమై ఈ నెల 26న ముగుస్తాయి. స్వామివారి ఉత్సవాల్లో భాగంగా 20వ తేదీన సేవ, స్వామివారి ఆలయ ప్రవేశం, 21న పున్యవచనం, రత్విగ్ వర్ణం, అంకురార్పణం, ధ్వజరోహణం, ఎదురుకోళ్లు, గరుడముద్దలు, సాయంత్రం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి కల్యాణం జరుగనుంది. 22న హవనం, బలిహరణం, భేరిపూజ, 23న సదస్యం, ప్రముఖ కవి, వాగ్గేయకారుడు నరసింహస్వామి చెప్పే రామాయణం, హరికథ, 24హనుమాత్ వాహనంపై దోపోత్సవం, హరికథ కాలక్షేపం, 25న బండ్లుతిరుగుట, శేష వాహనముపై స్వామి వారి డోలోత్సవం, 26న రథోత్సవంతోపాటు ఇత్యాధి పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. స్వామి వారి కల్యాణోత్సవంతోపాటు మరో రెండు రోజులు అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని అనేక మండలాలు, గ్రామాల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారి మొక్కులు తీర్చుకోనున్నారు. జాతరకు వచ్చే భక్తుల కోసం తాగునీటి వసతి, క్యూలైన్ల ఏర్పాటు, దుకాణ సముదాయాలకు స్థలాల కేటాయింపు వంటి పలు ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని ఆలయ కమిటి చైర్మన్ కల్వకోట శ్రీనివాసరావు వివరించారు.



పోషకాహారంతోనే తల్లి, బిడ్డల ఆరోగ్యం

ఐసీడీఎస్ సీడీపీవో కస్తూరి పిలుపు

నవతెలంగాణ - గంగాధర :



సమతుల పోషకాహారం తినడం వల్ల కడుపులో పెరిగే బిడ్డ, గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో కస్తూరి సూచించారు. గంగాధర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పోషణ పక్వాడాలో భాగంగా గర్భిణీ స్త్రీలతో నిర్వహించిన సమావేశంలో కస్తూరి మాట్లాడారు. గర్భిణులు ఐరన్, ప్రోటీన్, కాల్షియం అధికంగా ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. చిరుధాన్యాల వల్ల చేకూరే లాభాలు, రోజుకు ఎన్ని కేలరీలు తీసుకోవాలి, ఎటువంటి ఆహారం తీసుకోవాలనే పలు విషయాలను వివరించారు. గర్భిణులకు క్విజ్ పోటీలు నిర్వహించి సరైన సమాధానం చెప్పిన వారికి అరటిపండ్లు, రాగిజావ, చిక్కిలు అందించారు. ఈ సమావేశం సందర్భంగా గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి తల్లిబిడ్డల ఆరోగ్యానికి అవసరమైన మందులను స్థానిక పీహెచ్‌సీ వైద్యులు అందించారు. ఈ సమావేశంలో డాక్టర్లు శ్వేతరాణి, మహేశ్వర్‌రావు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమాదేవి, హెల్త్ సూపర్ వైజర్లు ప్రశాంతి, మెరిసితోపాటు ఆశాలు, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

సొంత గూటికి జక్కని సంజయ్ కుమార్

ప్రజల పక్షాన పోరాడేందుకే బీఆర్ఎస్‌లో చేరిక

బీఎస్పీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కని సంజయ్ కుమార్

నవతెలంగాణ - కరీంనగర్



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేసీఆర్

ప్రజల పక్షాన పోరాడిందుకే బీఆర్ఎస్‌లో చేరానని బీఎస్పీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కని సంజయ్ కుమార్ అన్నారు. బీఎస్పీకి రాజీనామా చేసి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ ఫామ్ హౌస్ ఎర్రవెల్లిలో జరిగిన సమావేశంలో జక్కని సంజయ్ కుమార్ కేసీఆర్ చేతుల మీదుగా టీఆర్ఎస్ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. చిన్నతనంలోనే తెలంగాణ ఉద్యమకారుడిగా, టీఆర్ఎస్‌లో పని చేశారు. పది సంవత్సరాల నుంచి బీసీ ఉద్యమాలలో భాగస్వామ్యమై, రాష్ట్రస్థాయిలో కేంద్రస్థాయిలో పలు బీసీ అంశాలపై అనేక పోరాటాలు నిర్వహించారు. బీసీ సంఘాల రాష్ట్ర నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. బీఎస్పీ పార్టీలో చేరిన సంజయ్ కుమార్ అతి తక్కువ సమయంలోనే బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర అధికార ప్రతినిధిగా, ఉత్తర తెలంగాణ జిల్లాల పార్టీ సమన్వయ కర్తగా, రాష్ట్ర పార్టీ బీసీ స్టీరింగ్ కమిటీ కన్వీనర్‌గా, మునుగోడు ఉప ఎన్నిక, 2023 సార్వత్రిక ఎన్నికలకు పార్టీ ఎన్నికల స్టార్ క్యాంపెనర్‌గా, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా, పార్లమెంటరీ జోనల్ కమిటీ ఇన్‌చార్జిగా పని చేశారు. జాతీయ అధ్యక్షురాలు మాయావతి సభలో సంజయ్ కుమార్ అధ్యక్షత వహించిన తీరు అందరిని ఆకట్టుకుంది. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు నమ్మకమైన అనుచరుడుగా గుర్తింపు పొందిన సంజయ్ కుమార్ ప్రవీణ్ కుమార్ పోటీ చేసిన సిర్పూర్ నియోజకవర్గ ప్రత్యేక ఇన్‌చార్జిగా పని చేశారు. 2023 సార్వత్రిక ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గ బీఎస్పీ పార్టీ అభ్యర్థిగా అప్పటి సీఎం కేసీఆర్‌పై పోటీ చేశారు. ప్రస్తుతం కరీంనగర్ పార్లమెంటు ఇన్‌చార్జిగా, రాష్ట్ర కార్యదర్శిగా ఉండి ప్రవీణ్ కుమార్ వెన్నంటే ఉంటూ పార్టీ పదవులకు, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.

అవగాహన లేక ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నాం

డాక్టర్ ఏఎం రెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ ఏఎం రెడ్డి

నవతెలంగాణ-కరీంనగర్

ఆరోగ్యం పట్ల పూర్తి అవగాహన లేకపోవడం వల్ల మన ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నామని డాక్టర్ కేర్ హెూమియోపతి చైర్మెన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏఎం రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని స్థానిక ప్రతిమ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..ఆరోగ్యం పట్ల ప్రజలకు పూర్తి అవగాహన లేకపోవడం వల్ల తమ ఇష్టానుసారంగా మందులను వాడుతున్నారని, తద్వారా అనారోగ్యాల పాలవుతున్నారని అన్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో కంటే కరీంనగర్ లాంటి జిల్లా కేంద్రాలతో పాటు పట్టణాలు, గ్రామ స్థాయిలో అవగాహన తక్కువగా ఉందన్నారు. పది సంవత్సరాల క్రితం కంటే ఇప్పుడు రోగాలు విపరీతంగా పెరిగాయని అన్నారు. చాలా వరకు వ్యాధులు అంతు చిక్కని కూడా ఉన్నాయని, మందులకు లొంగని రోగాలు కూడా వస్తున్నాయని తెలిపారు. అన్ని వ్యాధులకు హెూమియోపతిలో మందులు ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. భవిష్యత్తు తరాలు కూడా బాగుండాలని ఉద్దేశంతో థాంక్యూ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో నిర్వహిస్తామని తెలిపారు. డాక్టర్ కేర్ సంస్థ ద్వారా జిల్లా ప్రజలకు 10 సంవత్సరాలుగా ఎనలేని సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నీరజ, డాక్టర్ భార్గవి, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కేర్ ఆధ్వర్యంలో థాంక్యూ డాక్టర్..

డాక్టర్ కేర్ హెూమియోపతి ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రతిమ మల్టీప్లెక్స్‌లో డాక్టర్ కేర్ ద్వారా చికిత్స పొంది విజయవంతంగా దీర్ఘకాలిక వ్యాధుల నుంచి బయట పడిన పేషెంట్లు, వారి కుటుంబ సభ్యులతో కలసి థాంక్యూ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు.

హామ్ ఆధ్వర్యంలో చెస్ బోర్డ్స్ పంపిణీ



చెస్ బోర్డులు పంపిణీ చేస్తున్న ధనపురి సాగర్

నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్‌లోని స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల గాయత్రీ నగర్, కపిల్ బాలకుటీర్‌లో ఉంటున్న విద్యార్థులకు హామ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంస్థ సభ్యుడు చిందం రమేష్ కూతురు ప్రణీత జన్మదిన సందర్భంగా చెస్ నేర్చుకోవడానికి అవసరమైన 6 చెస్‌బోర్డ్స్, క్లైన్స్, అరటి పండ్లు అందజేయడం జరిగిందని సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. విద్యతో పాటు వివిధ రకాల ఇండోర్ ఆటలు ఆడటం వల్ల విద్యార్థులు మానసికంగా దృఢంగా తయారవుతారని తెలిపారు. మా సంస్థ పక్షాన ఇక్కడి విద్యార్థులకు వార్షిక పరీక్షల తర్వాత వివిధ రకాల ఇండోర్ గేమ్స్‌ను ఆడించడానికి ప్రణాళిక రూపొందిస్తున్న, గెలుపొందిన వారికి సంస్థ పక్షాన బహుమతులను కూడా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సంయుక్త కార్యదర్శి గోగురి శ్రీధర్ రెడ్డి, సభ్యులు హిమ సాయి, కే.మన్ సాయి బాల కుటీర్ ఇన్‌చార్జి వకుళా మేడం, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్యనిర్వహక కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-గోదావరిఖని:
పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం కోసం రామగుండం కార్పొరేషన్ పరిధిలో పార్లమెంట్ ఎన్నికల కార్యనిర్వహక కమిటీని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ నియమించారు. 36వ డివిజన్ కార్పొరేటర్, రామగుండం కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొంతల రాజేష్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కాలువ లింగస్వామి, 29వ డివిజన్ కార్పొరేటర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, 44వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ముస్తఫా, కాంగ్రెస్ పార్టీ రామగుండం కార్పొరేషన్ బీసీ సెల్ అధ్యక్షుడు గట్ల రమేష్‌తో ఈ కార్యనిర్వహక కమిటీని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రకటించారు.



కమిటీని ప్రకటిస్తున్న రామగుండం ఎమ్మెల్యే

ట్రినిటీ డిగ్రీ, పీజీ కళాశాలలో యువ ఉత్సవ్

నవతెలంగాణ-పెద్దపల్లి
స్థానిక ట్రినిటీ డిగ్రీ, పీజీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ యువ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ట్రినిటీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫౌండర్ దాసరి మనోహర్ రెడ్డి, యూనివర్సిటీ కాలేజీ శాతవాహన యూనివర్సిటీ ప్రిన్సిపాల్ హరికాంత్ లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.విద్యార్థులు అన్ని రంగంలో ముందు ఉండాలని, స్కిల్స్‌పైపట్టు సాధించాలని దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హరికాంత్ మాట్లాడుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించటానికి ముఖ్య లక్షణం సెల్ఫ్ డిసిప్లిన్, లక్ష్యంపై ఫోకస్డ్‌గా ఉండాలన్నారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ నీతారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దాసరి మనోహర్ రెడ్డి

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-పెద్దపల్లి
స్థానిక గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో సైబర్ నేరాలపై సైబర్ క్రైమ్ రామగుండం సీఐ జే.కృష్ణమూర్తి విచ్చేసి సైబర్ నేరాలపై అనేక విషయాలు విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ సాంకేతికత పెరిగిన కొద్దీ నేరాలు కూడా పెరుగుతున్నాయని, మొబైల్ వాడకం చాలా పెరిగిందన్నారు. విద్యార్థులు అనేక ఆప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవడం వాటిలో మెసేజెస్, ఫేస్‌బుక్ ట్విట్టర్, వాటిల్లో ఫోటోలు షేర్ చేయడం, అపరిచితులతో మాట్లాడడం చేయకూడదని, సైబర్ నేరాల్లో ఫోటో మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్ చేయడం జరుగుతుందని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బ్యాంకులో డబ్బులు కూడా దోచుకోవడం జరుగుతుందని, తెలియని వారికి బ్యాంక్ అకౌంట్ నెంబర్ కానీ ఆధార్ నెంబర్ గానీ మొబైల్ నెంబర్ ఇవ్వకూడదని తెలిపారు. ఒకవేళ సైబర్ నేరగాళ్లు మన బ్యాంక్ ఎకౌంట్ హ్యాక్ చేసిన, మన ఫోటో మార్ఫింగ్ చేసిన మనం వెంటనే వెబ్‌సైట్ సైబర్ క్రైమ్.గౌట్.ఇన్ ద్వారా మన సమాచారం అప్‌లోడ్ చేయాలని లేదా హెల్ప్ లైన్ 1930కి కాల్ చేసి సమస్యను తెలియజేయాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధినేత అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ జే.రవీందర్, లెక్చరర్స్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ రామగుండం సీఐ జే.కృష్ణమూర్తి

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కొమ్ము అభిలాష్

నవతెలంగాణ-పెద్దపల్లి
రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కొమ్ము అభిలాష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం పెద్దపల్లి ఆర్యవైశ్య భవన్‌లో జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభిలాష్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో పెద్దపల్లి నుంచి కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన అభ్యర్థి గెలుపు కోసం ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కోరారు. విద్యార్థుల పక్షాన ఎల్లప్పుడూ పోరాడుతామని, రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షించే యువతకు కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం వేదిక అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మడి భరత్ కుమార్, పెనుకొండ ప్రణయ్, ఈగ ప్రశాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శులు పిరంగి రాజు, బొంకూరి పవన్, యమ అనిల్ కుమార్, జిల్లా కార్యదర్శి మదాసి శ్రవణ్ రాజ్, పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల అధ్యక్షుడు కోదాది ప్రశాంత్ రాజ్, కక్కెర్ల సందీప్, మంథని, రామగిరి మండలాల అధ్యక్షులు శైలేందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కొమ్ము అభిలాష్

ఈశ్వర కప వృద్ధ ఆశ్రమంలో సఫలీకృత వైద్య శిబిరం

నవతెలంగాణ-గోదావరిఖని:
వీర్లపల్లిలో గల ఈశ్వర కప వద్ధాశ్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పిటి స్వామి ఆధ్వర్యంలో సఫలీకృత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ జిల్లా సంక్షేమ అధికారి రఫూఫ్ ఖాన్ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మానవ జీవనశైలిలో జీవిత చక్రం చూస్తే ఎవరైనా వృద్ధాప్యానికి రావాల్సిందేనని, వృద్ధులను మంచిగా చూసుకోవాలని, మనకు కర్మ సిద్ధాంతం అనేది ఉంటుందని, వృద్ధులను ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా వారిని మంచిగా చూసుకోవాలని, ఇంటి ముందు ఒక పెద్ద మనిషి ఆ పెద్దమనిషి ఈశ్వరుని లాగానే మనం పూజించాలని అన్నారు. అనంతరం డాక్టర్లు ఆశ్రమంలోని వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర కప ఓల్డ్ ఏజ్ హోం నిర్వాహకులు సీతారామరెడ్డి, లయన్స్ క్లబ్‌ఆఫ్ రామగుండం అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి, బంక కళావతి, మనీషా అగర్వాల్, డాక్టర్ రాజేందర్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ దుర్గ ప్రసాద్, నాగిరెడ్డి, మల్లికార్జున్, డాక్టర్ ఆసంపెల్లి ఆనంద్‌బాబు,ఆశ్రమ నిర్వాహకులు గంట సత్తయ్య పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు


మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

నవతెలంగాణ-గోదావరిఖని:
అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బంగ్లాస్ ఏరియా ఇల్లంద్ క్లబ్‌లో మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథులుగా ఆర్జీ-1 ఏరియా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు చింతల లక్ష్మి శ్రీనివాస్ హాజరై కేక్ కట్ చేసి మంగళవారం వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మగవారికి అన్ని హక్కులు ఉన్నటుగానే మహిళలకు కూడా సమాజంలో సమాన హక్కులు కల్పించి ఒకరోజు పూర్తి స్వేచ్ఛ ఇచ్చి స్త్రీలకే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు గొప్పగా జరుపుకోవాలని ఎన్నో పోరాటాల ఫలితంగా ఈ ఉత్సవాలను జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఏరియా హాస్పిటల్ డాక్టర్స్ రామలక్ష్మి, ఇందిరను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లేడిస్ క్లబ్ సెక్రటరి చిలుక లక్ష్మి, సభ్యులు రమ, తార, కవిత, కళ్యాణి, హేమలత, శ్రీవాణి, ఇతర ఏరియాల జీఎంల సతీమణులు మాలతి, పద్మ, ప్రియదర్శి, అధిక సంఖ్యలో మహిళలు ఉన్నారు.

భూ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలి

▸ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ▸ భూ సేకరణ ప్రతిపాదనల రూపకల్పనపై సమీక్ష

నవతెలంగాణ-పెద్దపల్లి
వరంగల్-మంచిర్యాల మధ్య 4 లైన్ల గ్రీన్ ఫీల్డ్ కారిడార్ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ చేపట్టుటకు భూ సర్వే నిర్వహించి శనివారంలోగా సంబంధిత నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ తన క్యాంప్ కార్యాలయంలో మంచిర్యాల-వరంగల్ జాతీయ రహదారి భూ సేకరణ సర్వే ప్రతిపాదనల రూపకల్పనపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ వరంగల్-మంచిర్యాల మధ్య 4 వరుసల గ్రీన్ కారిడార్ జాతీయ రహదారి కోసం పెద్దపల్లి జిల్లాలోని మంథని, రామగిరి, ముత్తారం మండలాల్లో అవసరమైన భూ సేకరణ చేపట్టుటకు సర్వే చేసి ప్రతిపాదనలను తయారు చేయాలన్నారు. రోడ్లు, భవనాల శాఖ, అటవీ శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, మిషన్ భగీరథ ఇంట్రా, ఉద్యానవన శాఖ అధికారులు జాతీయ రహదారి నిర్మించడం వల్ల ఆయా శాఖల పరిధిలో కలిగే నష్టాలకు, వాటి పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలు, అలాగే సేకరించాల్సిన భూమి, రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారం తదితర అంశాలపై సంపూర్ణ నివేదిక రూపొందించాలని అన్నారు. జాతీయ రహదారి నిర్మాణానికి భూ సేకరణకు సంబంధించి భూ సర్వేను అధికారులు కట్టుదిట్టంగా పూర్తి చేయాలని, భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు తప్పనిసరిగా నష్టపరిహారం అందుతుందని, ప్రభుత్వం ప్రకటించే పరిహారం పట్ల రైతులకు సంతృప్తి కలగని నేపథ్యంలో వారు అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉంటుందని, రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పిస్తూ భూ సర్వే ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో మంథని రెవెన్యూ డివిజన్ అధికారి హనుమానాయక్, జిల్లా అటవీ శాఖ అధికారి శివయ్య, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

రంజాన్‌కు ఏర్పాట్లు చేయాలి

▸ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-పెద్దపల్లి
పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రంజాన్ మాసం నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. జిల్లాలోని మసీదుల వద్ద పారిశుధ్యం పాటించాలని, మసీదుకు వచ్చే రోడ్ల మరమ్మత్తులు పూర్తి చేయాలని, మసీదు చుట్టూ ప్రక్కల ఉన్న వీధిలైట్లు, హైమాస్ లైట్లు వెలగాలని, ఇఫ్తార్ నేపథ్యంలో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని, రంజాన్ పర్వదినం రోజున ఈద్గా, మసీదుల వద్ద చెత్త తొలగించే విధంగా ఏర్పాట్లు చేయాలని, వర్షాల నేపథ్యంలో నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక బృందాలను సిద్ధం చేయాలని కలెక్టర్ మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీ శాఖలను ఆదేశించారు.రంజాన్ మాసం నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఉండే విధంగా పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలని, ఎక్కడ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా జాగ్రత్త వహించాలని, రంజాన్ పర్వదినం రోజున మసీదుల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, రాత్రిపూట సైతం వాణిజ్య సముదాయాలు తెరిచేందుకు అనుమతించాలని కలెక్టర్ తెలిపారు. రంజాన్ నెల సందర్భంగా తాగునీరు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, పైప్‌లైన్ లేని ప్రాంతాలలో అదనపు నీటి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని, నీటి సరఫరాలో ఎక్కడా లీకేజీలు, కలుషితం కాకుండా చూసుకోవా లన్నారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చూడాలని, గ్యాస్ రిఫిల్లింగ్ కొరత రాకుండా చూడాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



మొక్కల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు

▸ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ

నవతెలంగాణ-గోదావరిఖని:
మొక్కల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, నర్సరీలో, పల్లె ప్రకృతి వనాలలో ఎండిపోయిన మొక్కలను వెంటనే రిప్లేస్ చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ పాలకుర్తి మండలంలోని రాణాపూర్ గ్రామంలోని నర్సరీ, పల్లె ప్రకతి వనాలను సందర్శించారు. వేసవి కాలం నేపథ్యంలో నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, రాబోయే వానకాలం నాటికి హరితహారం క్రింద గ్రామాలలో నిర్దేశించుకున్న లక్ష్యాల ప్రకారం అవసరమైన మేర మొక్కలను సన్నద్ధం చేసుకోవాలని అన్నారు. నర్సరీలో ఎండ తీవ్రత నుంచి మొక్కలను రక్షించేందుకు షేడ్ నెట్‌లు ఏర్పాటు చేయాలని, మొక్కల బ్యాగ్ లైన్ అలైన్మెంట్, ఖాళీ బ్యాగులలో విత్తనాలు, మొక్కల కటింగ్స్ పెట్టడం, నర్సరీ బోర్డ్, గేట్ ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలని, మొక్కలకు సరిగ్గా వాటరింగ్ చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జయ్యారం గ్రామంలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట ఎంపీడీవో శశికళ, మండల పంచాయతీ అధికారి షబ్బీర్ అలీ, రామగుండం మండలం విద్యాశాఖ అధికారి, ఏపీవో పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.


సందర్శిస్తున్న అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ

ప్రశాంతంగా 10వ తరగతి పరీక్షలు

▸ అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్ లాల్

నవతెలంగాణ-గోదావరిఖని:
జిల్లాలో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ తెలిపారు. మంగళవారం అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ ఎన్టీపీసీలోని సెయింట్ క్లైర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ మాట్లాడుతూ, 10వ తరగతి పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరుగుతున్నాయని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని అన్నారు. పరీక్షా కేంద్రాలలో సెల్ ఫోన్ అనుమతి లేదని, ఎట్టి పరిస్థితులలో ఎవరు కూడా సెల్‌ఫోన్ తీసుకుని వెళ్లకుండా పకడ్బందీగా చెక్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో 45 పరీక్షా కేంద్రాలలో నిర్వహించిన పదో తరగతి హిందీ పరీక్షలో 7,712 మంది విద్యార్థులకు గాను 7,705 మంది విద్యార్థులు హాజరు కాగా, 99.9 శాతం హాజరు నమోదు అయినట్లు తెలిపారు.10వ తరగతి పరీక్షల నిర్వహణ తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, మంగళవారం నాడు 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 16 పరీక్ష కేంద్రాలను, జిల్లా స్థాయి పరిశీలకులు 6 పరీక్ష కేంద్రాలను, డీఈవో 7 పరీక్షా కేంద్రాలను సందర్శించారని, మాల్ ప్రాక్టీస్ కేసులు బుక్ కాలేదని, హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లుఅదనపు కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో సంబంధిత అధికారులు, తదితరులు అదనపు కలెక్టర్ వెంట ఉన్నారు.

11వ డివిజన్‌లో లబార్థి సంపర్క్ అభియాన్



నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం కార్పొరేషన్ 11వ డివిజన్ గోదావరిఖని సంజయ్ నగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో లబార్థి సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు లబ్ధి పొందిన లబ్ధి దారులను కలుస్తూ భారత ప్రధాని నరేంద్రమోదీ పేద ప్రజల కోసం చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని లబ్ధి దారులను కోరారు. బీజేపీ విట్టల్ నగర్ మండల అధ్యక్షులు అడ్లూరి రాజేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో బీజేపీ లబార్థి సంపర్క్ అభియాన్ పార్లమెంట్ కన్వీనర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు మాతంగి రేణుక, జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి రాజేష్, జనగామ జోన్ మండల అధ్యక్షులు మామిడి సంపత్, రామగుండం జోన్ మండల అధ్యక్షుడు మంద శ్రీనివాస్, నాయకులు వడ్డేపల్లి సదానందం, కొలిపాక విజయ లక్ష్మి, సల్ల వేణురెడ్డి, దుబాసి లక్ష్మణ్ తదితరులున్నారు.

సెయింట్ జోసెఫ్‌లో గ్రాడ్యుయేషన్ కార్యక్రమం


సర్టిఫికేట్స్ ప్రదానం చేస్తున్న కార్పొరేటర్, విద్యా సంస్థల చైర్మన్

నవతెలంగాణ-గోదావరిఖని:
విశ్వ భారతి విద్యాసంస్థలలో భాగమైనటువంటి రామగుండంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్లో యూకేజీ విద్యార్థులు ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ పూర్తి చేసుకొని ప్రైమరీ క్లాస్‌కు ప్రమోట్ అవుతున్న సందర్భంగా వారిని గ్రాడ్యుయేషన్ డ్రెస్, క్యాప్ ధరింపచేసి గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్‌ను మంగళవారం అందజేశారు. ముఖ్య అతిథులుగా 21 డివిజన్ కార్పొరేటర్ ఫాతిమా సలీం బేగ్ పాల్గొన్నారు. విశ్వ భారతి విద్యా సంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్ మాట్లాడుతూ మీ చిన్నారుల గురించి పెద్దయ్యాక ఏమవ్వాలి అని ఈ వయసు నుంచే కలలు కంటూ దానికి అనుగుణంగా మీ పిల్లలను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ నోయల్ జోసఫ్, ప్రిన్సిపాల్ బందారపు తిరుపతి గౌడ్, డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, ఆశా లత పాల్గొన్నారు. అనంతరం యూకేజీ చిన్నారులు తమదైన శైలిలో సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు.

అనుమతులు లేని మట్టిరోడ్డు తొలగింపు

నవతెలంగాణ-ముత్తారం:
ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మానేరు వాగులో ఏర్పాటు చేసిన మట్టి రోడ్డును అధికారులు తొలగించారు. మంగళవారం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ముత్తారం రెవెన్యూ అధికారులు, ఎంపీడీవో, ఇరిగేషన్, పోలీస్ శాఖ, గ్రామపంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామ శివారులోని మానేరు వాగులో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గరిమిళ్ళపల్లికి అక్రమంగా వేసిన మట్టి రోడ్డును జేసీబీ సహాయంతో రెండు చోట్ల కందకాలు తవ్వి తొలగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా మానేరు వాగుపై వేసిన మట్టి రోడ్డును జిల్లా అధికారుల ఆదేశాల మేరకే తొలగించడం జరుగుతుందని వారు అన్నారు. అక్రమంగా మట్టి రోడ్డు వేసి డబ్బులు వసూలు చేయడం చట్ట విరుద్ధమని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై మధుసూదన్‌రావు, ఆర్ఐ భవాని ప్రసాద్, ఎంపీవో వేణుమా ధవ్, గ్రామపంచాయతీ కార్యదర్శి స్వప్న, ఇరిగేషన్ ఏఈ రఫీ, పోలీస్ సిబ్బంది అశోక్, తాండ్ర రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్, కారోబార్ ప్రభాకర్, రాజ్ కుమార్‌తో పాటు తదితరులున్నారు.



డీటైప్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ



నవతెలంగాణ-గోదావరిఖని:
జాతీయ పోషణ మాసం సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు రామగుండం అర్బన్ అధికారి స్వరూప రాణి, సూపర్ వైజర్ యు. పుష్పలత సూచన మేరకు మంగళవారం ఎన్టీపీసీ జ్యోతినగర్ పీటీఎస్‌లోని డీటైప్ క్వార్టర్స్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడి టీచర్ కె.సుజాత శిశుసంరక్షణ ప్రతిఒక్కరిని ఆరోగ్యకరమైన శిశువుగా తయారు చేయడానికి అంగన్వాడి కేంద్రాలలో నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నామని అన్నారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులు, తల్లితండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ కె.సుజాత, ప్రైమరీ పాఠశాల హెచ్ఎం అనురాధ, ఉపాధ్యాయుడు ప్రశాంత్‌రెడ్డి, యువరత్న పబ్లిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జనగామ తిరుపతి, ఆయా పుష్ప, పేరెంట్స్ జహీరభాను, స్వర్ణకుమారి, రామోజీరావు, శ్రావ్య, ధీనమని,శంకర్, విద్యార్థినీ, విద్యార్థులున్నారు.

రోడ్డు వెడల్పులో సహకరిస్తున్న వ్యాపారులకు నష్టం జరగకుండా చూస్తా


వ్యాపారులను కలుస్తున్న రామగుండం ఎమ్మెల్యే

నవతెలంగాణ-గోదావరిఖని:
గోదావరిఖని పట్టణంలోని లక్ష్మి నగర్‌లో అభివృద్ధి పనుల్లో భాగంగా జరుగుతున్న రోడ్డు వెడల్పులో వ్యాపారస్తులకు నష్టం జరగకుండా చూస్తానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. మంగళవారం లక్ష్మినగర్‌లో వ్యాపారులను ఆయన కలిశారు. ప్రతి ఒక్క సింగరేణి క్వార్టర్ తిరుగుతూ, అదేవిధంగా రోడ్డుపై షాప్స్ పెట్టుకొని జీవిస్తున్న ప్రతి ఒక్కరికి నేనున్నానంటూ మీకు ఎలాంటి నష్టం జరగనివ్వనని వారికి ధైర్యాన్ని ఇచ్చి, సహకరించాలని కోరారు. ఆయన వెంట రామగుండం మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, కార్పొరేటర్లు బాలరాజ్‌కుమార్, పెద్దెల్లి తేజశ్వి ప్రకాష్, నాయకులు తిప్పారపు శ్రీనివాస్ తదితరులున్నారు.

సీఎం సహకారంతో రామగుండానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి

▸ రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్
▸ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం



నవతెలంగాణ-గోదావరిఖని:
సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో రామగుండానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని రామగుండం మ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం రామగుండం నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్త సమావేశం నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ రామగుండంలో మార్పు మొదలైందని అన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అవినీతిరహిత పాలన అందిస్తామని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జ్‌తో పాటు మైనారిటీ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యుఐ, మహిళా కాంగ్రెస్, వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులున్నారు.

ఆశ్రమంలో అన్నదానం

నవతెలంగాణ-గోదావరిఖని:
గోదావరిఖనికి చెందిన సామాజిక కార్యకర్త, ఎల్‌ఐసీ ఏజంట్ బొల్ల చంద్రశేఖర్ కుమారుడు వివేక్ జన్మదినాన్ని పురస్కరించుకొని వేడుకలను రామగుండం పట్టణంలోని తబితా ఆశ్రమంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి పంచారు. ముఖ్య అతిథిగా బీజేపీ నాయకురాలు, జడ్పీటీసీ కందుల సంధ్యారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చేతుల మీదుగా అన్నదానాన్ని ప్రారంభించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి జైలు శిక్ష

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహిం చిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ వ్యక్తికి జైలు శిక్ష పడింది. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన కంకణాల సంపత్ రెడ్డిని గోదావరిఖని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ ముందు హాజరు పరచగా, జడ్జి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సిఐ పి.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

పోలీస్ జాగీలం 'షాడో'కు ఎస్పీ అభినందన



నవతెలంగాణ - సిరిసిల్ల

ఎనిమిది నెలల పాటు ఐఐటీఏసు బేసిక్ ట్రైనింగ్ పూర్తిచేసుకుని జిల్లాకు కేటాయించబడిన పోలీస్ జాగీలం 'షాడో'ను సోమవారం జిల్లా ఎస్పీ జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ప్రత్యేకంగా అభినందించారు. ప్రేలుడు పదార్థాలను కనుగొనడంలో ప్రత్యేకంగా శిక్షణ పొందిన షాడో జిల్లా పోలీస్‌శాఖలో సేవలందించేందుకు రావడం సంతోషకరమన్నారు. పోలీస్ జాగీలం షాడోకు హ్యాండ్లర్‌గా వ్యవహరిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్ యాదవ్, ఇతర డాగ్ స్క్వాడ్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు. ప్రస్తుతం జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఆరు పోలీస్ జాగిలాలకు సంబంధించి పూర్తి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. జాగిలాల సంరక్షణ, వసతి ఏర్పాట్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు యాదగిరి, మాధుకర్, రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన ఉండాలి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి
- ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలి
- ప్రీ పోల్, పోల్ డే, పోస్ట్ పోల్ నిర్వహించాల్సిన విధులను కట్టుదిట్టంగా అమలు చేయాలి
- సెక్టార్ అధికారులు, పోలీసులు ముందస్తుగా పోలింగ్ కేంద్రాల రూట్లను తనిఖీ చేయాలి
- మాక్ పోల్ నిర్వహణ, రిజర్వ్ ఈవిఎం యంత్రాల నిర్వహణ ను పకడ్బందీగా చేపట్టాలి
- పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సెక్టార్ అధికారులు, పోలీస్ అధికారులతో అవగాహన కార్యక్రమం

నవతెలంగాణ - సిరిసిల్ల

రాబోయే పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

రాబోయే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సెక్టార్ అధికారులు, పోలీస్ అధికారులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూఎన్నికల కమీషన్ మనకు కేటాయించిన విధులను ఎటువంటి అలసత్వం వహించకుండా సంపూర్ణంగా పూర్తి చేయాలని, ఎన్నికల సందర్భంగా ఏ చిన్న పొరపాటు జరిగిన పరిణామాలు తీవ్రంగా ఉంటాయని కలెక్టర్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 547 పోలింగ్ కేంద్రాలకు 57 సెక్టర్ల పరిధిలో వస్తాయని, సదురు పోలింగ్ కేంద్రాలలో సజావుగా పోలింగ్ జరిగేలా ఈ సెక్టార్ అధికారులు బాధ్యత వహించాలని, సెక్టార్ అధికారులు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాల రూట్ లను ముందస్తుగా పోలీసు అధికారులతో కలిసి పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహించడంలో సెక్టర్ అధికారులు కీలకపాత్ర పోషిస్తారని, అర్హులైన వారికి ఓటర్ జాబితాలో పేర్లు నమోదు చేయడం నుంచి క్రిటికల్ పోలింగ్ కేంద్రాల గుర్తింపు, మాక్ పోల్ నిర్వహణ, పోలింగ్ కేంద్రాలలో అవసరమైన వసతుల కల్పన, సకాలంలో పోలింగ్ రిపోర్ట్ లో అందజేయడం, రిజర్వ్ ఈవీఎం యంత్రాల నిర్వహణ, పోలింగ్ సమయంలో ఈవీఎం యంత్రాలు మొరాయిస్తే వెంటనే నూతన ఈవిఎం యంత్రం ఏర్పాటు చేయడం వంటి అనేక బాధ్యతలను సెక్టార్ అధికారులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. ఎన్నికల పోలింగ్ సమయంలో మాక్ పోల్ నిర్వహణ, సకాలంలో పోలింగ్ ప్రారంభించడం, ప్రతి రెండు గంటలకు పోలింగ్ వివరాల నివేదిక సమర్పించడం, పోలింగ్ అనంతరం రిసెప్షన్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయడం, మొదలైన పనులు సెక్టార్ అధికారులు పర్యవేక్షించాలని, పోలింగ్ తర్వాత పోలింగ్ జరిగిన తీరుపై నివేదిక సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే సమయంలో నియమ నిబంధనలపై అధికారులకు పట్టు ఉండాలన్నారు. ఎన్నికల సందర్భంగా నిర్వహించే తనిఖీలలో ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలని, విధి నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించవద్దని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లు పి.గౌతమి, ఖీమ్యానాయక్ , సిరిసిల్ల , వేములవాడ రెవెన్యూ డివిజన్ అధికారులు రమేష్, రాజేశ్వర్, సెక్టర్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జనశక్తి నక్సలైట్ పేరుతో బెదిరిస్తే కఠిన చర్యలు

- పార్టీ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తి అరెస్ట్
- వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి

నవతెలంగాణ - కొనరావుపేట

జనశక్తి నక్సలైట్ పేరుతో ప్రజలను భయపెడుతూ డబ్బులు వసూళ్లకు పాల్పడుతే కఠిన చర్యలు తీసుకుంటామని వేములవాడ డిఎస్పీ నాగేంద్రచారి అన్నారు. మంగళవారం మండలంలోని పోలీస్ స్టేషన్లో ఆయన మాట్లాడుతూ జనశక్తి నక్సలైట్ పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ పార్టీ ఫండ్ పేరిట డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్న చెన్నమనేని పురుషోత్తంరావు అనే వ్యక్తిని కొనరావుపేట్ పోలీస్‌లు అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. బోయినపల్లి మాండలం కొదురూపాక గ్రామానికి చెందిన చెన్నమనేని పురుషోత్తంరావు ప్రభుత్వ నిషేధిత విప్లవ సంస్థ అయిన జనశక్తి అరుణోదయ సంస్థలలో పని చేస్తున్నానని అమాయక ప్రజలను బెదిరింపులకు పాల్పడుతూ పార్టీ ఫండ్ పేరిట ప్రజల వద్ద అధిక మొత్తంలో డబ్బు కాజేస్తున్నాడనే సమాచారంతో పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. జనశక్తి నక్సలైట్ల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ డబ్బులు వసూలుకు పాల్పడే వారి గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు. ఆయన వెంట ఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కనువిప్పు కలిగించు.. నేతన్నల సమస్యలు పరిష్కరించు

నేతన్న విగ్రహానికి వినతి పత్రం అందించిన సీఐటీయూ నాయకులు



నేతన్న విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

నవతెలంగాణ - సిరిసిల్ల

ప్రభుత్వానికి కనువిప్పు కలిగించి నేతన్నల సమస్యలు పరిష్కరించేలా నాయకుల మనసులు కలిగేలా చేయాలని సీఐటీయూ నేతలు మంగళవారం నేతన్న విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మరమగ్గాల కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కోడం రమణ మాట్లాడుతూ సిరిసిల్లలో ఉపాధి కోల్పోయిన నేతన్నలందరికీ తక్షణ సహాయం కింద రూ.10వేలు అందించాలని, బతుకమ్మ చీరలు ప్రభుత్వ ఆర్డర్లు అందించి నిరంతరం ఉపాధి కల్పించాలని, వర్కర్ టూ ఓనర్ పథకాన్ని పూర్తి చేసి కార్మికులకు శాశ్వత ప్రయోజనం చేకూర్చాలన్నారు. బతుకమ్మ చీరలకు సంబంధించి కార్మికులకు రావలసిన 2022 - 2023 సంవత్సరం 10శాతం యారన్ సబ్సిడీ వెంటనే అందించాలని, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించి సమస్యలన్నింటినీ పరిష్కరించాలని, వస్త్ర పరిశ్రమ అభివృద్ధి కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పవర్లూమ్ అనుబంధ రంగాల కార్మికులందరూ బుధవారం ఉదయం 10గంటల వరకు బీవై నగర్‌లోని సీఐటీయూ కార్యాలయానికి రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండు రమేష్, సబ్బని చంద్రకాంత్, మోర తిరుపతి, రామచంద్రం పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం కూలి వ్యక్తి మృతి

విద్యుత్ పునరుద్ధరణకు అధికారుల పాట్లు

నవతెలంగాణ - ముస్తాబాద్



రోడ్లపై నుంచి చెట్లను తొలగిస్తున్న అధికారులు

భారీ వడగండ్ల వర్షానికి రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో సోమవారం రాత్రి భారీ చెట్టు విరిగి విద్యుత్ స్తంభంపై పడటంతో ఎల్లసాని ఎల్లయ్య(55) మృతి చెందాడు. చెట్లు నేల కూలి రహదారికి అడ్డంగా పడడంతో ఎస్ఐ శేఖర్ రెడ్డి మంగళవారం జేసీబీలు, కూలీలలో చెట్లను తొలగించి ట్రాఫిక్ పునరుద్ధరించారు. విద్యుత్ స్తంభాలు విరగడంతో మరమ్మతులు చేపట్టి, కూలిన చెట్లను తొలగించేం దుకు ఇన్‌చార్జి ఈవో శ్రీనివాస్, విద్యుత్ అధికారులు సాయంత్రం వరకు శ్రమించారు. అకాల వర్షానికి నష్టపోయిన రైతులను చనిపోయిన ఎల్లయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని మండల ప్రజలు కోరారు.

కడగండ్లు మిగిల్చిన వడగండ్లు..

- భారీ వర్షంతో పంటలకు తీవ్ర నష్టం
- నేలవాలిన వరి పైరు.. రాలిన ధ్యానం
- మామిడికి తీవ్ర నష్టం
- పంట చేతికొస్తున్న వేళ రైతన్న ఆక్రందన



పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ - తంగళ్ళపల్లి

అకాల వర్షం రైతన్నలను అతలాకుతలం చేసింది. వడగండ్లు కురిసి వరికి కడగండ్లు మిగిల్చింది. తంగళ్లపల్లి మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి వేళ కురిసిన భారీ వడగండ్ల వర్షం రైతులకు తీవ్ర నష్టం మిగిల్చింది. ఈదురుగాలుల ధాటికి వరి పైరు నేలకొరగగా, వడ్లు రాలిపోయాయి. పంట చేతికి వస్తున్న దశలో కురిసిన అకాల వర్షం తీవ్రంగా నష్టపరిచిందని రైతులు వాపోతున్నారు. కాగా నష్టం వాటిల్లిన పంటలను పలువురు నేతలు, నాయకులు, ప్రజా ప్రతినిధుల పరిశీలించారు. అకాల వర్షం ఈదురు గాలుల వల్ల మామిడి కాయలు నేలరాలడంతో రైతులు ఏం చేయాలో అర్థంకాక దిక్కుతోచక ఆందోళన చెందారు. కస్బే కట్కూర్, మండేపల్లి, వేణుగోపాల్ పూర్, రాళ్లపేట, గండిలచ్చపేట గ్రామాల్లో నష్టం వాటిలిన పంట పొలాలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాస్కర్ మండల వ్యవసాయశాఖ అధికారి సందీప్‌తో కలిసి మంగళవారం క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించారు. అకాల వర్షానికి తంగళ్ళపల్లి మండలంలో దాదాపు 280ఎకరాల వరి పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

పరీక్షా కేంద్రాన్ని సందర్శించి అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ - తంగళ్ళపల్లి



పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

పదవ తరగతి పరీక్షల కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ సందర్శించారు. తంగళ్ళపల్లి మండల కేంద్రం తోపాటు మరో రెండు పదవ తరగతి పరీక్షా కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ కిమ్యా నాయక్ మంగళవారం సందర్శించారు. విద్యార్థులు రాస్తున్న పరీక్ష విధానాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు తలెత్తుతున్నాయా, ప్రశ్న పత్రాలు సరైన ప్రశ్న పత్రాలు విద్యార్థులకు అందుతున్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. మాల్ ప్రాక్టీస్కు పాల్పడకుండా సిబ్బంది తగు చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట డిఇఓ రమేష్,ఎంఆర్ఓ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పీడీఎస్ రైస్ పట్టివేత

నవతెలంగాణ-మల్యాల

మల్యాల మండలంలో ఎస్ఐ అబ్దుల్ రహీం తన సిబ్బందితో పెట్రోలింగ్ చేపట్టారు. మల్యాల గ్రామ శివారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న బొలెరోను పరిశీలించగా అందులో 34.50 క్వింటాల్ పీడీఎస్ రైస్ ఉన్నట్లు తెలిపారు. దీంతో నిందితులు బండారి ఎల్లయ్య, నక్క వెంకట్‌లపై సుమోటో కేసు నమోదు చేశారు.

ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేయాలి

కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి

నవతెలంగాణ-కరీంనగర్

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని కరీంనగర్ పోలీసు కమిషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. మంగళవారం కరీంనగర్ కమిషనరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ విభాగాల అధికారులు, పోలీసు స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలతో సీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు.

ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున 05 అంతర జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, వాటిల్లో ఉండే సిబ్బందికి అప్రమత్తంగా ఉండాలన్నారు. వారికి మౌలిక వసతులైన తాగునీరు, రాత్రి సమయాల్లో సిబ్బంది కనిపించేలా లైటింగ్, రోడ్డుపై వచ్చే వాహన దారులకు కనిపించేలా రిఫ్లెక్టింగ్ జాకెట్లు ధరించి విధులు నిర్వహించేలా చర్యలు తీసుకో వాలన్నారు. చెక్ పోస్టులు పని తీరుపై ఎప్పటి కప్పుడు దృష్టి సారించాలన్నారు. చెక్ పోస్టుల వద్ద వాహన తనిఖీలు క్షుణ్ణంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే సంఘ విద్రోహ వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే బైండ్ ఓవర్ కాబడి గడువు ముగిసిన వారిని తిరిగి బైండ్ ఓవర్ చేయాలన్నారు. ఫ్లాగ్ మార్చ్ సమయాల్లో ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే జరిగే పరిణామాలను వివరించే సమావేశాల్లో ఆయా ప్రాంతాల్లో ఉండే ట్రబుల్ మొంగర్స్‌ని ఉండేలా చూసుకోవాలన్నారు. పలు రాజకీయ పార్టీలు నిర్వహించే ప్రచార సమావేశాలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని ముఖ్యంగా వారి సమావేశం నిర్వహించుకునే సమయం, ర్యాలీ వెళ్లే మార్గం, ఎంతమందితో నిర్వహిస్తున్నారనే సమాచారం తెలుసుకొని తదనుగుణంగా ఎటువంటి గొడవలు జరగకుండా చర్యలు



మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ అభిషేక్ మొహంతి

తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలన్నిటిని సంబంధిత స్టేషన్ల అధికారులు స్వయంగా పరిశీలించాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే దృష్టికి తీసుకురావాలన్నారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

కమిషనరేట్ వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్నకేసుల వివరాలు , అందుకు గల కారణాలను తెలుసుకున్నారు. త్వరితగతిన కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వారెంట్లను ముఖ్యంగా భౌతిక నేరాలకు సంబంధించిన వాటిని అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నియమావళి అమలుకు పటిష్ట చర్యలు చేపట్టాలని , అధికారులందరికీ అవగాహనా కల్పించారు. ఎటువంటి ఉల్లంఘనైనాసరే సంబంధిత సెక్షన్ల ఆధారంగా కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ శాంతి భద్రతలు ఏ.లక్ష్మీ నారాయణ, ఏసీపీ లు నరేందర్, వెంకటరమణ, శ్రీనివాస్, శ్రీనివాస్ (ఎస్ బి), మాధవి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సుడా ఛైర్మన్‌గా పదవికి న్యాయం చేస్తా

- కాంగ్రెస్ పార్టీకి ఇచ్చిన అవకాశాన్ని సంతోషంగా స్వీకరించాను
- 30 ఏండ్లుగా పార్టీకి సేవలందిస్తున్నా
- పార్టీ పెద్దల సమిష్టి నిర్ణయంతోనే నాకు పదవి..
- పార్టీకి కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ అవకాశం వస్తుంది
- సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ-కరీంనగర్

సుడా ఛైర్మన్‌గా నియమించిన కాంగ్రెస్ అధిష్టానం నమ్మకాన్ని నిలబెడుతానని, పదవికి పూర్తి న్యాయం చేస్తానని సుడా ఛైర్మన్, కాంగ్రెస్ పార్టీ నగర్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని పార్టీ కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా పార్టీకి చేసిన సేవలను గుర్తించి సుడా ఛైర్మన్‌గా నియమించిన ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, మార్గదర్శకంలో ఏఐసీసీ నిర్ణయం మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి, రాష్ట్ర రవాణా ,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, ధర్మపురి ఎమ్మెల్యే వడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 2013లో రాష్ట్ర గిడ్డంగుల



మాట్లాడుతున్న సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

డైరెక్టర్‌గా అవకాశం పార్టీ కల్పించి దన్నారు. 2014లో రాష్ట్ర గిడ్డంగుల ఛైర్మన్‌గా అవకాశం రావడంతో ఏన్నోఏళ్లుగా సమస్యలతో పడుతున్నవారికి పెన్షన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఓవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రూ.8వేల జీతాన్ని రూ.16వేలకు పెంచినట్లు తెలిపారు. ఇప్పటికి రిటైర్‌మెంట్ అవుతున్న ఉద్యోగులు తన సేవలు గుర్తు చేసుకోవడం సంతోషన్నిస్తుం దన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా , నగర అధ్యక్షుడిగా అవకాశం కల్పించారన్నారు. నగర అధ్యక్షుడిగా నిరంతరం ప్రజల పక్షాన పోరాడినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ టికెట్ ఇవ్వకున్నా క్రమశిక్షణ కార్యకర్తగా పని చేసినట్లు తెలిపారు. పదేండ్లు గత ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేశామన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ పదవులు వస్తాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కొరవి అరుణ్‌కుమార్, శ్రవణ్ నాయక్ ,అఖిల్,కుర్ర పోచయ్య, స్వామిగౌడ్, బొబ్బిలి విక్టర్, ఖంరొద్దిన్, దన్నసింగ్ , నెల్లి నరేష్, మెతుకు కాంతయ్య, షేహెన్షా, పొరండ్ల రమేష్, గంగుల దిలీప్ ,కీర్తి కుమార్, షబానా మహమ్మద్, ముల్కల కవిత, జ్యోతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెక్ పోస్టుల వద్ద పగడ్బందీ చర్యలు

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ - సిరిసిల్ల/ తంగళ్లపల్లి

లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా జిల్లా సరిహద్దులో ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి మద్యం, డబ్బు ఇతర అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటునట్టు జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ తెలిపారు. తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లెళ్ల వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును తనిఖీ చేసి చెక్ పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లాలో తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లెళ్ల చెక్ పోస్ట్, గంభీరావుపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దమ్మ చెక్ పోస్ట్, ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకట్రావ్‌పల్లి చెక్‌పోస్ట్, వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫజుల్ నగర్ చెక్ పోస్ట్, బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొదురూపాక చెక్ పోస్ట్, రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని మానాల క్రాస్‌రోడ్ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి మద్యం, డబ్బు సరఫరా కాకుండా జిల్లాలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో పరిధిలో ఏర్పాటు చేసిన ఆరు చెక్‌పోస్టుల వద్ద జిల్లాలోకి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తప్పనిసరిగా ప్రతి ఒక్కరు



చెక్ పోస్ట్ వద్ద రికార్డ్ లు తనిఖీలు చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. తనిఖీల్లో సరైన ఆధారాలు లేకుండా రూ.50వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకువెళ్లినట్లయితే సీజ్ చేస్తామన్నారు. అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, పెళ్లిళ్లు, ఇతర అవసరాలకు డబ్బులను తీసుకెళ్తున్న వారు సరైన పత్రాలతో డబ్బులు తీసుకెళ్లాలని సూచించారు. నగదుకు సంబంధించిన తగిన ఆధారాలు, ధ్రువపత్రాలను వెంటే ఉంచుకోవడం ఉత్తమమని అన్నారు.ఎన్నికల నియమావళిని అందరూ పాటిస్తూ వాహనాల తనిఖీలకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

భవన నిర్మాణ కార్మిక కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘం సభ్యులు

నవతెలంగాణ - రామడుగు

మండలంలోని షానగర్ గ్రామానికి చెందిన ఎడవెల్లి రాయమల్లు అనారోగ్యంతో మరణించాడు.ఈ మేరకు రామడుగు మండల భవన నిర్మాణ సంఘం ద్వారా పదిహేను వేలు,షానగర్ గ్రామ భవన నిర్మాణ సంఘం నుండి ఇరువై వేల రూపాయల ఆర్థిక సాయం చేశారు.ఈ ఆర్థిక సాయాన్ని షానగర్ ఎంపీటీసీ కొత్త పద్మవెంకటేష్ చేతులమీదుగా మ్రుతుని కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు.

9వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ - తిమ్మాపూర్

2024- 25 విద్యా సంవత్సరానికి గాను కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ లో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కేంద్రం నందు 9వ తరగతిలో ప్రవేశంకై అర్హత కలిగిన విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తును ఈనెల 23వ తేదీ లోపు చేసుకోగలరని పాఠశాల ప్రిన్సిపల్ దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశం పొందగూరు విద్యార్థులకు 9వ తరగతి సిలబస్ తో పాటు ఐఐటి ఫౌండేషన్ కోర్సు, నీటు ఫౌండేషన్ కోర్సులో శిక్షణ ఇవ్వబడునని, ఉచితంగా అన్ని సైకోర్యాలు కల్పించబడునని చెప్పారు. విద్యార్థులు ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న వారు అర్హులని చెప్పారు. డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. టిఎస్ డబుల్ ఆర్ ఐ ఈఐఎస్. ఇన్ వెబ్సైట్లో అప్లికేషన్ చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలపై 7337349518 నెంబర్ లో సంప్రదించాలని చెప్పారు.

పత్తి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,700

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం కాటన్ విడి పత్తి 544 క్వింటాళ్లు 42 వాహనాలను రైతులు విక్రయానికి తీసుకురాగా గరిష్ట ధర రూ.7700, మోడల్ ధర రూ.7500 కనిష్ఠ ధర రూ.7200 పలికిందని మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే కాటన్ బ్యాగ్సలలో ఆరు క్వింటాళ్లు ఐదుగురు రైతులు విక్రయానికి తీసుకురాగా గరిష్ట ధర రూ.6300 మోడల్ ధర రూ.6000కనిష్ట ధర రూ.5000 పలికింది.

మిషన్ భగీరథ సరఫరా చేయండి..

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపెల్లిలో మిషన్ భగీరథ వాటర్ రెగ్యులర్‌గా రావడం లేదని , లీకేజీలకు మరమ్మతులు చేసి నిరంతరం నీటి సరఫరా చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని మంగళవారం జమ్మికుంటలో జిల్లా కలెక్టర్‌కు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మొహమ్మద్ సజ్జు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.పెరిగిన నీటి వినియోగం, తగ్గిన నీటి సరఫరా ఈసారి నీటిమట్టం తగ్గడంతో దాని ప్రభావం తాగునీటి పంపిణీపై పడిందని తెలిపారు. గత నెల రోజులుగా పలు పలు వార్డుల్లో నూతనంగా విలీనమైన గ్రామాల్లో నల్ల నీరురాక స్థానిక ప్రజలు ఆందోళన గురవుతున్నారని తెలిపారు. విలీనమైన గ్రామాల్లో అస్తవ్యస్తంగా కొన్నిచోట్ల ప్రణాళిక లేకుండా, దూర దృష్టి లేకుండా వేసిన పైపులైన్లను ప్రత్యేక దృష్టి పెట్టి, రానున్న వేసవికాలం దృష్ట్యా ప్రతిరోజు తాగునీటి సరఫరా చేయాలని, లీకేజీ మరమ్మత్తులు చేయాలని, నీటి కొరతతో ఆందోళనలు చెందుతున్న ప్రజల దాహాన్ని తీర్చాలని కోరారు. యువజన కాంగ్రెస్ నాయకులుయాట్ల అశోక్, దొడ్డె నవీన్, జంపయ్య మైస సురేష్, కమలాకర్, రోమాల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మార్చి 23న ఎర్త్ అవర్

- ఆ రోజు రాత్రి 8:30 నుంచి 9:30 వరకు లైట్లు బంద్ చేయాలి
- ఎర్త్ అవర్ పోస్టరావిష్కరణలో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శి వాణీ ప్రసాద్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎర్త్ అవర్‌లో భాగంగా ఈ నెల 23న దేశవ్యాప్తంగా రాత్రి 8:30 నుంచి 9:30 మధ్యలో గంట పాటు లైట్లు ఆఫ్ చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శి వాణీ ప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఎర్త్ అవర్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎర్త్ అవర్ అనేది గ్రహం ఎదుర్కొంటున్న ట్రిపుల్ సంక్షోభాన్ని గుర్తించడానికి, వాతావరణ మార్పులు, జీవ-వైవిధ్య నష్టం, పర్యావరణం రక్షించడానికి దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, స్విచ్ ఆఫ్ పవర్ ద్వారా ఎర్త్ అవర్ పాటించాలని ప్రజలను కోరారు. ఈ ఉద్యమంలో వ్యక్తులు, సంస్థలు, వివిధ సంఘాలు అనవసరమైన లైట్లను ఒక గంట పాటు ఆఫ్ చేయాలని ఈ కార్యక్రమాన్ని నిర్దేశించారు. 23న సచివాలయం, అంబేద్కర్ విగ్రహం, ట్యాంక్‌బండ్‌లోని బుద్ధవిగ్రహం, దుర్గం చెరువు, గోల్కొండ కోట, చార్మినార్, రాష్ట్ర గ్రంథాలయం, రాష్ట్రంలోని ఇతర స్మారక చిహ్నాలన్నింటిలోనూ లైట్లు ఆర్పాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

నెలరోజుల్లోనే ఎన్‌డీఎస్‌ఏ ప్రాథమిక నివేదిక ?

- మరోసారి డిజైన్, నిర్మాణాల పరిశీలన
- నేడు నిపుణుల కమిటీ రాక



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన నిపుణుల కమిటీ కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యంపై నెలరోజుల్లోనే ప్రాథమిక నివేదికను ఇచ్చే ప్రయత్నాల్లో ఉంది. ఈమేరకు అధ్యయనాన్ని వేగిరం చేసింది. పరిపాలన అంశాలతోపాటు నిర్మాణ విషయాలపై మరింత అవగాహన కోసం బుధ, గురువారాల్లో మరోసారి రాష్ట్రానికి రానుంది. హైదరాబాద్‌లోని జలసౌధతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్, నిర్మాణాలను మరోసారి పరిశీలించనుంది. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కేంద్ర జలశక్తి శాఖ పర్యవేక్షణలో చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. తొలిదశ పర్యటనలో అధికారులతో భేటీ కావడంతోపాటు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ప్రణాళికలు, నిర్మాణం, ఇతర సాంకేతిక, భౌతిక అంశాలపై దృష్టిసారించింది.

అధికారుల నుంచి 19 అంశాలపై సమాచారం కావాలని అడిగింది. తాజాగా ఈనెల 20, 21 తేదీల్లో పర్యటన సందర్భంగా డిజైన్లను ఇంకోసారి పరిశీలించాలని నిర్ణయించింది. అలాగే నిర్మాణాలనూ తనిఖీ చేయనుంది. ఈమేరకు రాష్ట్ర సాగునీటి శాఖకు ఎన్‌డీఎస్‌ఏ సభ్య కార్యదర్శి అమితాబ్ మీనా లేఖ రాశారు. ఇదిలావుండగా ప్రాజెక్టుల ప్రణాళిక, సాధారణ అంశాలు, డీపీఆర్ రూపకల్పన, హైడ్రాలజీ, పరిశోధన, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్, నిర్మాణం, నాణ్యతా తనిఖీలు, ఆపరేషన్, నిర్వహణ తదితర అంశాలను మరోసారి అధ్యయనం చేయనుంది. ప్రాజెక్టు పనుల్లో భాగస్వాములైన ప్రతిఒక్కరూ పర్యటన సందర్భంగా అందుబాటులో ఉండాలని ఆదేశించింది. దీంతో ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల బృందం రెండోసారి రాష్ట్రంలో పర్యటిస్తున్న నేపథ్యంలో సాగునీటి శాఖ అధికారుల్లో చర్చ ప్రారంభమైంది. ప్రాథమిక నివేదికను నెల రోజుల్లోనే ఇస్తామని ప్రభుత్వానికి ఇచ్చిన హామీని నిలబెట్టుకునే ప్రయత్నంలో ఎన్‌డీఎస్‌ఏ ఉన్నట్టు సమాచారం.

తుంగభద్ర బోర్డు భేటీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తుంగభద్ర బోర్డు సమావేశం ఈనెల 22న విశాఖపట్నంలో జరగనుంది. గత 14వ తేదీన జరగాల్సి ఉండగా, బోర్డు సభ్యులు అందుబాటులో లేని కారణంగా శుక్రవారానికి వాయిదాపడినట్టు బోర్డు కార్యదర్శి ఓఆర్‌కె రెడ్డి తెలిపారు. ఎజెండా ఇప్పటికే పంపినట్టు చెప్పారు. ఈమేరకు రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు లేఖ అందింది.

కేంద్రం చేతిలో ఈడీ కీలుబొమ్మ

- ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఈడీ అరెస్ట్, రిమాండ్ ఉత్తర్వులపై కవిత సవాల్
- 537 పేజీలతో సుప్రీంలో ఫ్రెష్ పిటిషన్ దాఖలు
- నేడు సీజేఐ బెంచ్ ముందు మెన్షన్ చేసే అవకాశం
- కవిత కేసు విచారించే న్యాయమూర్తి బదిలీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్, రిమాండ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన అరెస్ట్ అక్రమమని, రిమాండ్ ఉత్తర్వులు రద్దు చేయాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరుతూ పలు కీలకాంశాలతో తాజాగా క్రిమినల్ పిటిషన్ దాఖలు చేశారు. కేంద్ర ప్రభుత్వం చేతిలో ఈడీ కీలు బొమ్మగా (పప్పెట్) మారిందని ఆరోపించారు. రాజకీయ ఎజెండాతో ఈడీ అధికారులు పని చేస్తున్నారని పిటిషన్‌లో ప్రస్తావించారు. కవితపై ఎలాంటి కేసు లేదని, పలువురిచ్చిన స్టేట్మెంట్ల ఆధారంగా ఆమెను అరెస్ట్ చేశారని అన్నారు. ఈడీ తీరును నిరసిస్తూ... మొత్తం 537 పేజీల సమగ్ర వివరాలతో కవిత తరపు న్యాయవాది మోహిత్ రావు సోమవారం ఉదయం సుప్రీంకోర్టులో ఫ్రెష్ పిటిషన్ దాఖలు చేశారు. గతంలో సర్వోన్నత న్యాయస్థానంలో కవిత దాఖలు చేసిన పిటిషన్, ఆ పిటిషన్ పై విచారణ, తేదీల వారీగా కోర్టు ఆదేశాలు, ఇతర అంశాలను వరుస క్రమంలో మెన్షన్ చేశారు. అయితే విచారణ జాబితాలో ఈ పిటిషన్ నమోదు కాకపోవడంతో... బుధవారం సీజేఐ బెంచ్ ముందు ఈ అంశాన్ని మెన్షన్ చేయనున్నట్లు అడ్వకేట్లు తెలిపారు. కాగా, సుప్రీంకోర్టులో ఇచ్చిన హామీకి విరుద్ధంగా ఈడీ అధికారులు తనను అరెస్ట్ చేశారని కవిత పిటిషన్ లో ఆరోపించారు. ఏడాది కాలంగా తన పిటిషన్‌పై జరిగిన వాదనలు, సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఈ పిటిషన్‌కు జత చేశారు. చట్ట విరుద్ధంగా కక్ష సాధింపుతో తనను అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. అలాగే గత విచారణల సందర్భంగా కవితను అరెస్ట్ చేయబోమని ఈడీ తరపు అడ్వకేట్లు పలు సందర్భాల్లో చేసిన వాదనలపై... కోర్టు ఆదేశాలు, మీడియా సంస్థలు ప్రచురించిన వివరాలను ఫొటోలతో సహా పిటిషన్‌కు జతచేశారు. పిటిషన్ మహిళ అయినందున... ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ -2022 సెక్షన్ 50(2) ప్రకారం కవితకు రక్షణ ఉంటుందన్నారు. అలాగే కేంద్ర మాజీ మంత్రి చిదంబరం సతీమణి నళిని చిదంబరం కేసులో మహిళలను ఇంటివద్దనే విచారించాలన్న తీర్పు కాపీలను అటాచ్ చేశారు. మహిళా నిందితురాలను ఇంటివద్దనే విచారించాలనే ఉత్తర్వులను ఉల్లంఘించారని వివరించారు.

ఈడీ కస్టడీ రాజ్యాంగ విరుద్ధం

సుప్రీంకోర్టులో పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే సోదాల పేరుతో హైదరాబాద్‌లోని తన నివాసంలోకి వచ్చిన ఈడీ అధికారులు అక్రమంగా తనను అదుపులోకి తీసుకున్నారని ప్రస్తావించారు. అనంతరం కోర్టులో ప్రవేశ పెట్టి కస్టడీకి తీసుకున్న తీరును వివరించారు. సుదీర్ఘ వాదనల అనంతరం తనను ఈడీ కస్టడీకి అప్పగించారని తెలిపారు. అయితే ఈ కస్టడీ విధింపు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 21, 22(1) అండ్(2) ప్రకారం విరుద్ధమని పేర్కొన్నారు. ఈడీ అధికారుల అక్రమ అరెస్ట్‌తో పిటిషనర్‌కు తీవ్ర నష్టం జరిగిందన్నారు. పిటిషనర్ ఎలాంటి తప్పు చేయలేదని, కవితపై ఎలాంటి కేసు లేదన్న విషయాలను పరిగణలోకి తీసుకోవాలని న్యాయస్థానాన్ని కోరారు. అందువల్ల తుది తీర్పు వెలువడే వరకు పలు షరతులు విధిస్తూ తక్షణమే కవితను విడుదల చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ రిట్ పిటిషన్ పెండింగ్‌లో ఉన్నంత కాలం కవితపై ఎలాంటి బలవంతపు(అరెస్ట్)చర్యలు తీసుకోకుండా ఈడీకి ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రస్తుత అరెస్ట్‌పై స్టే విధిస్తూ ట్రయల్ కోర్టు ఉత్తర్వులను పక్కన పెట్టాలని



కోరారు.

పిటిషన్‌ను ఉపసంహరించుకున్న కవిత

ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సుప్రీంకోర్టులో వేసిన రిట్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఇందుకు సర్వోన్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. మద్యం కుంభకోణంలో దర్యాప్తు సంస్థల తనపై ఎలాంటి బలవంతపు చర్యలు(అరెస్ట్) తీసుకోకుండా చూడాలంటూ కవిత గతేడాది మార్చిలో 105 పేజీలతో కూడిన రిట్ పిటిషన్ (క్రిమినల్) వేశారు. ఇందులో ఈడీ ఆఫీసుకు మహిళలను విచారణకు పిలవవచ్చా? అనే అంశాన్ని కూడా సవాల్ చేశారు. అయితే గత ఏడాది కాలంగా ఈ పిటిషన్ వాయిదా పడుతూ వస్తోంది. కాగా, గత శుక్రవారం కవితను ఈడీ అధికారులు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో అరెస్ట్ చేశారు. అయితే కవిత గతంలో దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చింది. కవిత తరపు సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపించారు. కవిత అరెస్ట్‌తో తనపై బలవంతపు చర్యలు(అరెస్ట్) తీసుకోకూడదంటూ వేసిన పిటిషన్ నిరార్థకం అయిందన్నారు. అందువల్ల చట్టపరంగా ఉన్న పరిష్కార మార్గాలతో ముందుకు వెళ్తామని ధర్మాసనానికి నివేదించారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన ధర్మాసనం.. పిటిషన్ విషయంలో స్పష్టత కోరింది. ఇందుకు బదులిస్తూ తాము వేసిన పిటిషన్‌ను విత్ డ్రా (ఉపసంహరణ) చేసుకుంటున్నట్లు విక్రమ్ చౌదరి నివేదించారు. ఈ విజ్ఞప్తిపై జస్టిస్ బేలా ఎం త్రివేది ఈడీ అభిప్రాయాన్ని కోరింది. ఇందుకు ఈడీ తరపున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు అభ్యంతరం తెలపకపోవడంతో కవిత పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు ధర్మాసనం అనుమతించింది.

తల్లి, కుమారుడు ఇతర కుటుంబ సభ్యులు కలిసేందుకు అనుమతి

ఈడీ కస్టడీలో ఉన్న తనను కలిసేందుకు తల్లి, పిల్లలకు అనుమతినివ్వాలని కవిత రౌస్ ఎవెన్యూ కోర్టును ఆశ్రయించారు. తల్లి శోభ, కుమారులు ఆదిత్య, ఆర్య, సోదరీమణులు అఖిల సౌమ్య, వినుత సోదరుడు ప్రశాంత్ రెడ్డిలను కలుసుకునేందుకు అనుమతి ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ మేరకు మంగళవారం కవిత తరపు న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఈడీ అధికారులు అభ్యంతరం తెలిపారు. ఎక్కువ మంది కలవడం వల్ల దర్యాప్తునకు ఆటంకం కలుగుతుందని పేర్కొన్నారు. అయితే కవిత విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకొన్న ధర్మాసనం తల్లి, కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులను కలిసేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. కాగా కవితను ఈడీ కస్టడీకి అప్పగిస్తూ గత శనివారం సీబీఐ స్పెషల్ కోర్టు ఆదేశాలిచ్చింది. ఇందులో భర్త అనిల్, సోదరుడు కేటీఆర్, బావ హరీశ్, ఇద్దరు న్యాయవాదులకు, మరో ముగ్గురికి అనుమతి ఇచ్చింది.

న్యాయవాదితో కేటీఆర్ భేటీ

కస్టడీలో ఉన్న కవితను మంగళవారం కేటీఆర్ ఒక్కరే కలిశారు. తొలిరోజైన ఆదివారం భర్త అనిల్, హరీశ్ రావులతో కలిసి కేటీఆర్ కవితను పరామర్శించారు. సోమవారం కేటీఆర్, హరీశ్‌రావులు వెళ్లగా... మంగళవారం మాత్రం కేటీఆర్ ఒక్కరే కలిసి మాట్లాడారు. న్యాయవాది మోహిత్ రావుతో కలిసి చట్ట పరంగా ముందుకెళ్లోన్న విషయాలను వివరించారు. అలాగే దర్యాప్తులో ఇతర సమస్యలు, ఫ్రెష్ రిట్ పిటిషన్‌లోని అంశాలను ఆమెకు తెలిపారు. అయితే నిబంధనల ప్రకారం... సాయంత్రం 5 గంటలకు కవిత విచారణ సమయం ముగిసింది. 5:30 కి వైద్యుల బృందం రోజువారీ సాధారణ వైద్య పరీక్షలు చేశారు. ఆరు గంటలకు దర్యాప్తు చేస్తోన్న డిప్యూటీ డైరెక్టర్ భాను ప్రియ మీనా ఈడీ ఆఫీసు నుంచి వెళ్లి పోయారు. కాగా, మంగళవారం విజిటింగ్ సమయంలో మార్పులు జరిగాయి. 6 నుంచి 7 గంటల మధ్య కుటుంబ సభ్యులను కలిసేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. అయితే పలు కారణాల వల్ల కేటీఆర్, న్యాయవాది మోహిత్ రావు రాత్రి 7 గంటలకు కవితను కలిశారు.

మూడో రోజు సుదీర్ఘంగా సాగిన విచారణ

కస్టడీలో ఉన్న కవితను మూడో రోజు ఈడీ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. ముఖ్యంగా ఇప్పటి వరకు ఈడీ సేకరించిన ఆధారాలు, సాక్షుల వాంగ్మూలం, సహ నిందితుల నుంచి రాబట్టిన వివరాలపై ఆరా తీశారు. ఉదయం 10.30 గంటల తరువాత కవిత విచారణ ప్రారంభమైంది. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో అధికారులు లంచ్ బ్రేక్ ఇచ్చారు. మళ్లీ 3 గంటల తరువాత విచారణ ప్రారంభించి, 5 గంటల లోపు ముగించారు. పాలసీ రూపకల్పన సందర్భంలో ఢిల్లీ, హైదరాబాద్‌లోని హోటల్స్‌లో జరిగిన మీటింగ్‌లు, సౌత్ గ్రూప్ సభ్యుల ఫోన్లలో దొరికిన కీలక ఆధారాలపై ఈడీ ప్రశ్నించింది. ముఖ్యంగా రూ.100 కోట్ల ముడుపులను ఆప్ నేతలకు చేరవేతపై ఆరా తీసినట్లు తెలిసింది. గోవా, పంజాబ్ ఎన్నికలకు ఈ నిధులు మళ్లించిన విషయంపై ఆమె స్టేట్మెంట్ ను రికార్డు చేసినట్లు సమాచారం. అలాగే బుచ్చిబాబు, అరుణ్ పిళ్లై, అభిషేక్ బోయిన పల్లితో జరిపిన మీటింగ్‌లు, కాల్ డేటా, చాట్స్ పై వాంగ్మూలం తీసుకున్నారు. ఇందులో పలు ప్రశ్నలకు సమాధానం చెప్పిన కవిత, కొన్ని అంశాల్లో తనకు సంబంధం లేదన్నారు. కాగా విచారణ అధికారి భాను ప్రియ మీనా పలు రాజకీయ ప్రశ్నలు వేయగా... ఈ కేసుతో వాటికి ఏం సంబంధం అని కవిత చెప్పినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

కవిత కేసు విచారించే న్యాయమూర్తి ఎంకె నాగ్‌పాల్ బదిలీ
ఆయన స్థానంలో న్యాయమూర్తి కావేరీ బవేజా నియమకం

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుని విచారిస్తున్న ఢిల్లీ రౌస్ ఎవెన్యూ కోర్టు న్యాయమూర్తి ఎంకె నాగ్‌పాల్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో న్యాయమూర్తి కావేరీ బవేజా నియమితులయ్యారు. ఢిల్లీ హైకోర్టు జ్యుడీషియల్ సర్వీసెస్‌లోని మరో 26 మంది న్యాయమూర్తులు కూడా బదిలీ అయ్యారు. అనూహ్యంగా జడ్జి నాగ్‌పాల్ కూడా బదిలీ కావడం గమనార్హం.

మూడు వారాల్లో స్పందించండి

(మొదటిపేజీ తరువాయి)

స్పందనను కోరింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి నోటీసిచ్చింది. మూడు వారాల్లోగా పిటిషన్లకు వివరణివ్వాలని ఆదేశించింది. సీఏఏపై ఆందోళన వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో డీవైఎఫ్ఐ, ఐయూఎంఎల్, కేరళ ప్రభుత్వం, ఇతర సంఘాలు, వ్యక్తులు 236 పిటిషన్లు దాఖలు చేశారు. ఇటీవల ఆ చట్టానికి చెందిన రూల్స్‌ను నోటిఫై చేస్తూ ఇచ్చిన ఆదేశాలను కూడా ఆయా పిటిషన్లలో సవాల్ చేశారు. ఈ పిటిషన్లను మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఏప్రిల్ 2లోగా ఐదు పేజీలకు పరిమితం చేస్తూ సమాధానం దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. దానికి ఐదు పేజీల కౌంటర్‌ను ఏప్రిల్ 8లోగా దాఖలు చేయాలని ధర్మాసనం పేర్కొంది. ప్రస్తుతం సీఏఏ అమలుపై స్టే విధించేందుకు కోర్టు నిరాకరించింది. అయితే ఈ కేసు తదుపరి విచారణను ఏప్రిల్ 9న వాయిదా వేసింది.

నాలుగేండ్ల తరువాత నిబంధనలను నోటిఫై చేయడమేంటీ?

కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా నాలుగు వారాల గడువు కోరారు. దీనిని పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వ్యతిరేకించారు. "స్టే దరఖాస్తుకు సమాధానానికి నాలుగు వారాలు చాలా ఎక్కువ. ఈ నిబంధనలు నాలుగేండ్ల తరువాత నోటిఫై చేశారు. 2020 నుండి ప్రతి మూడు నెలల తరువాత పార్లమెంటు నిర్వహించి, ఇప్పుడు నోటిఫై చేశారు. ఇప్పుడు పౌరసత్వం మంజూరు చేస్తే అప్పుడు దానిని తిప్పికొట్టేందుకు అవకాశాలు ఉన్నాయి. అంతర్జాతీయ చట్టం ప్రకారం పౌరసత్వం మంజూరు చేసిన తరువాత మీరు దానిని వెనక్కి తీసుకోలేరు" అని సిబల్ అన్నారు. సీఏఏ ఆమోదించిన దాదాపు నాలుగేండ్ల తరువాత అకస్మాత్తుగా నిబంధనలను నోటిఫై చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

"వారు చట్టబద్ధమైన నిబంధనలపై స్టే కోరుతున్నారు" అని సొలిసిటర్ జనరల్ అన్నారు. దీనికి కపిల్ సిబల్ స్పందిస్తూ "నాలుగేండ్ల తరువాత అత్యవసరం ఏమిటి? మేము నోటిఫై చేయడం లేదని వారు గతంలో చెప్పారు" అని వాదించారు. దీనిపై స్పందించేందుకు ప్రభుత్వానికి రెండు వారాల గడువు ఇవ్వాలని ధర్మాసనం పేర్కొంది.

పెండింగ్‌లో ఉన్నందున పౌరసత్వాన్ని మంజూరు చేయొద్దు

పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ కూడా వాదనలు వినిపిస్తూ ఈ అంశం కోర్టులో పెండింగ్‌లో ఉన్నందున నిబంధనల ప్రకారం ఎలాంటి పౌరసత్వాన్ని మంజూరు చేయకూడదని ప్రభుత్వానికి సూచించాలని వాదించారు. "పౌరసత్వం మంజూరు చేయబడిందా? లేదా? పిటిషనర్లపై ప్రభావం చూపదు" అని సొలిసిటర్ జనరల్ బదులిచ్చారు. "అది సమస్య కాదు. సమస్య దీనికి రాజ్యాంగబద్ధత" అని జైసింగ్ బదులిచ్చారు. దీంతో ఆమె తాత్కాలిక స్టే కోసం ఒత్తిడి తెచ్చారు. 1995 నాటి పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 2ను సవరించారు. దాని ప్రకారమే ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లో ఉన్న హిందూ, సిక్కు, బౌద్ధ, జైన్, పార్సి, క్రైస్తవ మైనార్టీలకు పౌరసత్వాన్ని ఇవ్వనున్నారు.

అయితే పౌరసత్వం ప్రాతిపదికన ఇవ్వడంతో, మతపరమైన వివక్ష జరుగుతుందని పిటిషనర్ల వాదన. సీఏఏ రాజ్యాంగానికి కూడా వ్యతిరేకంగా ఉందని పిటిషనర్లు పేర్కొన్నారు

మల్లు స్వరాజ్యం జీవితం స్ఫూర్తిదాయకం

- నాటి పోరాటానికి మతం రంగు పూస్తున్న బీజేపీ
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి కార్యక్రమాలు

నవతెలంగాణ- విలేకరులు

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి మల్లు స్వరాజ్యం జీవితం స్ఫూర్తిదాయకమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు రాయునిగూడెంలో మల్లు స్వరాజ్యం జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు నిర్మించిన మల్లు స్వరాజ్యం స్మారక కళావేదికను జూలకంటి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. ఈ తరానికి ఆమె ఒక స్ఫూర్తి అని, ఆమె పోరాటం అందరికీ ఆదర్శమని అన్నారు. తుపాకీ పట్టి నిజాంను గడగడలాడించిన వీరవనిత మల్లు స్వరాజ్యం అని కొనియాడారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ దుర్మార్గంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మతం రంగు పూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఆనాటి అమరవీరుల త్యాగానికి ద్రోహం చేసినట్టు అవుతుందన్నారు. వీర తెలంగాణ సాయుధ పోరాట వారసత్వమైన లౌకికత్వాన్ని రక్షించుకోవాల్సిన అవసరం మనందరిపైనా ఉందన్నారు. దేశంలో మతసామరస్యాన్ని చెడగొట్టి మతోన్మాదాన్ని పెంచి పోషించాలన్న బీజేపీ కుట్రలను అడ్డుకోవడానికి లౌకికవాద శక్తులు, రాజకీయ పార్టీలు భాగస్వామ్యం కావాలని కోరారు. నమ్మిన ఆశయం కోసం కొట్లాడిన వీరవనిత స్వరాజ్యమని, ఆమె ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలని అన్నారు. మహిళ ఉద్యమానికి స్వరాజ్యం దిక్సూచి అన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రముఖ రాజకీయ నాయకులు



పాదూరి కరుణ, సీపీఐ(ఎం) నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూలమాలలేసి నివాళి అర్పించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవనంలో నిర్వహించిన మల్లుస్వరాజ్యం వర్ధంతి కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి పాల్గొని నివాళి అర్పించారు. ఆమె ఆశయాలకు పునరంకితమవుదామని పిలుపునిచ్చారు. జీకే అన్నారంలో ఐద్వా ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.

భువనగిరి పట్టణంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో మతోన్మాదంపై పోరాటాలకు సిద్ధం కావాలని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ అన్నారు. ప్రభుత్వాల మహిళా వ్యతిరేక విధానాలపై వీరనారి మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో ఉద్యమించాలని ఐద్వా యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలో స్వరాజ్యం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆలేరు మండల కేంద్రంలో మల్లు స్వరాజ్యం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చౌటుప్పల్ మండల కేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక విజ్ఞాన కేంద్రంలో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలేసి నివాళి అర్పించారు.

హైదరాబాద్‌లో విస్తృత తనిఖీలు

- మూడ్రోజుల్లోనే భారీగా పట్టుబడిన నగదు, విలువైన వస్తువులు
- ఒక్కరోజే రూ.16,43,300 పట్టివేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రత్యేక నిఘా ఉంచాయి. ఇందులో భాగంగా పోలీస్, ఎస్.ఎస్.టి, ఎఫ్.ఎస్.టి టీమ్‌లు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. నగరంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 24 గంటలపాటు 9 టీంలు పనిచేస్తున్నాయి. ఈ క్రమంలో మూడ్రోజుల్లోనే రూ.35లక్షలకుపైగా స్వాధీనం చేసుకున్న ఈ బృందాలు, విలువైన వస్తువులను సీజ్ చేశాయి. మంగళవారం ఒక్కరోజే రూ.16,43,300తోపాటు రూ.10,250 విలువగల వస్తువులను సీజ్ చేశారు. హైదరాబాద్ జిల్లాలో ఎఫ్.ఎస్.టీ (ఫ్లయింగ్ స్క్వాడ్) బృందాలు రూ.9,30,000 సీజ్ చేయగా, పోలీసులు మరో రూ.7,13,300ను పట్టుకున్నారు. ఇప్పటి వరకు మొత్తం రూ.17,25,311 విలువగల వస్తువులను పట్టుకున్నారు. 54.67 లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకుని.. 8 మందిని ప్రోహిబిషన్ కేసుల్లో అరెస్టు చేశారు. మంగళవారం నగదు, ఇతర వస్తువులపై 5 ఫిర్యాదులు రాగా.. పరిశీలించి పరిష్కరించారు. ఇప్పటి వరకు వరకు 2 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయాలి
హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి

పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో పూర్తిచేస్తామని, ముఖ్యంగా నగదు తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించినట్టు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. నగదు పంపిణీని అరికట్టేందుకు విస్తృత తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎవరైనా ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయాలని కోరారు. ఉల్లంఘనపై 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా, లేదా సీ-విజిల్ యాప్ ద్వారా, టోల్ ఫ్రీ నెంబర్ 1800-599-2999కు ఫిర్యాదు చేయొచ్చన్నారు. 24 గంటలపాటు పని చేస్తాయని వివరించారు.

ఎన్నికల ప్రచారానికి ఇవీ షరతులు

(మొదటిపేజీ తరువాయి)

సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఒకే వరుసలో కాకుండా ప్రతి 10 వాహనాల తర్వాత కనీసం వంద మీటర్ల దూరం ఉండేలా ర్యాలీలు నిర్వహించాలి. అభ్యర్థుల కాన్వాయ్‌లో సెక్యూరిటీతో సహా పది వాహనాలకు మించి ఉండకూడదు. వాహనాలకు అమర్చే జెండాలు, జెండా కర్రల సైజును కూడా ఎన్నికల సంఘం నిర్ణయించింది. జెండా కర్రల ఎత్తు మూడు అడుగులకు మించి ఉండకూడదు. లౌడ్ స్పీకర్లను రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు ఉపయోగించకూడదు. వీటి అనుమతికి కచ్చింతంగా సంబంధింత అధికారులకు దరఖాస్తులు చేసుకోవాలి. జెండాల వినియోగంపైనా షరతులు విధించింది. ప్రచారం కోసం తాత్కాలిక క్యాంప్ కార్యాలయాలను నిబంధనలకు లోబడే ఏర్పాటు చేసుకోవాలని చెప్పింది. ఫోన్లలో సంక్షిప్త సందేశాలపైనా షరతులు విధించింది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు లోబడే ఇవి ఉండాలని పేర్కొంది. పోలింగ్ స్టేషన్ల వద్ద ఎలాంటి పార్టీ గుర్తులు, గోడరాతలు, నినాదాలు, బ్యాడ్జీలు ఉండరాదు. స్కూల్ గ్రౌండ్లను ఎన్నికల ప్రచారం కోసం వినియోగించుకుంటే నిబంధనల్ని కచ్చింతంగా పాటించాలి. రాజకీయపార్టీల స్టార్ క్యాంపెయినర్ల ప్రచారం కూడా నిబంధనలకు లోబడే ఉండాలి. వారి రూట్ మ్యాప్ ముందస్తుగా సంబంధిత అధికారులకు అందచేయాలి. ఎన్నికల నియమనిబంధనలు ఎవరు ఉల్లంఘించినా కేసులు నమోదుచేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ స్పష్టం చేశారు.

ద్వేషం, మత ఉన్మాదం లేని సమాజ నిర్మాణమే భగత్‌సింగ్ కోరిక

- విద్యార్థులు వీరుల చరిత్రలు తెలుసుకోవాలి
- ప్రజా గాయకుడు, కవి జయరాజు
- డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో యువ కవి, గాయకుల సమ్మేళనం

నవతెలంగాణ - ముషీరాబాద్

ద్వేషం లేని, మత ఉన్మాదం లేని సమాజ నిర్మాణమే భగత్ సింగ్ కోరిక అని, భగత్ సింగ్‌ను చదివితే శాశ్వతంగా జీవించే వ్యక్తులుగా ప్రతి ఒక్కరూ మారగలుగుతారని ప్రజా గాయకుడు, కవి జయరాజు అన్నారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో షహీద్ భగత్‌సింగ్ స్మారక యువజన ఉత్సవాల సందర్భంగా మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యువ కవి, గాయకుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠ్య పుస్తకాలే కాక వీరుల చరిత్రలు చదవాలని, అన్నింటినీ తెలుసుకోవాలని సూచించారు. గతాన్ని, వర్తమానాన్ని, అందులోనూ ప్రముఖుల త్యాగాలను తెలుసుకోవాలన్నారు. మార్క్స్, భగత్ సింగ్, అంబేద్కర్, పూలే, బుద్ధుడు, పెరియార్ ఇలా ప్రతి ఒక్కరి జీవితం మనకు ఒక పాఠమే అన్నారు. మనం కూడా మతం, కులం, మత్తులను విడనాడి జ్ఞానంతో బతికితే మనమూ వందేండ్లు బతకొచ్చు అన్నారు. జైళ్లు, పోలీస్‌లు, లాఠీలు, తూటాలు ఇవన్నీ మనిషిని ఏమీ చేయలేవన్నారు.సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లడుతూ.. భగత్ సింగ్ సినిమా తెలుగులో రావాలని కోరారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక నినాదం తీసుకొని ఈ ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షులు విజయకుమార్ మాట్లాడుతూ.. మతోన్మాదులు చరిత్రను మార్చే పని చేస్తున్నారని.. మనం నిజాన్ని తెలియజేయాలని అన్నారు.

భగత్ సింగ్ ఆశయ వారసులు ఎర్రజెండా బిడ్డలే అని చెప్పారు. ఐలమ్మ, దొడ్డి కొమురయ్య పోరాటం గురించి యువత తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితీ నాయకులు మోహన్ కృష్ణ, ప్రజానాట్యమండలి నాయకులు రాజు, గాయకులు సైదులు, పద్మ, సిరి, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, అశోక్ రెడ్డి, డీవైఎఫ్ఐ అధ్యక్షులు హస్మి బాబు, జావేద్ నాయకులు అస్మిత, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



దానిమ్మతో ఆరోగ్యం పదిలం

దానిమ్మలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. దానిమ్మని గింజల రూపంలో లేదా జ్యూస్ రూపంలో తీసుకున్నా ఒకే ఫలితం ఉంటుంది. ద్రానిమ్మలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వీటిలో ప్యూనికల్గిన్, ఆంథోసైనిన్లు శక్తివంతమైనవి. ఇవి ఫ్రీ రాడికల్స్, అస్థిర అణువులకు వ్యతిరేకంగా పోరాడతాయి.


సెల్ డ్యామేజ్‌ని నివారిస్తాయి. క్రమం తప్పకుండా తీసుకోవటం వల్ల ఆక్సీకరణ ఒత్తిడితో పోరాడి, ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దానిమ్మ రసం తాగడం వల్ల గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందులోని అధిక యాంటీఆక్సిడెంట్ కంటెంట్ రక్తపోటును తగ్గిస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. మొత్తం గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. రక్తం సాఫీగా ప్రవహిస్తుంది. గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

కీళ్లనొప్పులు, మధుమేహం, క్యాన్సర్‌తో సహా అనేక రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడేవారికి శరీరం లోపల అవయవాల్లో మంటగా ఉంటుంది. దానిమ్మ రసంలో శక్తివంతమైన యాంటీ ఇన్ఫ్లమేటరీ సమ్మేళనాలు ఈ మంటను తగ్గించడంలో సహాయపడతాయి.

అధిక స్థాయిలో యాంటీ ఆక్సిడెంట్లు ఉండడం వల్ల క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించే లక్షణాలు ఉన్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయినా రోజువారీ ఆహారంలో దానిమ్మను తీసుకోవటం వల్ల కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

దానిమ్మ రసంలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థకు ఇది చాలా అవసరం. ఇందులో ఉండే యాంటీ బాక్టీరియల్ లక్షణాలు జీర్ణవ్యవస్థలో హానికరమైన బ్యాక్టీరియాతో పోరాడటానికి సహాయపడతాయి.

రాజ్మాతో ఎన్ని ఉపయోగాలో..



రాజ్మా అని పిలవబడే వీటికి ఉన్న మరోపేరు కిడ్నీబీన్స్. ఫైబర్, కాల్షియం, సోడియం వంటి అనేక పోషకాలతో నిండి వున్నాయి. కిడ్నీ బీన్స్ బరువు తగ్గడంలో సహాయపడతాయి. వీటిని తరచుగా తీసుకోవడంవల్ల క్యాన్సర్, లివర్ వ్యాధుల ప్రమాదం నుంచి మిమ్మల్ని మీరు రక్షించుకోవచ్చు. ఇవి జీర్ణక్రియలను మెరుగుపరిచి, ఎముకలు, దంతాల బలానికి, చర్మ ఆరోగ్యం, జుట్టు నాణ్యత కోసం ఎంతో ఉపయోగ పడతాయి. ఫోలిక్ యాసిడ్ నిక్షేపాలు అధికంగా ఉన్న కారణంగా గర్భిణీ స్త్రీలకు కిడ్నీ బీన్స్ అత్యంత ఉత్తమమైన పోషకాహారమని నిపుణులు చెబుతున్నారు. అలాగే, ఇవి హైపర్ టెన్షన్ ను నివారించడంలోనూ, జ్ఞాపక శక్తికి, డీటాక్సిఫికేషన్‌కూ ఎంతో సహాయపడతాయి.



ఎప్పుడూ కూడా మీ సంపాదన ప్రకారం మీ ఖర్చులను ప్లాన్ చేసుకుంటూ ఉండాలి. ఫైనాన్షియల్‌గా స్ట్రాంగ్‌గా ఉండాలంటే ఎన్నో రకాల జాగ్రత్తలు తీసుకోవాలి. బడ్జెట్ విషయంలో ఎప్పుడైతే నిర్ణయాలు కరెక్ట్‌గా తీసుకుంటారో అప్పుడే ఎటువంటి ప్రాబ్లమ్స్ లేకుండా జీవితంలో ఉండగలుగుతారు. ఎక్కువ శాతం మందికి సరైన ప్లానింగ్ లేకపోవడం వలన నెలాఖరికి శాలరీ మొత్తం ఖర్చు అయిపోతోంది. దాంతో తిరిగి అప్పు చేయాల్సి వస్తుంటుంది. మరి ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటే మీ ఫైనాన్షియల్ స్టేటస్ బాగుంటుందో తెలుసుకుందాం...

సంపదను బట్టి ఖర్చులు

ఈ మధ్యకాలంలో ఇన్ఫ్లేషన్ వంటి కారణాల వల్ల ఖర్చులు పెరిగిపోతున్నాయి. దాంతో సేవింగ్స్ అనే కాన్సెప్ట్‌నే అందరూ మర్చిపోతున్నారు. కానీ సేవింగ్స్ చేయకపోతే భవిష్యత్తులో ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అనుకోకుండా ఏదైనా సమస్య వస్తే దాన్ని సాల్వ్ చేయడానికి సేవింగ్స్ అనేవి అవసరమని గుర్తుంచుకోండి. మీ రిటైర్మెంట్ అయ్యే సరికి కొంత సేవింగ్స్ ఉండడం ఎంతో అవసరం. కాబట్టి మీ సంపాదనలో కొంత భాగాన్ని సేవింగ్స్‌కు చేర్చండి.

స్టేటస్ కోసం వద్దు

మీరు ఎప్పుడూ కూడా ఫ్యాన్సీ, పోష్‌గా లైఫ్ స్టైల్‌ని మెయింటెన్ చేయాలని అనుకుంటే మీకు డబ్బులు ఖర్చవుతూనే ఉంటాయి. పైగా దానికి ఎలాంటి అదుపు ఉండదు. ముఖ్యంగా చాలా మంది బ్రాండెడ్ ఐటమ్స్ కోసం చాలా ఖర్చు పెడతారు. వాటివల్ల కేవలం స్టేటస్ పెరుగుతుంది. కానీ ఫైనాన్షియల్ సమస్యలు ఎన్నో తలెత్తుతాయి అని గుర్తుంచుకోండి. కనుక లైఫ్ స్టైల్ కోసం ఖర్చు పెట్టడం మొదలు పెడితే దానికి ఎటువంటి ముగింపు ఉండదని ఫైనాన్షియల్ అడ్వైజర్స్ చెబుతున్నారు.

ఇన్వెస్ట్‌మెంట్

దీనికి ఎలాంటి రూల్స్ ఉండవు. ఎవరైనా, ఎప్పుడైనా ఇన్వెస్ట్ చేయవచ్చు. మీరు కేవలం కొద్ది అమౌంట్‌తో అయినా మొదలు పెట్టి చాలా తెలివిగా ఇన్వెస్ట్ చేయండి. అయితే ఇన్వెస్ట్‌మెంట్ నుండి పొందిన లాభాలను ఎప్పటికప్పుడు అబ్జర్వ్ చేస్తూ ఉండండి. అప్పుడు రోజు రోజుకు దానిపై ఆసక్తి పెరుగుతూ వస్తుంది. దీనివల్ల మీకు ఎలాంటి నష్టం ఉండదు. రిస్క్ తీసుకుని అయినా ఇన్వెస్ట్ చేయొచ్చొని అనుకుంటే స్టాక్ మార్కెట్ వంటివి కూడా మంచి ఎంపిక అనే చెప్పాలి. అయితే పూర్తి నాలెడ్జ్‌తో ఇన్వెస్ట్‌మెంట్ గురించి అన్ని విషయాలను తెలుసుకొని మాత్రమే ఇన్వెస్ట్‌మెంట్ చేయండి.

ఎమర్జెన్సీ ఫండ్

ఎమర్జెన్సీ ఫండ్ అనేది ఎంతో మంచి ఆలోచన అనే చెప్పాలి. సుమారు ఆరు నెలలు పాటుగా ఖర్చులు తగ్గించుకుని ఆ అమౌంట్‌ను సేవ్ చేసుకుని దాన్ని ఎమర్జెన్సీ ఫండ్ ఎకౌంట్‌కు చేర్చుకోవాలి. ఈ విధంగా ఖర్చు పెట్టకుండా బాగా కంట్రోల్‌లో ఉండి మిగిలిన అమౌంట్ మొత్తం ఎమర్జెన్సీ ఫండ్‌లో ఉంచుకోవడం వల్ల ఎప్పుడైనా ఏదైనా అవసరం అయినప్పుడు ఆ అమౌంట్‌ను ఉపయోగించవచ్చు. ఈ మధ్యకాలంలో చాలా మంది దీన్ని పాటించడానికి ఇష్టపడుతున్నారు. ఎందుకంటే సేవింగ్స్‌లేని సమయంలో ఈ ఎమర్జెన్సీ ఫండ్ అనేది ఎంతగానో ఉపయోగపడుతుంది.

క్రెడిట్ కార్డ్స్



ఈ మధ్య కాలంలో చాలా మంది క్రెడిట్ కార్డ్స్ ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. అయితే క్రెడిట్ కార్డ్స్ ఉపయోగించడంతో పాటుగా బిల్ కట్టడం కూడా ఎంతో అవసరం. కాకపోతే కొంతమందికి సమయం లేకపోవడం వల్ల, ఇతర కారణాల వలన ఆ క్రెడిట్ కార్డ్ బిల్స్ అనేవి సరైన సమయంలో క్లియర్ చేయకపోవడం వల్ల అవి ఎక్కువైపోతూ ఉంటాయి. కాబట్టి వీలైనంత త్వరగా తక్కువ అమౌంట్ ఉన్నప్పుడే క్లియర్ చేసేయాలి. ఎందుకంటే చివరికి ఎక్కువ అమౌంట్ అయిపోవడంతో క్రెడిట్ కార్డు బిల్ పేమెంట్ చేయడానికి ఇబ్బంది అవుతుంది. కనుక క్రమంగా క్రెడిట్ కార్డు బిల్స్ క్లియర్ చేసుకుంటూ ఉండడం ఎంతో అవసరమని గుర్తుంచుకోండి. ఒకవేళ మీరు క్రెడిట్ స్కోర్‌ని బాగా మెయింటైన్ చేయాలని అనుకుంటే మల్టిపుల్ క్రెడిట్ కార్డ్స్ మీకు ఎంతో అవసరం. ఇలా ఉపయోగించడం వల్ల మంచి అడ్వాంటేజ్ ఉంటుంది. అలా కాకుండా మీరు ఒకే క్రెడిట్ కార్డు ఉపయోగిస్తూ ఉంటే మీ క్రెడిట్ స్కోర్ దెబ్బతినే అవకాశాలు ఉంటాయి. కాబట్టి మల్టిపుల్ క్రెడిట్ కార్డ్స్ ఉపయోగించి మీ క్రెడిట్ స్కోర్ పెంచుకోండి.

ఇన్సూరెన్స్

ప్రతి ఒక్కరి జీవితంలో ఇన్సూరెన్స్ అనేది చాలా అవసరం. ఎప్పుడూ కూడా హెల్త్ ఇన్సూరెన్స్‌కు కొంత అమౌంట్ ఖర్చు పెట్టండి. ఇలా చేయడం వలన ఎమర్జెన్సీ సమయంలో వైద్య అవసరాల కోసం ఎక్కువ అమౌంట్ ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉండదు.

బడ్జెటింగ్

మీరు ఖర్చు చేసే అమౌంట్‌ను ఎప్పటికప్పుడు ట్రాక్ చేసుకోండి. అలా చేయడం వల్ల అవసరం లేకపోయినా దేనిపై ఎక్కువ ఖర్చు పెడుతున్నారో తెలుస్తుంది. దానితో మీ ఆర్థిక పరిస్థితులను పోల్చుకొని క్రమంగా అలవాట్లను మార్చుకుంటూ ఉండాలి. కాబట్టి ఇలాంటి బడ్జెటింగ్ అనేది ప్రతి ఒక్కరూ పాటించాలని నిపుణులు చెబుతున్నారు. ఎప్పుడైతే మనం చేసేటువంటి ఖర్చులపై అవగాహన ఉంటుందో అప్పుడే మన ఖర్చులు తగ్గే అవకాశాలు ఉంటాయి. పైగా బడ్జెట్ కూడా మేనేజ్ చేసుకోగలుగుతారు. కొంత మంది ఖర్చులు పెట్టడానికి ఎంతగానో ఆలోచిస్తారు. అయితే ఖర్చు పెట్టేటప్పుడు పిసినారిగా ఆలోచించడం వలన జీవితంలో ఎన్నో ఆనందాలను మిస్ అవ్వాల్సి ఉంటుంది. అలా అని కొందరు మాత్రం అతిగా ఖర్చు పెడతారు. ఇవి రెండూ సరైన పద్ధతులు కావని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. బడ్జెట్‌కు మించి అతిగా ఖర్చు పెడితే తర్వాత మీరే బాధపడాల్సి ఉంటుంది. కాబట్టి ఖర్చు చేసే ముందు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకొని అప్పుడే ఖర్చు చేయండి.



కోర్టుకు హాజరుకండి

(మొదటిపేజీ తరువాయి)

పట్టించేలా ప్రకటనలు ఇస్తున్నారంటూ వీరిద్దరిపై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైన విషయం తెలిసిందే.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ మోసపూరిత ప్రకటనలు ఇస్తున్నారంటూ పతంజలిపై గతంలో ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై సుప్రీంకోర్టులో జరిగిన వాదనల సందర్భంగా ఇకపై అలాంటి ప్రకటనలు ఇవ్వబోమని ఆ సంస్థ హామీ ఇచ్చింది. అయితే దానిని విస్మరించి, మీడియాలో ప్రకటనలు కొనసాగిస్తూనే ఉన్నారని న్యాయస్థానం తాజాగా అభిప్రాయపడింది. 1954వ సంవత్సరపు డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ (అభ్యంతరకర ప్రకటనలు) చట్టంలోని సెక్షన్ 3, 4ను రాందేవ్, బాలకృష్ణ ఉల్లంఘించారనడానికి ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని న్యాయమూర్తులు హిమా కోహ్లీ, అహ్సనుద్దీన్ అమానుల్లా తెలిపారు. వ్యక్తిగతంగా కోర్టుకు హాజరై సమాధానమివ్వాలని వారిద్దరినీ జస్టిస్ కోహ్లీ ఆదేశించారు.

రాందేవ్, బాలకృష్ణలకు ఫిబ్రవరి 26న సుప్రీంకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసు జారీ చేసింది. ఆరోగ్య సంరక్షణకు సంబంధించి ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు ఇస్తున్నారని అందులో తెలిపింది. గుండె జబ్బులు, ఆస్తమా వంటి వ్యాధులను నయం చేస్తామంటూ ఆధారాలు లేని వాదనలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ వ్యాధులకు సంబంధించిన ఔషధాల గురించి ప్రచారం చేయకుండా నిషేధం విధించింది. ఆ వ్యాపార ప్రకటనలను తొలగించడానికి తీసుకున్న చర్యలేమిటో తెలియజేస్తూ అఫిడవిట్ సమర్పించాలని కేంద్రాన్ని ఆదేశించింది.

గత సంవత్సరం నవంబర్‌లో కూడా పతంజలి ఆయుర్వేదపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆధునిక వైద్యానికి వ్యతిరేకంగా తప్పుదోవ పట్టించే వాదనలను ప్రచారం చేస్తున్నారని మండిపడింది. ఇలాంటి ప్రచార కార్యకలాపాలను కొనసాగిస్తే కోటి రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించింది.

లెక్కలెక్కే..

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా సుప్రీంకోర్టు ఈ ఉత్తర్వులు జారీచేసింది.

పునరావలోకన చర్యలు భారతీయ, ప్రపంచ పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీయడానికి దారితీస్తాయని ఫిక్కీ, అసోచామ్, సీఐఐల పిటిషన్‌లో పేర్కొన్నాయి. బాండ్ల నెంబర్ల బహిర్గతాన్ని వాయిదా వేయాలని సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్గీ చీఫ్ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని కోరారు. ఎలక్టోరల్ బాండ్ స్కీమ్‌లో దాతల పేర్లు చెప్పమని హామీ ఇచ్చినపుడు ఆ సమాచారాన్ని ఇప్పుడు ఎలా వెల్లడిస్తారని ప్రశ్నించారు.

అయితే ఆ దరఖాస్తులేవీ జాబితా చేయలేదని కోర్టు పేర్కొంది. ఏప్రిల్ 12, 2019 నుంచి అమలులోకి వచ్చినప్పటి వివరాల సేకరణకు ఆదేశించామని చీఫ్ జస్టిస్ పేర్కొన్నారు. అప్పట్లో ప్రతి ఒక్కరి వివరాలను నమోదు చేశారని, అందుకే మధ్యంతర ఉత్తర్వులకు ముందు విక్రయించిన బాండ్లను బహిర్గతం చేయమని తాము ఆదేశించలేదని కోర్టు పేర్కొంది. రాజ్యాంగ ధర్మాసనం జాగరూకతతోనే ఆదేశించిందని పేర్కొంది.

తీర్పు వెలువడిన తర్వాత పారిశ్రామికవేత్తలు కోర్టును ఆశ్రయిస్తున్నారని, ఈ విషయంలో తాము ఏమీ చేయలేమని వెల్లడించింది. "మేం మీకు మినహాయింపు ఇవ్వలేం" అని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ విచారణ సందర్భంగా మౌఖికంగా వ్యాఖ్యానించారు.

"ఒక నిర్దిష్ట పరిస్థితిలో ఒక వ్యక్తికి ఆమోదయోగ్యమైనది అదే పరిస్థితిలో ఉన్న మరో వ్యక్తికి కూడా ఆమోదయోగ్యమైనదిగా ఉండాలి" అనే వ్యాఖ్యను జోడించారు. ఎన్నికల బాండ్ల ఆల్ఫా న్యూమరిక్ నెంబర్లను ఎస్‌బీఐ ఎన్నికల కమిషన్‌కు అందించకపోవడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

స్వాగతించిన సీపీఐ(ఎం)

కార్పొరేట్ల – మతపరమైన సంబంధాలు ఉన్నప్పటికీ.. బాండ్లపై ఉండే యూనిక్ నెంబర్లతో సహా అన్ని వివరాలను అందించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్వాగతించారు.

ఆమె హక్కుల గొంతుక

(మొదటిపేజీ తరువాయి)

దానితో స్వయ రక్షణకు పాటు పడ్డారని నమ్మటమంటే ఆడపిల్లల భద్రత గురించి ఎంతగా పరితపించారో అర్థమవుతుందన్నారు.

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ భూస్వామ్య వ్యవస్థను అంతమొందించాలనీ, వెట్టి చాకిరి, దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో మల్లు స్వరాజ్యం ముఖ్య భూమిక పోషించిందని గుర్తు చేశారు. పురుషులతో పాటు స్త్రీలకు సమాన హక్కులు కావాలని పోరాటం చేసిందని చెప్పారు. సమసమాజ నిర్మాణం కోసం ఆమె పోరాడిన తీరు, తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. అసహన రాజకీయాలు, అప్రజాస్వామిక నిర్ణయాలు, హక్కులపై దాడులు జరుగుతున్న నేటి తరుణంలో పోరాట యోధులను యాది చేసుకోవటం అవసరమన్నారు. మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, లైంగిక వేధింపులు విచ్చలవిడిగా జరుగుతున్న పరిస్థితుల్లో మహిళలకు, బాలికలకు ఆత్మరక్షణ శిబిరాలు నిర్వహించడానికి ఆమె ఎప్పుడూ కృషి చేసేవారని గుర్తు చేశారు. స్వయం రక్షణకోసం కరాటే లాంటి శిక్షణలు ఇవ్వటం అవసరమని నిరంతర పరితపించారని తెలిపారు. కుల, మత, పురుషాధిపత్యానికి వ్యతిరేకంగా చివరికంటూ పోరాడారని చెప్పారు. కుటుంబాలను సర్వనాశనం చేస్తున్న 'సారా'కు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలోనూ ఆమె పాత్ర మరువలేనిదన్నారు. తుపాకీ తూటాలాంటి తన మాటలతో ప్రజలను ఉద్యమాల వైపు నడిపించారన్నారు. ముక్కుసూటిగా మర్మం లేని మాటలతో తప్పులపై విమర్శనాస్త్రాలను సంధించేవారని గుర్తు చేశారు. ఐద్వా ఉపాధ్యక్షులు ఇందిరా, కెఎస్ ఆశాలత, ట్రస్ట్ చైర్‌పర్సన్ బుగ్గవీటి సరళ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలకు ఆమె మాటలే కొండంత ధైర్యాన్ని ఇచ్చేవన్నారు. ఎక్కడ ప్రజా ఉద్యమాలు ఉంటే అక్కడ ఉండేదని గుర్తు చేశారు. పేద ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. మహిళా సాధికారత కావాలనీ, రైతు రాజ్యం రావాలని ఆసుపత్రిలో చివరి క్షణాల్లో ఉన్నప్పుడు సైతం పిడికిలి బిగించి నినదించారని గుర్తు చేశారు. అనంతరం వీరనారి ఐలమ్మ ట్రస్టు నిర్వహిస్తున్న కరాటే శిక్షణ పాఠశాలలో ప్రతిభను ప్రదర్శించిన పది మంది విద్యార్థులకు గ్రీన్ బెల్టు, ఎల్లో బెల్టులను శాంత సిన్హా, ట్రస్ట్ చైర్‌పర్సన్ బుగ్గ వీటి సరళ అందజేశారు.

కరాటే మాస్టారు సుబ్రహ్మణ్యంతో పాటు విద్యార్థులను వారు సన్మానించారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి పి శశికళ, రాష్ట్ర నాయకులు ఎ పద్మ, ఎండి షబానా బేగం, విజయమ్మ, మస్తాన్ బీ, ఎం స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు. వాసవి కంటి ఆస్పత్రి, కోరంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, నర్సులు ల్యాబ్ టెక్నీషియన్లు డాక్టర్ దీప్తి టీం ఆ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించారు.

గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. చనిపోయిన నలుగురు మావోయిస్టులపై రూ.36 లక్షల రివార్డు ఉన్నట్టు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ) అమలులో ఉన్న నేపథ్యంలో విధ్వంసకర కార్యకలాపాలకు పాల్పడే లక్ష్యంతో కొందరు మావోయిస్టులు ప్రాణహిత నదిని దాటి పొరుగున ఉన్న తెలంగాణ నుంచి గడ్చిరోలిలోకి ప్రవేశించినట్టు సోమవారం మధ్యాహ్నం పోలీసులకు సమాచారమందిందని పోలీసు సూపరింటెండెంట్ నీలోత్పాల్ తెలిపారు.

గడ్చిరోలి పోలీసుల ప్రత్యేక పోరాట విభాగమైన సి-60కి చెందిన బహుళ బృందాలు, సీఆర్పీఎఫ్ క్విక్ యాక్షన్ టీమ్‌ను ఆ ప్రాంతంలో వెతకటానికి పంపారు. రేపన్‌పల్లి సమీపంలోని కోలమర్క కొండల్లో మంగళవారం ఉదయం సి-60 యూనిట్‌లో ఒకరు సోదాలు నిర్వహిస్తుండగా పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి.

కాల్పులు ఆగిపోయిన తర్వాత ఆ ప్రాంతంలో నలుగురు మగ మావోయిస్టుల మృతదేహాలు కనిపించాయని ఒక అధికారి తెలిపారు. మృతి చెందిన మావోయిస్టులు వర్గీష్, మగ్తు, కుర్సంగ్ రాజు, కుడిమెట్ట వెంకటేష్‌లుగా గుర్తించినట్టు పోలీసులు చెప్పారు.

లోక్‌సభ ఎన్నికలకు పాంచ్ న్యాయ్

(మొదటిపేజీ తరువాయి)

ఈ భేటీలో మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు కీలక నేతలు హాజరయ్యారు. తెలంగాణ, కర్నాటక, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రులు ఎ.రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్వీందర్ సింగ్ సుఖ్, నేతలు కేసీ వేణుగోపాల్, మీరా కుమారి, అంబికా సోనీ, ప్రియాంక గాంధీ, పి. చిదంబరం, దిగ్విజయ్ సింగ్, వీరప్ప మొయిలీ, అజయ్ మాకెన్, కుమారి సెల్జా, హరీష్‌రావత్, సుబ్బిరామి రెడ్డి, మనీష్ తివారీ, సచిన్ పైలట్, పవన్ కుమార్ బన్సాలీ, రాజీవ్ శుక్లా, జైరాం రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ దేశం మార్పును కోరుకుంటోందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించిన 'హామీలు' 2004 నాటి 'ఇండియా షైనింగ్' నినాదంతో సమానమని ఎద్దేవా చేశారు. పార్టీ మ్యానిఫెస్టోలో లేవనెత్తిన ప్రతి అంశాన్ని దేశవ్యాప్తంగా ప్రతి గ్రామం, పట్టణం, ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలందరినీ సూచించారు. "మ్యానిఫెస్టోకు వివిధ రాష్ట్రాల్లో విస్తృత ప్రచారం లభించేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత ఉంది" అని ఆయన అన్నారు. "2004 లోక్‌సభ ఎన్నికల సమయంలో అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం 'ఇండియా షైనింగ్' నినాదాన్ని ఇచ్చింది. ఆ ఎన్నికల్లో పార్టీ ఓడిపోయింది. ప్రతి ఇంటికి పార్టీ మ్యానిఫెస్టోను తీసుకెళ్లేందుకు గ్రామాలు, పట్టణాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు విస్తృతంగా పనిచేయాలి" అని ఖర్గే అన్నారు. మ్యానిఫెస్టోలో ఏ హామీ ఇచ్చామో వాటిని కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. మ్యానిఫెస్టోలో వాగ్దానాలు చేసే ముందు, ఈ వాగ్దానాలు అమలుకు నోచుకునేలా లోతుగా చర్చించినట్లు తెలిపారు. "1926 నుండి కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో 'విశ్వాసం, నిబద్ధతకు



సంబంధించిన పత్రం'గా పరిగణించబడుతుంది" అని ఆయన అన్నారు.

రాహుల్ గాంధీ నేతృత్వంలోని భారత్ జోడో న్యాయ్ యాత్రను ఖర్గే కొనియాడారు. దీనిద్వారా కాంగ్రెస్ ప్రజల నిజమైన సమస్యపై దేశం దృష్టిని ఆకర్షించగలిగిందని అన్నారు. "ఇవి కేవలం రాజకీయ యాత్రలు మాత్రమే కాదు. మన రాజకీయ చరిత్రలో అతిపెద్ద సామూహిక సంప్రదింపు ఉద్యమంగా గుర్తించబడతాయి. మన కాలంలో ఎవరూ ఇంత భారీ కసరత్తు చేపట్టలేదనే వాస్తవాన్ని ఎవరూ అణగదొక్కలేరు. ఈ రెండు యాత్రలు ప్రజల సమస్యను జాతీయ స్థాయికి తీసుకెళ్లగలిగాయి" అని ఆయన భారత్ జోడో యాత్ర, న్యాయ్ యాత్ర గురించి ప్రస్తావించారు.

సీడబ్ల్యూసీ భేటీ అనంతరం విలేకరుల సమావేశంలో ఆ పార్టీ నేతలు కేసీ. వేణుగోపాల్, జైరాం రమేష్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పార్టీ మ్యానిఫెస్టోకు తుది ఆమోదం తెలిపేందుకు, విడుదల తేదీని నిర్ణయించేందుకు ఖర్గేకు సీడబ్ల్యూసీ అధికారమిచ్చిందని అన్నారు. "పార్టీ హామీలను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లేందుకు సీడబ్ల్యూసీ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసింది. ప్రజలు ఉజ్వల భవిష్యత్తును చూసేందుకు కాంగ్రెస్ కేవలం 'ఘోషణ పత్ర' (మ్యానిఫెస్టో) మాత్రమే కాకుండా 'న్యాయ్ పత్ర' విడుదల చేస్తుంది" అని అన్నారు.

ఇప్పటికే రైతులు, మహిళలు, యువత, బలహీన వర్గాలే లక్ష్యంగా 'హిస్సేదారి న్యాయ్', 'కిసాన్ న్యాయ్', 'నారీ న్యాయ్', 'శ్రామిక్ న్యాయ్', 'యువ న్యాయ్' పేరిట హామీలను ప్రకటించారు. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం, రైతులకు వడ్డీలేని రుణాలు, ప్రస్తుతం కేంద్రం అందిస్తున్న సాయం పెంపు, యువత కోసం 30 లక్షల ఉద్యోగాల భర్తీ, ప్రభుత్వ లేక ప్రయివేట్ రంగంలో 25 ఏండ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న ప్రతి డిప్లొమా లేక డిగ్రీ హోల్డర్లకు అప్రెంటిస్ షిప్ శిక్షణకు రూ.లక్ష సాయం, 30 ఏండ్లలోపు యువత స్టార్టప్‌లకు నిధులు సమకూర్చడానికి రూ.5,000 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు, పేపర్ లీకేజీల నివారణకు ప్రత్యేక చట్టం, మహిళల కోసం నిరుపేద కుటుంబంలోని ఒక మహిళకు ఏడాదికి రూ. లక్ష సాయం వంటి 25 గ్యారంటీలపై చర్చించి తుది నిర్ణయం తీసుకున్నారు.

మ్యానిఫెస్టోలోని 25 గ్యారంటీలు

హిస్సేదారి న్యాయ్ :
- సామాజిక, ఆర్థిక కుల గణన
- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్ల కల్పనపై 50శాతం సీలింగ్ తొలగింపు
- ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కోసం ప్రత్యేక బడ్జెట్
- జల్ జంగల్ జమీన్ పై చట్టబద్ధ హక్కులు
- గిరిజనులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను షెడ్యూల్డ్ ఏరియాలో గుర్తింపు

కిసాన్ న్యాయ్ :
- స్వామినాథన్ ఫార్ములా ప్రకారం పంటలకు గిట్టుబాటు ధర చట్టబద్ధత
- రుణమాఫీ కమిషన్ ఏర్పాటు
- పంట నష్టపోయిన 30 రోజుల్లో బీమా పరిహారం చెల్లింపు గ్యారెంటీ
- రైతులు లబ్ధి పొందేలా ఎగుమతి, దిగుమతి విధానం
- వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ మినహాయింపు

శ్రామిక్ న్యాయ్ :
- వైద్య హక్కు చట్టం
- రోజుకు రూ.400 కనీస వేతనం. ఉపాధి హామీ చట్టంలో సైతం
- పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ అమలు
- అసంఘటిత రంగ కార్మికులకు జీవిత బీమా, ప్రమాద బీమా
- ప్రభుత్వంలో కాంట్రాక్టు ఉద్యోగాల నియామకాలు నిలుపుదల

యువ న్యాయ్:
- కేంద్ర ప్రభుత్వంలో 30 లక్షల ఉద్యోగాల భర్తీ
- యువతకు ఏడాది అప్రెంటిస్ షిప్ – ఏడాదికి రూ. లక్ష, నెలకు రూ. 8500 చెల్లింపు
- పేపర్ లీక్ అరికట్టేందుకు కఠిన చట్టం
- గిగ్ వర్కర్ల సామాజిక భద్రతకు చర్యలు
- యువత స్టార్టప్ కోసం ఐదు వేల కోట్ల నిధి కేటాయింపు

నారీ న్యాయ్ :
- ప్రతి పేద కుటుంబంలోని ఒక మహిళకు ఏడాదికి రూ. లక్ష
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు
- ఆశా, అంగన్వాడీ, మిడ్ డే మీల్ వర్కర్స్ డబుల్ శాలరీ కాంట్రిబ్యూషన్
- మహిళల హక్కుల రక్షణ కోసం అధికారి మైత్రి ఏర్పాటు
- వర్కింగ్ ఉమెన్ కోసం సావిత్రిబాయి పూలే పేరుతో రెట్టింపు హాస్టల్స్.

బీహార్‌లో ఎన్డీయేకు ఎదురుదెబ్బ

బీజేపీకి షాకిచ్చిన ఆర్‌ఎల్జేపీ అధ్యక్షుడు



- కేంద్ర మంత్రి పదవికి పశుపతి కుమార్ పరాస్ రాజీనామా
- లోక్‌సభ సీట్ల పంపకం విషయంలో కాషాయ పార్టీ అన్యాయం చేసిందని ఆరోపణ

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ (ఆర్ఎల్జేపీ) అధ్యక్షుడు పశుపతి కుమార్ పరాస్ తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారు. బీహార్‌లో లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా సీట్ల పంపకం విషయంలో తమ పార్టీని పట్టించుకోకుండా బీజేపీ అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు. పశుపతి కుమార్ వర్గం చేసిన వాదనలను పట్టించుకోకుండా బీహార్‌లో లోక్‌సభ సీట్ల పంపకంలో చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్జేపీ(రామ్ విలాస్)కి ఐదు సీట్లను కేటాయించిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే.. దీనిపై ప్రకటన ఇప్పటికే కూడా చేసింది. అయితే, ఈ అంశంపై తీవ్ర అసంతృప్తిగా ఉన్న పశుపతి కుమార్.. ఆ తర్వాతి విలేకరుల సమావేశంలో రోజే కేంద్ర మంత్రి పదవి రాజీనామా ప్రకటనను చేయటం గమనార్హం. అయితే, తన భవిష్యత్ ప్రణాళిక గురించి మాత్రం ఆయన వివరించలేదు. సీట్ల పంపకం విషయంలో తమ పట్ల వ్యవహరించిన విధానంపై తన అసంతృప్తి గళాన్ని వినిపించటానికి ముందు ప్రధానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. తాను ఎన్డీయేకు నిజాయితీగా, విధేయుడిగా సేవలందించాననీ.. అయితే తన పార్టీకి, ప్రత్యేకించి తనకు మాత్రం అన్యాయమే దక్కిందని చెప్పారు.

తదుపరి కార్యాచరణను నిర్ణయించటానికి తమ పార్టీ నాయకులం సమావేశమవుతామని ఆర్ఎల్జేపీ అధికార ప్రతినిధి శ్రవణ్ అగర్వాల్ తెలిపారు. పశుపతి కుమార్ మాత్రం ఎన్నికల్లో పోటీ చేస్తారని మాత్రం స్పష్టం చేశారు.

బాబాయ్, అబ్బాయిల మధ్య బీజేపీ చిచ్చు

లోక్‌జనశక్తి పార్టీ (ఎల్జేపీ)ని వాస్తవానికి కేంద్ర మాజీ మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ 2000 ఏడాదిలో స్థాపించారు. 2020లో రామ్ విలాస్ పాశ్వాన్ మరణం తర్వాత పార్టీలో అంతర్గత విభేదాలు తలెత్తాయి. పార్టీని హస్తగతం చేసుకునే విషయంలో రామ్ విలాస్ పాశ్వాన్ తమ్ముడు పశుపతి కుమార్ పరాస్, కుమారుడు చిరాగ్ పాశ్వాన్‌ల మధ్య పోటీ నెలకొన్నది. అనంతరం భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఎల్జేపీ పేరును, చిహ్నాన్ని ఎవరికీ కేటాయించకుండా వాటిని నిలిపివేసింది. తర్వాత పశుపతి కుమార్ పరాస్ ఆర్ఎల్జేపీకి, చిరాగ్ పాశ్వాన్ ఎల్జేపీ(రామ్ విలాస్)కి నేతృత్వం వహించారు.


అయితే, అప్పటికే ఎల్జేపీకి ఉన్న ఎంపీలు పశుపతి కుమార్ పరాస్‌కు మద్దతిచ్చారు. ఇటు బీజేపీ కూడా ఆ సమయంలో పశుపతి కుమార్‌కు బాసటగా నిలిచి, కేంద్ర మంత్రి పదవిని కట్టబెట్టింది. 2021 నుంచి ఆయన కేంద్ర మంత్రిగా ఉంటున్నారు. అయితే, ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో బీజేపీ ప్లేటు ఫిరాయించింది. ఇప్పుడు చిరాగ్ పాశ్వాన్‌తో సీట్ల ఒప్పందం కుదుర్చుకోవటం గమనార్హం. దీంతో, బీజేపీ బీహార్‌లో బాబాయ్, అబ్బాయిల మధ్య చిచ్చు పెట్టిందని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. రాజకీయాల కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుందనీ, ఇలాంటివి ఒక్క బీహార్‌కు మాత్రమే పరిమితం కాలేదనీ, మహారాష్ట్ర, జార్ఖండ్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ఇది రుజువైందని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

గ్రీన్ క్రెడిట్‌పై మాజీ బ్యూరోక్రాట్ల ఆందోళన

- కేంద్రానికి బహిరంగ లేఖ



న్యూఢిల్లీ: పరిశ్రమలు, కంపెనీలు, ఇతర సంస్థలు తమ పర్యావరణ బాధ్యతలు నెరవేర్చేలా ప్రోత్సహించే లక్ష్యంతో తీసుకొచ్చిన కార్యక్రమం గ్రీన్ క్రెడిట్. మోడీ సర్కారు తీసుకొచ్చిన ఈ కార్యక్రమం.. పారిశ్రామికవేత్తలకు లబ్దిని చేకూరిస్తుంది తప్పితే.. అసలు లక్ష్యాన్ని చేరుకోదని ఇప్పటికే పలువురు పర్యావరణవేత్తలు, నిపుణులు తెలిపారు. ఇప్పుడు గ్రీన్ క్రెడిట్ నిబంధనపై మాజీ సివిల్ సర్వీసు అధికారులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి బహిరంగ లేఖను రాశారు. పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ ప్రకారం.. ఫిబ్రవరిలో గ్రీన్ క్రెడిట్ నిబంధనలను సవరించింది. ఈ చర్య పర్యావరణ అస్థిరతకు దారితీయవచ్చని పలువురు పర్యావరణ శాస్త్రవేత్తలు లేవనెత్తిన ఆందోళనలను లేఖలో వారు పేర్కొన్నారు. "ఈ నిబంధనల ప్రకారం రాష్ట్ర అటవీ శాఖలు తమ అధికార పరిధిలోని అన్ని చిన్నగా కవర్ చేయబడిన 'అటవీ' భూములను గుర్తించవలసి ఉంటుంది. ఈ భూములను ప్రయివేట్ ఏజెన్సీలు, పెట్టుబడిదారులకు మొక్కల పెంపకానికి మద్దతుగా అందించటం జరుగుతుంది. పెట్టుబడిదారుడు నిధులను చెల్లించిన తర్వాత, అటవీ శాఖ రెండేండ్లలో అడవుల పెంపకాన్ని పూర్తి చేస్తుంది. నాటిన ప్రతి చెట్టుకూ, పెట్టుబడిదారుడు ఒక గ్రీన్ క్రెడిట్ సంపాదిస్తాడు. ఈ గ్రీన్ క్రెడిట్‌లను పెట్టుబడిదారుడు అటవీ భూములను అటవీయేతర కార్యకలాపాల కోసం మళ్లించటం కోసం వర్తకం చేయవచ్చు" అని మాజీ బ్యూరోకాట్ల బృందం ఆందోళన వ్యక్తం చేసింది. "పథకంలో లోపాలు స్పష్టంగా ఉన్నాయి. మన అడవులకు, మన జీవవైవిధ్యం, వన్యప్రాణులు వృద్ధి చెందటానికి అవసరమైన భూమికి ఎంత డబ్బు అయినా ప్రత్యామ్నాయం కాదు. అయినప్పటికీ, ఇప్పటి వరకు భూమికి బదులుగా డబ్బు (గ్రీన్ క్రెడిట్ల రూపంలో) ఇవ్వటానికి అనుమతించటం ద్వారా పారిశ్రామికవేత్తలు అటవీ భూమిని పొందటాన్ని సులభతరం చేయటానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది" అని వారు లేఖలో పేర్కొన్నారు.



ముంబయికి ఎదురుదెబ్బ

తొలి లీగ్ మ్యాచ్‌లకు సూర్యకుమార్ దూరం

ముంబయి: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) సీజన్-17 మరో రెండు రోజుల్లో ప్రారంభం కానుండగా.. అన్ని ఫ్రాంచైజీలు ఆటగాళ్ల ఫిట్‌నెస్‌పై ప్రధానంగా దృష్టి సారించాయి. ఆటగాళ్లు గాయాలబారిన పడకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. నెట్ ప్రాక్టీస్‌లో ఓవైపు ఆటగాళ్లు చెమటలు చిందిస్తున్నా.. స్టార్ ఆటగాళ్లకు కొద్దిసేపు ప్రాక్టీస్‌కు మాత్రమే నిమగ్నం చేస్తున్నాయి. ఈ క్రమంలో ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్‌ను ముద్దాడిన ముంబయి ఇండియన్స్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ బ్యాటర్, మిస్టర్ 360డిగ్రీస్ సూర్యకుమార్ యాదవ్ ఫిట్‌నెస్ సాధించడంలో విఫలమైనట్లు బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సిఎ) మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. గత డిసెంబర్‌లో దక్షిణాఫ్రికా పర్యటన నుంచి గాయం కారణంగా స్వదేశానికి తిరిగొచ్చి చికిత్స చేయించుకున్న సూర్యకుమార్.. ఇంకా ఫిట్‌నెస్ సాధించలేదని ఆ ప్రకటనలో తెలిపింది. దీంతో సూర్య ఐపీఎల్ తొలి లీగ్ రెండు లేదా మూడు వారాలు దూరమయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. ముంబయి మిడిలార్డర్‌లో కీలక బ్యాటర్ అయిన సూర్యకుమార్ దూరమైతే ఆ జట్టుకు కష్టాలు తప్పవు.

మంధాన బృందానికి గార్డ్ ఆఫ్ హానర్...

రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు తొలి ట్రోఫీని అందించిన అమ్మాయిల జట్టుకు పురుషుల జట్టు 'గార్డ్ ఆఫ్ హానర్'తో ఘన స్వాగతం పలికింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా జరుగుతున్న 'ఆర్సీబీ అన్ బాక్స్' ఈవెంట్ ఇందుకు వేదికైంది. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యుపిఎల్) 2024 టైటిల్ విజేతగా నిలిచిన స్మృతి మంధాన జట్టు సభ్యులు కూడా ఈ కార్యక్రమానికి హాజరు కాగా.. ట్రోఫీతో వాళ్లు స్టేడియంలో సందడి చేశారు. డబ్ల్యుపిఎల్ టైటిల్‌తో వచ్చిన మంధాన జట్టుకు కోహ్లి, డుప్లెసిస్, గ్లెన్ మ్యాక్స్‌వెల్ వంటి దిగ్గజ క్రికెటర్లు చప్పట్లతో 'గార్డ్ ఆఫ్ హానర్' ఇచ్చారు. ఢిల్లీ నుంచి నేరుగా బెంగళూరుకు వచ్చిన ఆర్సీబీ అమ్మాయిలు.. డబ్ల్యుపిఎల్ చాంపియన్స్-2024 అని రాసి ఉన్న టీషర్ట్స్‌ను ధరించారు. ఆర్సీబీ చరిత్రలో తొలి ట్రోఫీ నెగ్గిన ఆ జట్టు.. గార్డ్ ఆఫ్ హానర్ అందుకున్న తర్వాత చిన్నస్వామి స్టేడియం అంతా కలియతిరిగారు. ప్రస్తుతం బెంగళూరులో జరుగుతున్న ఆర్సీబీ అన్‌బాక్స్ ఈవెంట్‌లో మహిళల జట్టుకు సత్కారంతో పాటు రాబోయే సీజన్‌లో పురుషుల జట్టు వేసుకోబోయే జెర్సీని రిలీజ్ చేయనున్నారు. అంతేగాక ఆర్సీబీ పేరులో స్వల్ప మార్పులు కూడా చేయనున్నారు. ఈ కార్యక్రమంలో అలన్ వాకర్, రఘు దీక్షిత్, నీతి మోహన్ వంటి సెలబ్రిటీలు పాల్గొన్నారు.



ఇస్లామాబాద్ యునైటెడ్‌కు

ఫైనల్లో ముల్తాన్ సుల్తాన్స్‌పై ఉత్కంఠ విజయం పాకిస్తాన్

కరాచీ: పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 2024 సీజన్ టైటిల్‌ను ఇస్లామాబాద్ యునైటెడ్ జట్టు మరో దఫా చేజిక్కించుకుంది. ముల్తాన్ సుల్తాన్స్‌తో సోమవారం జరిగిన ఫైనల్లో ఇస్లామాబాద్ జట్టు 2 వికెట్ల తేడాతో ముల్తాన్ సుల్తాన్‌పై విజయం సాధించింది. ఆఖరి బంతి దాకా విజయం కోసం ఇరు జట్లూ పోరాడగా.. చివరి బంతికి సింగిల్ తీసిన ఇస్లామాబాద్ ఈ లీగ్‌లో మూడో ట్రోఫీ కొట్టింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ముల్తాన్ సుల్తాన్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేయగా.. ఇస్లామాబాద్ 20వ చివరి బంతికి ఫోర్ కొట్టి ఘనవిజయాన్ని అందుకుంది. కరాచీ వేదికగా జరిగిన ఫైనల్లో ముల్తాన్స్ జట్టు కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్(26) బ్యాటింగ్‌లో నిరాశపరచగా.. ఉస్మాన్ ఖాన్(57) అర్ధ సెంచరీతో రాణించాడు. ఆఖర్లో ఇఫ్తికార్ అహ్మద్ (20 బంతుల్లో 32, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) ధాటిగా ఆడటంతో ముల్తాన్ ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. ఇస్లామాబాద్ బౌలర్లలో ఇమాద్ వసీం ఐదు వికెట్లతో రాణించగా.. సారథి షాదాబ్ ఖాన్ మూడు వికెట్లు తీశాడు. ఛేదనలో ఇస్లామాబాద్ కూడా తడబడింది. కొలిన్ మున్రో(17), అఘా సల్మాన్(10), షాదాబ్ ఖాన్(4)లు విఫలమయ్యారు. కానీ ఓపెనర్ మార్టిన్ గుప్టిల్ (32 బంతుల్లో 50, 4 ఫోర్లు), అజామ్ ఖాన్ (30)లు రాణించడంతో ఇస్లామాబాద్ విజయం దిశగా పయనించింది. కానీ కీలక సమయంలో వికెట్లు కోల్పోవడంతో ఆ జట్టుకు చివరి ఓవర్లో 8 పరుగులు అవసరమయ్యాయి. తొలి బంతికి ఇమాద్ వసీం (19 నాటౌట్) సింగిల్ తీయగా రెండో బాల్‌కు నసీమ్ షా ఫోర్ కొట్టాడు. ఆ తర్వాత రెండు బంతులకు రెండు పరుగులొచ్చాయి. కానీ ఐదో బాల్‌కు నసీమ్ ఔట్ కాగా.. ఆరో బంతికి నసీమ్ షా తమ్ముడు హునైన్ షా ఫోర్ కొట్టి మ్యాచ్‌ను ముగించాడు. ప్లేయర్ ఆఫ్ ది ఇమాద్ వాసీంకు, సిరీస్ షాదాబ్ ఖాన్‌కు లభించాయి.

ఆఫ్ఘనిస్తాన్‌దే టి20 సిరీస్

చివరి మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై 57పరుగుల తేడాతో గెలుపు



షార్జా: ఐర్లాండ్‌తో జరిగిన మూడో, చివరి టి20లో ఆఫ్ఘనిస్తాన్ జట్టు 57పరుగుల తేడాతో నెగ్గి సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. షార్జా క్రికెట్ స్టేడియంలో సోమవారం జరిగిన తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘనిస్తాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 156పరుగులు చేసింది. జద్రాన్(72నాటౌట్), మహ్మద్(27) టాప్ స్కోరర్స్. ఐర్లాండ్ బౌలర్లు అడైర్, లిట్టిల్, కార్టీ, ఛాప్టర్, డెలె, వైట్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఐర్లాండ్ జట్టు 17.2ఓవర్లలో 98పరుగులకే ఆలౌటైంది. ఆఫ్ఘన్ బౌలర్లు ఒమర్జాయ్‌కు నాలుగు, నవీన్-ఉల్-హక్‌కు మూడు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జద్రాన్‌కు సిరీస్ రషీద్ ఖాన్‌కు దక్కాయి. తొలి టి20లో ఐర్లాండ్ జట్టు 38పరుగుల తేడాతో నెగ్గితే, రెండో టి20లో ఆఫ్ఘన్ జట్టు 10పరుగుల తేడాతో గెలిచిన విషయం తెలిసిందే.

నవచిత్రం



విజువల్ వండర్..

హీరో సూర్య నటిస్తున్న పాన్ వరల్డ్ మూవీ 'కంగువ'. ఈచిత్ర టీజర్ రిలీజైంది. ఈ టీజర్ విజువల్ వండర్‌గా ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేసింది. కంగువ పాత్రలో సూర్య పోరాట యోధుడిగా కనిపించి ఆకట్టుకున్నారు.

పులితో సూర్య చేసిన ఫైట్ సీక్వెన్స్ స్క్రీన్ మీదే చూడాలని అనిపించేలా ఉంది. హార్స్ ఫైటింగ్, బిగ్ షిప్ వార్ సీన్స్‌తో వరల్డ్ సినిమా హిస్టరీలోని ఎపిక్ వార్ మూవీస్‌ను ఈ టీజర్ గుర్తు చేసింది. హై క్వాలిటీ విజువల్స్‌ను దేవిశ్రీ ప్రసాద్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ మరింత ఎలివేట్ చేసింది. ఉధిరన్‌తో కంగువ చేసిన రూత్ లెస్, ఫెరోషియస్ ఫైట్ టీజర్‌లో హైలైట్‌గా నిలిచింది.

ఈ సినిమా కోసం హీరో సూర్య పడిన శ్రమంతా ఆయన మేకోవర్, క్యారెక్టర్‌లో రిఫ్లెక్ట్ అయ్యింది. ఈ సినిమాను భారీ పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్‌గా దర్శకుడు శివ రూపొందిస్తున్నారు. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్స్ పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. పది భాషల్లో తెరకెక్కుతున్న 'కంగువ' త్రీడీలోనూ ప్రేక్షకుల ముందుకు రానుంది. పలు అంతర్జాతీయ భాషల్లోనూ ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ డేట్‌ను మేకర్స్ అనౌన్స్ చేయబోతున్నారు.

సమ్మర్ స్పెషల్‌గా రిలీజ్



సత్యం రాజేష్

సత్యం రాజేష్ కథానాయకుడిగా నటిస్తున్న ఫ్యామిలీ ఎమోషనల్ థ్రిల్లర్ 'టెనెంట్'. వై.యుగంధర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మహాతేజ క్రియేషన్స్ బ్యానర్ పై మోగుళ్ళ చంద్రశేఖర్ రెడ్డి నిర్మిస్తున్నారు. రవీందర్ రెడ్డి.ఎస్ సహ నిర్మాత. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది.

ప్రజెంట్ జనరేషన్‌లో మహిళలు ఎంత అప్రమత్తంగా ఉండాలో తెలియజేసేలా చాలా విలువైన కంటెంట్‌తో పాటు ఫ్యామిలీ ఎమోషనల్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్ మూడో వారంలో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

మేఘా చౌదరి, చందన పయావుల, భరత్ కాంత్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్: ప్రసూన మండవ, సంగీతం : సాహిత్య సాగర్, డిఒపి :జెమిన్ జోమ్ అయ్యనేత్, ఎడిటర్: విజయ్ ముక్తవరపు, కథ: యస్ శ్రీనివాస వర్మ, స్టంట్స్: రబిన్ సుబ్బు, ఆర్ట్: కరకరల చంద్ర మౌళి, సాయి.




ఆర్టికల్ 21 ఆధారంగా

మెర్సీ కిల్లింగ్

సాయి సిద్ధార్థ్ మూవీ మేకర్స్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.1గా తెరకెక్కిన సినిమా 'మెర్సీ కిల్లింగ్'. సాయి కుమార్, పార్వతీశం, ఐశ్వర్య, హారిక ప్రధాన పాత్రల్లో సిద్ధార్థ్ హరియల, మాధవి తాలబత్తుల నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని వేదుల బాల కామేశ్వరి సమర్పిస్తున్నారు. సూరపల్లి వెంకటరమణ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాకు జి.అమర్ సినిమాటోగ్రాఫి అందిస్తుండగా ఎం.ఎల్.రాజా సంగీతం అందిస్తున్నారు.

తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను యువ హీరో ఆకాష్ పూరీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'టైటిల్ చాలా ఆసక్తికరంగా ఉంది. మోషన్ పోస్టర్‌లో కాన్సెప్ట్ బాగుంది. మంచి ప్రొడక్షన్ వాల్యూస్‌తో రాబోతున్న ఈ చిత్రం హైదరాబాద్, కాకినాడ, ఉప్పాడ, అరకు వంటి అందమైన లొకేషన్స్‌లో చిత్రీకరణ చేసుకుంది. ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ మూవీ సక్సెస్ అవ్వాలని ఆశిస్తున్నాను' అని అన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది. స్వేచ్ఛ అనే అనాథ బాలిక తనకు న్యాయం జరగాలంటూ ఈ కథ ప్రారంభం అవుతుందని దర్శకుడు వెంకటరమణ ఎస్ తెలిపారు.

పవర్‌ఫుల్ ఉస్తాద్..



పవన్ కళ్యాణ్

పవన్ కళ్యాణ్ నటిస్తున్న తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీష్ శంకర్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తోంది. భగత్స్ బ్లేజ్ టీజర్‌ను విడుదల చేయడంతో మేకర్స్ ప్రేక్షకులకు, పవన్‌కళ్యాణ్ అభిమానులకు అదిరిపోయే సర్‌ప్రైజ్ ఇచ్చారు.

ఉస్తాద్ భగత్ సింగ్ తన రేంజ్‌ని విమర్శించే వారికి ఘాటుగా సమాధానం ఇస్తాడు. 'గాజు పగిలే కొద్దీ పదునెక్కుద్ది.. గ్లాసంటే సైజు కాదు.. సైన్యం.. కనిపించని సైన్యం' అని కౌంటర్ ఇవ్వడం గూస్ బంప్స్ తెప్పించింది.

పవన్ కళ్యాణ్ పాత్రను హరీష్ శంకర్ స్టైలిష్, పవర్-ప్యాక్డ్ అవతార్‌లో ప్రజెంట్ చేశారు. పంచ్ డైలాగులు పవర్ ఫుల్‌గా ఉన్నాయి. టీజర్‌లో పవన్ కళ్యాణ్ గన్స్ ఫైర్ చేయడం మెస్మరైజింగ్‌గా ఉంది. ఈ వీడియోలో హీరోయిన్ శ్రీలీల కూడా కనిపించారు

అయనంక బోస్ సినిమాటోగ్రఫీ, నిర్మాణ విలువలు అత్యున్నతంగా ఉన్నాయి. యాక్షన్ సీక్వెన్స్ అద్భుతంగా ఉన్నాయి. దేవిశ్రీ ప్రసాద్ ఆకట్టుకునే బ్యాగ్ గ్రౌండ్ స్కోర్‌తో పవన్ కళ్యాణ్ క్యారెక్టర్‌ని మరింతగా ఎలివేట్ చేశారు. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ చిత్రానికి నిర్మాతలు. ఛోటా కె ప్రసాద్ ఎడిటింగ్ చేస్తున్న ఈ సినిమా స్టంట్స్‌ని రామ్-లక్ష్మణ్ ద్వయం సమకూరుస్తున్నారు

అశుతోష్ రానా, నవాబ్ షా, అవినాష్, గౌతమి, నర్రా శ్రీను, నాగ మహేష్, టెంపర్ వంశీ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే: కె దశరధ్, సంగీతం: దేవి శ్రీ ప్రసాద్, అడిషినల్ రైటర్: సి.చంద్రమోహన్, ప్రొడక్షన్ డిజైనర్: ఆనంద్ సాయి, ఫైట్స్: రామ్ - లక్ష్మణ్, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: చంద్రశేఖర్ రావిపాటి, హరీష్ పై.

బ్యూటీఫుల్ మెలోడీ ఓ మై లిల్లీ



సిద్ధు జొన్నలగడ్డ 'డీజే టిల్లు'తో మంచి విజయాన్ని అందుకున్న విషయం విదితమే. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్' వస్తోంది. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచాయి. అలాఏగ 'టికెటే కొనకుండా', 'రాధిక' పాటలు విశేష ఆదరణ పొందాయి. సోమవారం వారం సాయంత్రం ఏఎంబీ మాల్‌లో అభిమానుల కోలాహలం మధ్య జరిగిన వేడుకలో 'ఓ మై లిల్లీ' పాటను విడుదల చేశారు. అచ్చు రాజమణి స్వరపరిచిన ఈ మెలోడీ సాంగ్ కట్టి పడేస్తోంది. గాయకుడు శ్రీరామ్ చంద్ర తన మధుర స్వరంతో మాయ చేశాడు. సిద్ధు, రవి ఆంథోనీ సాహిత్యం అద్భుతంగా కుదిరింది. తేలికైన పదాలతో లోతైన భావాన్ని పలికించారు. ఇక లిరికల్ వీడియోలో సిద్ధు, అనుపమ మధ్య కెమిస్ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

దర్శకుడు మల్లిక్ రామ్ మాట్లాడుతూ, 'ఈ పాట మీ అందరికీ నచ్చిందని భావిస్తున్నాను. విజయవంతమైన చిత్రానికి సీక్వెల్ కావడంతో ఈ సినిమా మొదలైనప్పుడే ఎంతో బాధ్యత, ఒత్తిడి ఉందని అర్థమైంది. ఈ చిత్రం ఈనెల 29న థియేటర్లలో విడుదల కానుంది. మీ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా సినిమా అందరినీ అలరిస్తుందని నమ్ముతున్నాను' అని అన్నారు.

"డీజే టిల్లు'మించేలా ఈ సినిమాని రూపొందించాము. టిల్లు పాత్ర అలాగే ఉంటుంది. కానీ కథ మాత్రం వేరేలా ఉంటుంది' అని కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. కథానాయిక అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ, 'నేను మొదటిసారి టిల్లు స్క్వేర్ కి సంబంధించిన వేడుకలో పాల్గొన్నాను. మీ స్పందన చూసి చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమా విడుదల కోసం మేం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నాం' అని అన్నారు.

'వేసవి సీజన్‌లో మొదటి సినిమాకి లబ్ధి చేకూరుతుందన్న ఉద్దేశంతో ఈనెల 29న వస్తున్నాం. ఎన్నికలు కూడా ఏప్రిల్‌లో లేకపోవడంతో కలిసొచ్చింది. డీజే టిల్లు మొదట యూత్ ఫుల్ సినిమాగా ప్రచారం పొందింది. కానీ యువతతో పాటు కుటుంబ ప్రేక్షకుల నుంచి కూడా విశేష స్పందన లభించింది. టిల్లు స్క్వేర్ కూడా యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను మెప్పించేలా ఉంటుంది' అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ అన్నారు.



మెప్పించే యూనిక్ పాయింట్

నాని మూవీ వర్క్స్, రామా క్రియేషన్స్ ఆధ్వర్యంలో విశ్వ కార్తికేయ, ఆయూషి పటేల్ హీరో,హీరోయిన్లుగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో'. ఈ మూవీకి రమాకాంత్ రెడ్డి కథ, డైలాగ్స్, స్క్రీన్ ప్లే, దర్శకత్వ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేష్‌లు నిర్మించిన ఈ చిత్రం ఈనెల 29న రాబోతోంది. ఈ నేపథ్యంలో సోమవారం ట్రైలర్‌ను ఘనంగా లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, 'మా సినిమా అంతా కూడా కడపలోనే తీశాం. దర్శకుడు రమాకాంత్ రెడ్డి సినిమాని చాలా బాగా తీశారు. మా హీరో విశ్వ కార్తికేయ మాకు ఎంతో సపోర్ట్‌గా నిలిచారు. ఆయుషి పటేల్ పాత్రకు ప్రాణం పోశారు. మా సినిమాను ప్రేక్షకులు చూసి సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

'సినిమాలో క్రైమ్ ఉంటుంది. అలా అని స్టూడెంట్స్ దాన్ని ఫాలో అవ్వొద్దు. నిర్మాత నాని సపోర్ట్‌గా నిలిచారు. హీరో విశ్వ కార్తికేయ, హీరోయిన్ ఆయుషి పటేల్ అద్భుతంగా నటించారు. ప్రేక్షకులు మా సినిమాను చూసి ఆదరించాలి' అని దర్శకుడు రమాకాంత్ రెడ్డి చెప్పారు. హీరో విశ్వ కార్తికేయ మాట్లాడుతూ, 'ఇందులో ప్రతీ పాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. అలాగే దీనిలోని జోనర్లను ప్రేక్షకులు ఎక్స్‌పీరియెన్స్ చేయబోతున్నారు. ఇది కచ్చితంగా ఓ యూనిక్ పాయింట్. ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది' అని తెలిపారు. 'ఓ మంచి కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న మా చిత్రం కచ్చితంగా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని ఆయుషి పటేల్ అన్నారు.

ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : రామ్ ప్రకాష్ రెడ్డి, సంగీత దర్శకుడు : అజయ్ అరసాద, కెమెరామెన్ : చరణ్ మాధవనేని, సాహిత్యం : చంద్రబోస్, భాస్కర భట్ల, ఎడిటర్ : గ్యారీ బీహెచ్, ఆర్ట్ డైరెక్టర్ : రవి, స్టన్స్ : ప్రేమ్ సన్, కొరియోగ్రాఫర్ : మొయిన్ మాస్టర్.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.